

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

పెరుగుతున్న ఆర్థిక అసమానతపై పట్టింపు ఏదీ?

నకిలీ మద్యం తయారీకి 'ఎఐ' సాయం! 07

సంపుటి 09, సంచిక: 328 | గురువారం | 29-10-2026 | ఖమ్మం

Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

సమష్టి కార్యాచరణ

అఖిలపక్ష నేతల సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తాం





- ముప్పును ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నది
- కరువుపై ముందస్తు కార్యాచరణ.. కేంద్రానికి నివేదిక పంపించాం
- అవసరమైతే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి రాష్ట్రానికి సాయం సాధిస్తాం
- కరువు నివారణపై అఖిలపక్ష సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీల సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కార్యాచరణతో ముందుకు వెళ్తామని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. కరువు పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక పంపించామని, అవసరమైన సమయంలో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావాల్సిన సహాయంపై విజ్ఞప్తి చేస్తామని స్పష్టం చెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడిన వర్షాభావ, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజా ప్రభుత్వం అన్ని ముందస్తు జాగ్రత్తలు, చర్యలను తీసుకుంటోందని తెలిపారు. విపత్తు పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో రాజకీయ విమర్శలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, రాష్ట్ర ప్రయోజనాల సాధనలో ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అన్ని పార్టీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశానికి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, నోడల్ అధికారి కె.రామకృష్ణారావు హాజరయ్యారు. సమావేశంలో అఖిలపక్ష

తరువాయి 8లో

కేంద్రం నుంచి ప్రత్యేక సాయం సాధించేందుకు కృషిచేయాలి

అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచన

తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంతోపాటు, కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఆర్థిక సాయం సాధించేందుకు అఖిలపక్షంగా కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. కరువు ప్రభావాన్ని కేవలం వర్షపాతం గణాంకాల ఆధారంగా కాకుండా, పర్యావరణ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత, పంటల నష్టం, ప్రజల జీవనోపాధిపై పడుతున్న ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకొని అంచనా వేయాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డితో కలిసి హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కరువు వల్ల ఇప్పటికే జరిగిన నష్టాన్ని అంచనా వేయడంతోపాటు, రానున్న రోజుల్లో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు అవసరమైన బడ్జెట్‌ను నిర్ధారించాలని అన్నారు. కరువు పరిస్థితుల తీవ్రత, ప్రభావిత ప్రాంతాలు, అవసరమైన నిధులు, చేపట్టాల్సిన చర్యలతో సమగ్ర నివేదిక రూపొందించి రాజకీయ పార్టీలకు అందిస్తే చర్చలో నిర్మాణాత్మక సూచనలు చేసేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. ఒక మండలంలో కరువు పరిస్థితులు

తరువాయి 8లో



ఆర్నాబ్‌తో ఎపి అతలాకుతలం

- నర్సాపురం సమీపంలో తీరం దాటిన తుఫాన్
- అకాల వర్షాలకు రాష్ట్రంలో ఏడుగురు మృతి
- ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

విశాఖపట్నం : ఎపిని వణికించిన 'అర్నబ్' అతి తీవ్ర తుపాను తీరం దాటింది. యానాంకు నైరుతి దిశలో నరసాపురానికి సమీపంలో తీరం దాటినట్లు విశాఖపట్నం వాతావరణ శాఖ తెలిపింది. తీరం దాటే ప్రక్రియ పూర్తయిందని, అతి తీవ్ర తుపాను తీవ్ర తుపానుగా బలహీనపడినట్లు వెల్లడించింది. తీరం దాటిన నేపథ్యంలో ఉభయ గోదావరి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఏపీకి మరో 7 రోజుల పాటు వాతావరణ హెచ్చరికలు జారీ చేశారు.

కోస్తాంధ్ర, యానాంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

పలు చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాలు తోపాటు కోస్తాంధ్ర జిల్లాలు, ఉభయగోదావరి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో జలమయమయ్యాయి. కోస్తా తీరంలో గంటకు 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు విస్తాయని, కోస్తాంధ్ర, యానాంకు భారీ వర్ష సూచన నేపథ్యంలో రాయలసీమలో మరో 4 రోజుల పాటు ఉరుములు, మెరుపులు తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటిన తీవ్ర తుఫాన్ 'అర్నాబ్' క్రమంగా బలహీనపడుతోందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అక్టోబర్ 28న విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఉదయం 11:30 గంటల సమయానికి గంటకు 5 కిలోమీటర్ల వేగంతో ఉత్తరవాయవ్య దిశగా కదులుతూ నర్సాపూర్ సమీపంలో కేంద్రీకతమై ఉన్నట్లు తెలిపింది. నర్సాపూర్‌కు ఉత్తర ఈశాన్యంగా 20 కిలోమీటర్లు, యానాంకు దక్షిణనైరుతిగా 44 కిలోమీటర్లు, కాకినాడకు

తరువాయి 12లో

జ్ఞానేశ్‌కుమార్‌పై బహిరంగ అభిశంసన

- 30న ఖర్గే నివాసంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో నిర్వహణ
- నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్ ర్యాలీకి నాందీగా సిఇసి అభిశంసన కార్యక్రమం




న్యూఢిల్లీ : ఢిల్లీలోని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో అక్టోబర్ 30 మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌పై 'బహిరంగ అభిశంసన' కార్యక్రమాన్ని ఇండియా కూటమి నిర్వహించనుంది. తొలుత అశోక్ హోటల్, రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించాలని భావించినప్పటికీ అనుమతులు నిరాకరణతో వేదికను ఖర్గే నివాసానికి మార్చారు. ఈ విషయాన్ని ఎఐసిసి కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. 'సిఇసి రాజ్యాంగ స్ఫూర్తిని, అక్షరాల స్పష్టంగా ఉల్లంఘించారు. ఆయన మన ఎన్నికల ప్రజాస్వామ్య పునాదులనే పద్ధతి ప్రకారం దెబ్బతీశారు. సూటిగా చెప్పాలంటే, ఆయన సుప్రీంకోర్టుకు అబద్ధం చెప్పారు'ని జైరామ్ రమేశ్ ఆరోపించారు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ 'బహిరంగ అభిశంసన' నిర్వహించడానికి తమకు అనుమతి నిరాకరించారని మంగళవారం కాంగ్రెస్ పేర్కొంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని అశోక్ హోటల్ మొదట ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిందని, అయితే పోలీసుల జోక్యం తర్వాత దానిని నిరాకరించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ పేర్కొన్నారు. అక్టోబర్ 25 నుండి నవంబర్ 3 వరకు రామ్‌లీలా మైదాన్‌ను కాంగ్రెస్ బుక్ చేసుకుందని, కార్యక్రమాన్ని

తరువాయి 8లో

కార్మిక కమిషనర్ ఆఫీస్ ఎదుట

ఇయు కూటమి నిరసన

కార్మికుల తీర్పును కాలరాస్తే సహించేదిలేదు : సిపిఐ శాసనసభాపక్షనేత కూనంనేని సాంబశివరావు హెచ్చరిక





ప్రజాపక్షం/హైదరాబాద్

ఆర్‌టిసిలో గెలిచిన సంఘాన్ని కాదని నిబంధనలు మార్చి ఓడిన సంఘానికి అక్రమంగా కట్టబెట్టిన ప్రాంతీయ గుర్తింపును రద్దుచేయాలని హైదరాబాద్ చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఎంప్లాయిస్ యూనియన్ కూటమి ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్, ఎన్‌ఎంయు, టిఎంయు, ఎఐటియుసి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్మిక శాఖ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, జెసిఎల్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళనకు మద్దతు ప్రకటించిన సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ,

తరువాయి 12లో

ఎల్ నినో మండల కమిటీలు ఏర్పాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పశుసంపద, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం మండలస్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపిడిఒ) నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేశారు. 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) చట్టం, 2025 (విబి జి రాంజీ)' కింద చేపట్టాల్సిన చర్యల్లో భాగంగా మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిశోర్ బుధవారం జి.ఒఆర్.టి.నంబర్ 579ను జారీ చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమన్వయ కమిటీలో పంచాయతీరాజ్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ అధికారి (ఎంపిఒ) కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖల అధికారులను కూడా కమిటీలో చేర్చుకునే అవకాశం కల్పించారు. ఈ కమిటీ గ్రామీణ కుటుంబాలకు కూలి ఉపాధి కల్పించేందుకు అన్ని గ్రామాల్లో అనుమతించదగిన పనులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటుంది. కూలీల సమీకరణ, పని దినాల కల్పన, వేతనాల సకాలంలో చెల్లింపులను పర్యవేక్షిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా అవసరమైన పనులను ముందుగానే గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

35,959 చిన్న నీటిపారుదల చెరువుల పరిధిలో పశుగ్రాసం...

రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, గ్రామీణ ఆవాసాల పరిధిలో ఉన్న 35,959 చిన్న నీటిపారుదల చెరువులను గుర్తించి, నీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పశుగ్రాసం సాగుకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి), గ్రామ సంఘాల ద్వారా పశుగ్రాసం సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటారు. వ్యవసాయ బోర్లు లేదా ఇతర నిర్ధారిత నీటి వనరులు కలిగిన

తరువాయి 8లో

నెతన్యాహూకు దక్కని మెజారిటీ

హంగ్ పార్లమెంటులో అరబ్‌పార్టీలే కీలకం

85 శాతం కౌంటింగ్ పూర్తి

08

హైదరాబాద్‌లో తాగు నీటి సమస్య

తలెత్తకుండా చర్యలు

- క్యూర్ ఏరియాలో ఎస్‌టిపిలు వంద శాతం పని చేయాలి
- భవన నిర్మాణాల్లో శుద్ధి చేసిన నీరు వినియోగించాలి
- తాగు నీరు సరఫరా, ఎస్‌టిపిలపై సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజధాని నగరం హైదరాబాద్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగు నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సిఎం సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్‌టిపిల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను

తరువాయి 12లో

పాత ఓటరు కొత్తగా

ఎందుకు దరఖాస్తు చేసుకోవాలి

సుప్రీంకోర్టు ప్రశ్న



న్యూఢిల్లీ : ఓటరు జాబితాలో అప్పటికే ఉన్న ఓటర్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ చేరుకోలేకపోయిన కారణంగా వారు ఓటు కోసం కొత్తగా ఎందుకు దరఖాస్తు చేసుకోవాలి? ఢిల్లీలో ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై పిటిషన్‌ల విచారణ సందర్భంగా ఎన్నికల కమిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం ఈ ప్రశ్న అడిగింది. ఇది ఢిల్లీకి సంబంధించే అయినా దీనిపై తుది నిర్ణయం దేశవ్యాప్త పర్యవసానం కలిగి ఉంటుంది. ఎందుకంటే, శాశ్వతంగా ఇల్లు మారారు లేదా ఇంట్లో లేరనే సాకుతో ఓటరు జాబితానుంచి తొలగించిన వ్యక్తులను, ఫారం 6 కింద కొత్తగా దరఖాస్తు చేసుకోమని ఎన్నికల కమిషన్ అధికారులు సలహా ఇస్తున్నారు. ఫారం 6 దాఖలు

తరువాయి 8లో

ఉద్దేశపూర్వకంగానే

రైళ్ల నిరాకరణ

- ఢిల్లీ నిరసనకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తోన్న కేంద్ర ప్రభుత్వం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆరోపణ
- రైల్వే జిఎం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ మెరుపు ధర్నా



ప్రజాపక్షం/ హైదరాబాద్

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలంటూ ఢిల్లీలో నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న కాంగ్రెస్ మెగా ర్యాలీకి తెలంగాణ నేతలు, కార్యకర్తలు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఆరు రోజులుగా విజ్ఞప్తి చేసినా, చివరి నిమిషంలో రైళ్లు ఇవ్వలేమని చెప్పడం ఉద్దేశపూర్వక చర్యగా అభివర్ణించారు. ఎన్ని అవాంతరాలు

తరువాయి 12లో

గణాంకాల్లో వెలుగులు.. జీవితాల్లో ఒత్తిళ్లు..

భారత దేశంలో విపరీతంగా పెరుగుతున్న ఆర్థిక అంతరాలపై కాంగ్రెస్ పార్టీ బుధవారం లేవనెత్తిన అంశాలపై లోతైన చర్చ అవసరం. ఆహార ద్రవ్యోల్బణం సామాన్యుడి జీవితాన్ని అస్తవ్యస్తం చేస్తుండగా, అసాధారణ వేగంతో అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు, విడుదల చేస్తున్న గణాంకాలు విస్మయానికి గురి చేస్తున్నాయి. నిజానికి, దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి గురించి చర్చించేటప్పుడు స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటును ఒకటే కొలమానంగా తీసుకోవడం సరైన ఆర్థిక విశ్లేషణకు దారితీయదు. దేశం ఎంత సంపదను సృష్టిస్తోంది అనే ప్రశ్నతోపాటు, ఆ సంపద ఎవరికి చేరుతోంది, సామాన్య కుటుంబాల ఆదాయాలు ఎంత పెరుగుతున్నాయి, వారి పొదుపులు ఎంత భద్రంగా ఉన్నాయి, నిత్యావసరాల ధరలు వారి జీవన ప్రమాణాలను ఏ మేరకు ప్రభావితం చేస్తున్నాయి అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు వెతకాలి. ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో కనిపించే వెలుగులకు, సామాన్యుల కుటుంబ బడ్జెట్లలో కనిపించే ఒత్తిళ్లకు మధ్య అంతరం పెరిగితే, ఆర్థిక విధానాల ఫలితాలను సమీక్షించడం అనివార్యం. ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కుటుంబాల అప్పుల భారం, తగ్గుతున్న పొదుపులపై జరుగుతున్న చర్చ ఈ ప్రాథమిక అంశాలనే ముందుకు తెస్తోంది. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతల ను అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటిగా కాంగ్రెస్ అభివర్ణించడం ఎంతైనా సముచితం. ధరల పెరుగుదలను నియంత్రించాలని, ఉపాధి అవకాశాలను విస్తరించాలని, ప్రజలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేయడం కూడా సరైనదే. దేశ సంపద పెరుగుతున్నప్పుడు మధ్యతరగతి కుటుంబాలు తమ నెలవారీ ఖర్చులను నిర్వహించడానికి అప్పు లపై ఆధారపడాల్సి వస్తే, ఆర్థికాభివృద్ధి నాణ్యతను పరిశీలించాల్సిందే. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కుటుంబాల నికర ఆర్థిక పొదుపులు తగ్గాయంటూ వెలువడిన నివేదిక ఈ చర్చకు మరింత ప్రాధాన్యం కల్పించింది. ఆ నివేదిక ప్రకారం, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో రూ.22.57 లక్షల కోట్లుగా ఉన్న నికర కుటుంబ ఆర్థిక పొదుపులు 2025–26లో రూ.21.69 లక్షల కోట్లకు పడిపోయాయి. అంటే దాదాపు నాలుగు శాతం తగ్గుదల నమోదైంది. బ్యాంకు డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్లు, ఇతర ఆర్థిక సాధనాల్లో కుటుంబాలు పెట్టుబడులు పెడుతున్నప్పటికీ, వాటి కంటే వేగం గా కొత్త అప్పులు పెరిగాయి. ఈ గణాంకాలను అర్థం చేసుకోవాలంటే స్థూల పొదుపులకు, నికర పొదుపులకు మధ్య తేడాను గుర్తించాలి. కుటుంబాలు కూడబెట్టిన ఆర్థిక ఆస్తుల నుంచి వాటి అప్పులను తీసివేసిన తర్వాత మిగిలే మొత్తమే నికర ఆర్థిక పొదుపులకు ప్రధాన సూచిక. ఆ మొత్తం తగ్గితే, కుటుంబాల ఆర్థిక భద్రతపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. కుటుంబాలు భవిష్యత్తు అవసరాల కోసం దాచుకున్న సొమ్మును ప్రస్తుత జీవన వ్యయాలకు వినియోగించాల్సి వస్తోందా? విద్య, వైద్యం, గృహవసతి, రవాణా వంటి తప్పనిసరి ఖర్చులు ఆదాయాలను మించిపోతున్నాయా? ఉపాధి అస్థిరత వల్ల కుటుంబాలు అప్పుల వైపు మళ్లుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

ధరల ఒత్తిడి, అప్పుల పెరుగుదల, పొదుపుల తగ్గుదల ఒకేసారి చోటుచేసుకుంటే కుటుంబాల కొనుగోలు శక్తిపై వాటి సమష్టి ప్రభావాన్ని ప్రభుత్వం అధ్యయనం చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నప్పటికీ, ఆ వృద్ధి ఫలాలు కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమైతే అసమానతలు మరింత పెరుగుతాయి. పెద్ద సంస్థల లాభాలు పెరగడం, ఆస్తుల విలువలు ఎగబాకడం ఆర్థిక చైతన్యానికి సంకేతాలు కావచ్చు. కానీ అదే సమయంలో సాధారణ కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోవడం అభివృద్ధిపై అనుమానాలకు తావిస్తుంది. ఆర్థిక వృద్ధి రేటు పెరగడం కంటే, సదరు వృద్ధి ఫలాలను సమాజంలోని విస్తృత వర్గాలకు చేరవేయడమే ప్రభుత్వం ముందున్న నిజమైన సవాలు. కుటుంబాల పొదుపులు తగ్గుతున్నాయనే సంకేతాన్ని నిర్లక్ష్యం చేస్తే, భవిష్యత్తులో వినియోగం, పెట్టుబడులు, ఆర్థిక స్థిరత్వంపై ప్రతికూల ప్రభావాలు పడవచ్చు. ధరల భారం, ఉపాధి అనిశ్చితి, అప్పుల ఒత్తిడి మధ్యతరగతి నుంచి పేద కుటుంబాల వరకు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంటే, దేశం అభివృద్ధి సాధిస్తున్నదని, ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నదని భుజాలు చరుచుకోవడంలో అర్థం లేదు. కాగితాల్లో కనిపించే వృద్ధి.. కేవలం లెక్కలకే పరిమితమయ్యే అభివృద్ధి సామాన్యుడికి ఊరటనివ్వవు. జీవన ప్రమాణాలను మెరుగుపరచవు. ఆర్థిక సమస్యలను దూరం చేయవు. ఆర్థిక వ్యవస్థ విజయాన్ని కొలిచే గణాంకాలు ప్రజల జీవితాల్లో కనిపించే మెరుగుదలతో సరిపోలినప్పుడే అభివృద్ధిపై విశ్వాసం బలపడుతుంది. లేకపోతే వృద్ధి గణాంకాలు ఒక కథ చెబుతుంటే, కుటుంబాల ఖర్చుల పుస్తకాలు మరో కథ చెబుతాయి. ఆ రెండు కథల మధ్య అంతరాన్ని తగ్గించడమే బాధ్యతాయుతమైన ఆర్థిక పాలనకు నిజమైన పరీక్ష. అలాంటి పరీక్షను ఎదుర్కోవడానికిగానీ, వాస్తవ పరిస్థితులను అంగీకరించడానికిగానీ మోదీ సర్కారు సిద్ధంగా ఉన్నదా? అనేది ప్రశ్న. నిజాన్ని అంగీకరించి, పరిస్థితులను సమీక్షించి, గణాంకాలను వాస్తవాలతో సమీక్షించినప్పుడే పారదర్శకమైన ఆర్థిక ముఖచిత్రం ఆవిష్కృతమవుతుంది. నిజాలను మరుగున ఉంచి, ఎవరికీ ప్రయోజ నం లేని లెక్కలను ప్రస్తావించి, వేగవంతమైన అభివృద్ధి పేరుతో ప్రకటనలు గుప్పించడం ఆత్మవంచనే అవుతుంది.

ఆర్థిక వృద్ధి గణాంకాలను ప్రస్తావిస్తూ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠతను వివరించినంత మాత్రాన ప్రజలు వృద్ధి ఫలాలను అనుభవిస్తున్నారని అనుకోవడానికి వీల్లేదు. ధరల పెరుగుదల, అప్పుల భారం, ఉద్యోగ అవకాశాల క్షీణత వంటి అంశాలపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శల్లో నిజాయితీ ఉంది. దీనిని, ఒక రాజకీయ ప్రకటనగానో, ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఉపయోగిస్తున్న అస్త్రంగానో భావించడం తప్పు. ప్రజలకు మేలు జరగనప్పుడు, జరిగిన అభివృద్ధి ఫలితం ఏమిటి? పారదర్శకమైన గణాంకాలు, నిరంతర పరిశీలన, వాస్తవ పరిస్థితులకు అనుగుణమైన విధానాలు అవసరం. ద్రవ్యోల్బణం తగ్గుతోందని చెప్తున్న ప్రభుత్వం, ఆ తగ్గుదల ప్రజల రోజువారీ ఖర్చుల్లో ఎంతవరకు ప్రతిబింబిస్తోందో కూడా వివరించాలి. వృద్ధి రేటు పెరిగిందని ప్రకటిస్తే, ఉద్యోగాలు, వేతనాలు, కుటుంబ పొదుపులు, వినియోగ సామర్థ్యంలో వచ్చిన మార్పులను కూడా వెల్లడించాలి. ఆర్థిక వృద్ధి ప్రజల జీవితాల్లో భద్రతను, అవకాశాలను, కొనుగోలు శక్తిని పెంచాలి. ఇందుకోసం ప్రభుత్వం ఉపాధి సృష్టికి ప్రాధాన్యం ఇవ్వాలి, ధరల నియంత్రణకు సమర్థమైన చర్యలు తీసుకోవాలి, వేతనాల వాస్తవ విలువను కాపాడాలి, కుటుంబాల అప్పుల పరిస్థితిపై క్రమబద్ధమైన సమాచారాన్ని అందించాలి. అలాంటి నిజాయితీ ఉంటే, తక్షణమే గణాంకాలను విశ్లేషించి, వృద్ధి ఫలాలు సామాన్యుల వరకూ ఎందుకు చేరడం లేదో గుర్తించాలి. పెరుగుతున్న ఆర్థిక అసమానతల మూలాలను వెతికి పట్టుకోవాలి. నివారణ చర్యలు చేపట్టాలి. అప్పుడే అభివృద్ధిపై వెలువడుతున్న ప్రకటనలకు, గణాంకాలకు విలువ. ప్రజలకు ఆర్థిక భద్రత.



మందుల ధరలపై నియంత్రణ లేదా?

ఖరీదైన మందులు, ఆసుపత్రుల భారీ బిల్లుల సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అధికార గర్వంతో ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ ఘోర వైఫల్యమే. మందుల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పి), రిటైలర్లకు విక్రయించే ధర మధ్య భారీ వ్యత్యాసం ఉందని సుప్రీంకోర్టు ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలి. మందుల ధరలపై ప్రభుత్వానికి నియంత్రణ లేదా? లేక ధరల దోపిడీకి సమర్థన ఉందా? వైద్యం కోసం భారీ మొత్తాలను చెల్లించాల్సి రావడం సాధారణ కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నది. ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఔషధ కంపెనీల లాభాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రజలకు అందుబాటు ధరల్లో మందులు, తక్కువ ఖర్చుతో చికిత్స అందేలా చూడాలి. వైద్యం కోసం సామాన్యులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తే, అలాంటి పరిస్థితులను ఏ విధంగా 'అచ్చే దిన్' అంటాం?'.

– కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జై రాం రమేశ్

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం... అవగాహనే రక్ష!

మానవ శరీరంలో అత్యంత సంక్లిష్టమైన, కీలకమైన అవయవం మెదడు. అటువంటి మెదడుకు రక్తప్రసరణ ఆగిపోవడం ద్వారా క్షణాల్లో ప్రాణాలను సైతం తీసేయగల అత్యంత ప్రమాదకరమైన వైద్య అత్యవసర పరిస్థితి 'స్ట్రోక్' లేదా పక్షవాతం. నాడులు, రక్తనాళాల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపే ఈ వ్యాధి, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం కోట్లాదిమంది జీవితాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఈ తీవ్రమైన ఆరోగ్య సవాలుపై ప్రపంచ సమాజాన్ని చైతన్యపరచడానికి, బాధితులకు సత్వర వైద్య సేవలు అందేలా చూడటానికి, మరియు ముందస్తు నివారణా చర్యల పట్ల విస్తృత అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న 'ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం'ను నిర్వహిస్తున్నారు. ఆధునిక యుగంలో మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం మరియు మానసిక ఒత్తిడి పెరగడం వల్ల స్ట్రోక్ అనేది ఒక మహమ్మారిలా విస్తరిస్తున్న నేపథ్యంలో, ఈ రోజు ప్రాధాన్యత ఎంతగానో పెరిగింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO), వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి నాలుగు సెకన్లకు ఒకరికి స్ట్రోక్ వస్తోంది, అలాగే ప్రతి ఆరు సెకన్లకు ఒకరు దీనివల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ఈ వ్యాధి కేవలం వయోవృద్ధులలోనే ఎక్కువగా కనిపించేది. కానీ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, విపరీతమైన మానసిక ఒత్తిడి, సమయం లేని ఆహార అలవాట్ల వల్ల 30 నుండి 40 ఏళ్ల లోపు యువతలో కూడా స్ట్రోక్ కేసులు గణనీయంగా పెరుగుతుండటం ఆందోళనకరమైన అంశం. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో గ్రామీణ ప్రాంతాల్లో సరైన అత్యవసర వైద్య సౌకర్యాలు లేకపోవడం వల్ల స్ట్రోక్ బారిన పడిన వారు సకాలంలో వైద్యం అందక తీవ్ర వైకల్యానికి గురవుతున్నారు. స్ట్రోక్ వచ్చినప్పుడు సమయానికి వైద్యం అందడం అత్యంత కీలకం. స్ట్రోక్ లక్షణాలను సులభంగా గుర్తించడానికి F.A.S.T. అనే సూత్రాన్ని ఉపయోగిస్తారు F (Face ముఖం) నవ్వినప్పుడు ముఖం ఒక వైపుకు వంగిపోవడం.

A(Arms) చేతులను పైకి ఎత్తమన్నప్పుడు ఒక చేయి బలహీనపడి కిందకు పడిపోవడం. S(Speech మాట) మాట ముద్దగా రావడం లేదా స్పష్టంగా మాట్లాడలేకపోవడం. T (Time సమయం) ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం అందించ డం.

స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచే ప్రధాన అంశాలలో అధిక రక్తపోటు, మధుమేహం,అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు, పొగాకు వాడకం మరియు మద్యం సేవనం ముఖ్యమైనవి. అయితే, సరైన జాగ్రత్తలు పాటిస్తే 90% స్ట్రోక్ కేసులను నివారించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం, ఈత లేదా వేగంగా నడవడం అలవాటు చేసుకోవాలి. ఉప్పు, నూనె మరియు జంక్ ఫుడ్ తగ్గించి, పీచు పదార్థాలు, తాజా పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. బిపి, షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను తరచుగా పరీక్షించుకుంటూ నియంత్రణ లో ఉంచుకోవాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ధూమపానం, మద్యం సేవనాన్ని పూర్తిగా మానాలి. స్ట్రోక్ అనేది కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు; అది ఆ కుటుంబం యొక్క ఆర్థిక, సామాజిక పునాదులను దెబ్బతీస్తుంది. 'సమయమే మెదడు' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ప్రభుత్వాసుపత్రుల లో స్ట్రోక్ అత్యవసర చికిత్సా విభాగాలను విస్తరించడం, గ్రామీణ స్థాయి లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ప్రతి పౌరుడు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మాత్రమే స్ట్రోక్ రహిత సమాజాన్ని నిర్మించవచ్చు.

(అక్టోబర్ 29 ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం)

సుధాకర్ ఏవి, 9000674747

పాఠ్యపుస్తకాల్లో సెంగోల్ : చరిత్రా? రాజకీయ ప్రతీకవాదమా?

పాఠశాల పాఠ్యపుస్తకాల్లో సెంగోల్ చేర్పు చారిత్రక ఆధారాలకు, రాజకీయ వ్యాఖ్యానాలకు మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తోంది. ఎన్‌సిఇఆర్‌టి తాజాగా విడుదల చేసిన తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో సెంగోల్‌ను చేర్చడం ఒక మౌలిక ప్రశ్నను లేవనెత్తుతోంది: వివాదాస్పదమైన చారిత్రక కథనాన్ని స్థిరపడిన వాస్తవం గా విద్యార్థులకు బోధిస్తున్నారా? పాలన, సుపరిపాలనకు సంబంధించిన సాంస్కృతిక చిహ్నంగా పేర్కొన్న ఈ రాజదండానికి, 2023 మేలో కొత్త పార్లమెంటు భవనంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠించినప్పటి నుంచి రాజకీయ ప్రాధాన్యం పెరిగింది.

సెంగోల్‌ను జాతీయ పాఠ్యపుస్తకంలో చేర్చడం ద్వారా, బ్రిటిష్ పాలన నుంచి స్వతంత్ర భారతదేశానికి అధికార బదిలీకి అది ప్రతీకగా నిలిచిందనే వాదనకు సంస్థాగత గుర్తింపు లభిస్తోంది. అయితే, 1947లోజవహర్‌లాల్ నెహ్రూకు సెంగోల్‌ను బహూకరించినట్లు చారిత్రక కథనాలు సూచిస్తున్నప్పటికీ, అధికార బదిలీకి అదే అధికారిక చిహ్నంగా నిర్ణయించబడిందనే వాదన వివాదాస్పదంగానే ఉంది. నమోదైన చారిత్రక సంఘటనకు, దానికి ఆ తర్వాత ఆపాదించిన రాజకీయ అర్థానికి మధ్య తేడాను గుర్తించడం చరిత్ర రచనలో అత్యంత కీలకం. మొఘలులు, ఢిల్లీ సుల్తానుల పాలనకు సంబంధించిన అంశాలను ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడం లేదా తగ్గించడం వంటి మార్పుల నేపథ్యంలో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. భారతీయ నాగరికత వారసత్వంపై దృష్టి పెడుతున్నామనే వివరణతో చేపట్టిన ఈ మార్పులు, పాఠ్యప్రణాళిక రూపకల్పనకు చారిత్రక పరిశోధన మార్గదర్శకమా, సమకాలీన భావజాల ప్రాధాన్యతలా అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. లక్షలాది మంది విద్యార్థులు ఆధారపడే పాఠ్యపుస్తకాలు ఎంపిక చేసిన చరిత్రను మాత్రమే బోధించే సాధనాలుగా మారకూడదు.

చారిత్రక ఆధారాలా? అధికారిక కథనమా?

2023లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన కథనం ప్రకారం, అధికార బదిలీకి భారతీ య సంప్రదాయాలకు అనుగుణమైన చిహ్నం ఏమిటని అప్పటి వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటన్ నెహ్రూను అడిగారు. అనంతరం నెహ్రూ, చరిత్రపై ఆసక్తి కలిగిన సి. రాజగోపాలాచారిని సంప్రదించగా, ఆయన చారిత్రక పరిశోధన అనంతరం సెంగోల్‌ను తగిన చిహ్నంగా సూచించినట్లు పేర్కొన్నారు. అయితే, నెహ్రూకు ఒక రాజదండాన్ని బహూకరించారనే వాస్తవం ఒక్కటే, బ్రిటిష్ సార్వభౌమాధికారాన్ని భారతదేశానికి బదిలీ చేసిన అధికారిక చిహ్నం అదే అని నిరూపించదు. మౌంట్‌బాటన్, రాజగోపాలాచారిలకు సంబంధించిన ఈ కథనానికి స్వతంత్ర చారిత్రక ఆధారాల ధ్రువీకరణ అవసరం.

చారిత్రక ఆధారాలు నిర్ధారిస్తున్న అంశాలు, చరిత్రకారులు చేస్తున్న విశ్లేషణలు, ఇంకా వివాదాస్పదంగా ఉన్న విషయాల మధ్య తేడాను బాధ్యతాయుతమైన పాఠ్యపుస్తకం స్పష్టంగా వివరించాలి. రాజకీయంగా ప్రాచుర్యం పొందిన ఒక వ్యాఖ్యానాన్ని స్థిరపడిన చారిత్రక వాస్తవంగా చూపించడం చరిత్ర విద్య లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది. తమిళ శైవ సంప్రదాయాలు, రాజరిక ప్రతీకలతో సంబంధం ఉన్న సెంగోల్‌కు సాంస్కృతిక, మతపరమైన ప్రాధాన్యం ఉంది. రాజాధికారానికి, న్యాయబద్ధమైన పాలనకు సంబంధించిన భావనలను ప్రతిబింబించే చారిత్రక వస్తువుగా దాన్ని అధ్యయనం చేయవచ్చు. అయితే, రాజరికానికి సంబంధించిన చిహ్నా న్ని ఆధునిక గణతంత్ర రాజ్య ప్రజాస్వామ్య సార్వభౌమాధి కారంతో సమానంగా చూడలేం.

లౌకిక గణతంత్రంలో మతపరమైన చిహ్నం

సెంగోల్‌కు సంబంధించిన రాజకీయ అర్థాన్ని 1947లోనే ప్రశ్నించారు. ఆ తర్వాత తమిళనాడు ముఖ్యమంత్రిగా పనిచేసి, ద్రవిడ మున్నేట్ర కళగం (డిఎంకె)ను స్థాపించిన సి.ఎన్.అన్నాదురై, స్వాతంత్ర్య సమయంలో ఒక లౌకిక రాజకీయ నాయకుడికి మతపరమైన చిహ్నాన్ని అందించడం ఎంతవరకు సముచితమనే అంశాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. పరిశోధకురాలు, అనువాదకురాలు వి.గీత వివరించిన ప్రకారం, మతాధికారం, సంపద, రాజకీయ అధికారాల మధ్య ఉన్న సంబంధాన్ని అన్నాదురై ప్రశ్నించారు. కొత్త రాజకీయ వ్యవస్థలోనూ తమ ప్రభావాన్ని కొనసాగించుకోవాలనే ఉద్దేశం మత సంస్థలకు ఈ బహూకరణ వెనుక ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.



సెంగోల్‌ను జాతీయ విముక్తికి తిరుగులేని చిహ్నంగా అందరూ అంగీకరించలేదని ఆయన విమర్శ స్పష్టం చేస్తోంది. అది అప్పట్లోనూ రాజకీయ, భావజాల చర్చలకు కేంద్రంగా నిలిచింది. ఈ దృక్పథాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చడం ద్వారా, స్వాతంత్ర్యాన్ని ఒకే ఉత్సవపూర్వక సంఘటనకు పరిమితం చేయకుండా, సంక్లిష్టమైన చారిత్రక పరివర్తనగా విద్యార్థులు అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

భారతీయ సాంస్కృతిక చరిత్రలో మతపరమైన చిహ్నాలకు స్థానం ఉందా లేదా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. వాటికి నిస్సందేహంగా స్థానం ఉంది. రాజరిక, మతపరమైన అధికారాలతో సంబంధం ఉన్న ఒక చిహ్నానికి రాజ్యాంగ ప్రజాస్వామ్య చరిత్రలో నిర్దిష్టమైన, తిరుగులేని అర్థాన్ని ఆపాదించవచ్చా అన్నదే అసలు ప్రశ్న. భారతదేశ స్వాతంత్ర్యం వలస పాలనకు ముగింపు పలికి, ప్రజలను స్వతంత్ర దేశ పౌరులుగా నిలబెట్టింది. భారత గణతంత్రానికి పునాదులు ప్రజల సార్వభౌమాధికారం, చట్టం ముందు సమాన త్వం, ప్రజాస్వామ్య సంస్థలు. రాజరిక అధికారాన్ని పవిత్రీకరించడం కాదు. సెంగోల్‌ను ఈ విస్తృత రాజ్యాంగ పరివర్తన నేపథ్యంలోనే అర్థం చేసుకోవాలి.

చోళుల వారసత్వం – రాజకీయ స్వాధీనత

సెంగోల్‌కు తిరిగి ప్రాధాన్యం కల్పించడం, తమిళనాడులో బిజెపి తన రాజకీయ ఉనికిని విస్తరించుకునే ప్రయత్నాలతోనూ ముడిపడి ఉంది. లార్డ్స్ ఆఫ్ ఎర్త్ అండ్ సీ: ఎ హిస్టరీ ఆఫ్ ది చోళ ఎంపైర్ గ్రంథ రచయిత, ప్రజా చరిత్రకారుడు అనిరుధ్ కనిసెట్టి అభిప్రాయం ప్రకారం, చోళుల చరిత్రను విస్తృత హిందుత్వ కథనంలో భాగం చేయడం వల్ల ప్రాంతీయ చరిత్ర సమకాలీన రాజకీయ లక్ష్యాలకు లోబడి పోయే ప్రమాదం ఉంది.

చోళ రాజవంశం పరిపాలన, సముద్ర వాణిజ్యం, వాస్తుశిల్పం, దేవాలయాల నిర్మాణం, కళారంగాల్లో విశేష కృషి చేసింది. దాని చారిత్రక వారసత్వాన్ని సమగ్రంగా, ఆధారాలతో అధ్యయనం చేయాలి. దాన్ని మత జాతీయవాదానికి లేదా సమకాలీన సాంస్కృతిక ప్రతిఘటనకు ప్రతీకగా మాత్రమే కుదించడం దక్షిణ భారత చరిత్రపై ప్రజల అవగాహనను పరిమితం చేస్తుంది.

చారిత్రక వ్యక్తులు, చిహ్నాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం ఏ ఒక్క పార్టీ కి మాత్రమే పరిమితం కాదు. వివిధ భావజాలాలకు చెందిన ప్రభుత్వాలు ప్రస్తుత అధికారానికి చారిత్రక సమర్థన కల్పించేందుకు గతాన్ని ప్రస్తావిస్తుంటాయి. అయితే, విద్యాసంస్థల బాధ్యత అటువంటి కథనాలను యథాతథంగా ఆమోదించడం కాదు; వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించడం. సెంగోల్ తమిళ సాంస్కృతిక వారసత్వాన్ని, శైవ సంప్రదాయాలను, న్యాయబద్ధమైన పాలనకు సంబంధించిన ఆదర్శాలను సూచించవచ్చు. ఈ అర్థాలు పరస్పర విరుద్ధమైనవి కావు. కానీ రాజరిక చిహ్నాన్ని ప్రజాస్వామ్య అధికార బదిలీతో సమానంగా చూపించే ఏకపక్ష రాజకీయ కథనంలో వాటన్నింటినీ ఇమిడ్చకూడదు.

పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు ఏమి అందించాలి?

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాలకు ప్రజల్లో విశేషమైన విశ్వసనీయత ఉంది. ఆధారాలను, వ్యాఖ్యానాలను వేరు చేయడం, చారిత్రక భిన్నాభిప్రాయాలను గుర్తించడం, భావజాలపరమైన సరళీకరణకు దూరం గా ఉండడం ద్వారానే ఆ విశ్వసనీయత నిలబడుతుంది.

సెంగోల్‌ను సాంస్కృతిక వారసత్వ చిహ్నంగా పేర్కొంటే, రాజరికం, శైవ సంప్రదాయాలతో దానికున్న సంబంధాన్ని పాఠ్యపుస్తకం వివరించాలి. 1947లో నెహ్రూకు దాన్ని అందించిన సంఘటనను ప్రస్తావి స్తే, ఆ బహూకరణకు సంబంధించిన ఆధారాలను, అధికార బదిలీకి అదే అధికారిక చిహ్నమనే వివాదాస్పద వాదనను వేరుగా చూపించాలి. సమకాలీన రాజకీయ చర్చలో సెంగోల్‌కు ఆపాదిస్తున్న అర్థాలనూ విద్యార్థులకు పరిచయం చేయాలి. ఇలాంటి విధానం సెంగోల్ సాంస్కృతిక ప్రాధాన్యాన్ని తగ్గించదు. చారిత్రక చిహ్నాలు వేర్వేరు కాలాల్లో, రాజకీయ సందర్భాల్లో కొత్త అర్థాలను ఎలా సంతరించుకుంటాయో విద్యార్థులు అర్థం చేసుకునేందుకు దోహదపడుతుంది.

భారత చరిత్రలోని ప్రతి కాలానికీ ఇదే ప్రమాణాలు వర్తించాలి. మొఘలులు, ఢిల్లీ సుల్తానులు, ప్రాంతీయ రాజవంశాలు, మత సంస్థలు, కుల వ్యతిరేక ఉద్యమాలు వంటి అంశాలను ఆనాటి రాజకీయ ప్రాధాన్యతలను బట్టి చేర్చడం లేదా తొలగించడం కాకుండా, ఆధారాలు, విమర్శనాత్మక విచారణల ఆధారంగా బోధించాలి. చరిత్ర విద్య లక్ష్యం ఎంపిక చేసిన పాలకులు, మత సంప్రదాయాలు లేదా రాజకీయ కథనాల పట్ల గుడ్డి భక్తిని పెంపొందించడం కాదు. గతాన్ని, వర్తమానంపై దాని ప్రభావాన్ని విద్యార్థులు సమగ్రంగా అర్థం చేసుకునేలా చేయడం. సెంగోల్‌కు భారత చరిత్రలో స్థానం ఉంది. కానీ దాన్ని పాఠ్యపుస్తకంలో చేర్చినంత మాత్రాన వివాదాస్పద వ్యాఖ్యానం ప్రశ్నించరాని జాతీయ కథనంగా మారకూడదు. చారిత్రక ఆధారాలకు, రాజకీయ వాదనలకు మధ్య; సాంస్కృతిక స్మృతికి, రాజకీయ స్వాధీనతకు మధ్య; రాజరిక ప్రతీకవాదానికి, ప్రజాస్వామ్య సార్వభౌమాధికారానికి మధ్య తేడాను గుర్తించడం నేర్పడమే విద్య అసలు లక్ష్యం.

డా.ముచ్చుకోట సురేష్ బాబు

ఆకాశం వైపు అడుగులు..నేలను కోల్పోతున్నామా?

చంద్రుడిపై అడుగులు వేయాలని, అంగారకుడి రహస్యాలను ఛేదించాలని, అంతరిక్షంలో కొత్త ప్రపంచాలను అన్వేషించాలని మానవ మేధస్సు నిరంతరం ముందుకు సాగుతోంది. ఈ విజయాలు శాస్త్రీయ పురోగతికి గర్వకారణాలు. అయితే అంతరిక్షంలో కొత్త చరిత్రను లిఖిస్తున్న మనిషి, తాను జీవిస్తున్న భూమి భవిష్యత్తును కూడా అంతే శ్రద్ధతో కాపాడుకోవాలి. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా 2026 ఫిబ్రవరి 27న ప్రకటించిన ఆర్టెమిస్ కార్యక్రమ మార్పులు చంద్రుడిపై మానవ అన్వేషణను మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యాన్ని చాటాయి. ఈ సాంకేతిక విజయాల స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చి కార్యాచరణ సాగితే అభివృద్ధికి మరింత సార్థకత చేకూరుతుంది. ఐక్యరాజ్యసమితి–2025 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల నివేదిక ప్రకారం, 2000 నుంచి 2020 మధ్య ప్రపంచ అటవీ విస్తీర్ణం సుమారు పది కోట్ల హెక్టార్లు తగ్గింది. 2020 నాటికి ప్రపంచ భూభాగంలో అడవుల వాటా 31 శాతంగా నమోదైంది. అటవీ నష్టానికి వ్యవసాయ విస్తరణ ప్రధాన కారణం. ఈ గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, శాస్త్రీయ పరిజ్ఞానం, సమర్థవంతమైన విధానాలు, ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి సంపదను పునరుద్ధరించే అవకాశాలు ఇంకా ఉన్నాయి.

స్థానిక జ్ఞానం ప్రపంచానికి వెలుగు

తెలంగాణలోని ఆదిలాబాద్ ప్రాంతంతో పాటు మధ్య భారతదేశంలోని పలు ప్రాంతాల్లో గోండు సమాజం ప్రకృతి తో ముడిపడిన ప్రత్యేక జీవన సంప్రదాయాలను కొనసాగిస్తోంది. అడవులు, నీటి వనరులు, స్థానిక జీవవైవిధ్యం, సామూహిక ఆచారాలు వారి సాంస్కృతిక వారసత్వంలో భాగం. ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో భాషకు కీలక స్థానం ఉంది. ఆదిలాబాద్ జిల్లా గుంజాల గ్రామంతో అనుబంధం కలిగిన గుంజాల గోండి లిపికి యూనికోడ్ ప్రమాణంలో ప్రత్యేక కోడ్ పరిధి ఉండటం భాషా పరిరక్షణలో ముఖ్యమైన ముందడుగు. దీనివల్ల కంప్యూటర్లు, డిజిటల్ పరికరాల్లో ఈ లిపిని ఉపయోగించడం, పుస్తకాలు, పత్రాలను భద్రపరచడం, భాషా సమాచారాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం సాధ్యమైంది. అయినప్పటికీ డిజిటల్ గుర్తింపుతోనే సంస్కృతి పరిరక్షణ పూర్తి కాదు. మాతృభాషలో విద్యకు ప్రోత్సాహం, స్థానిక చరిత్రను పత్రబద్ధం చేయడం, సంప్రదాయ జ్ఞానాన్ని సంబంధిత సమాజా ల సమ్మతితో భద్రపరచడం, యువతకు తమ వారసత్వాన్ని పరిచయం చేయడం అవసరం. గోండు సమాజం ప్రకృతితో ఏర్పరచుకున్న అనుబంధాన్ని గౌరవిస్తూ, వారి భాషకు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో తగిన స్థానం కల్పించడం సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతుంది. స్థానిక సంస్కృతిని కాపాడటం అంటే గతాన్ని మాత్రమే సంరక్షించడం కాదు.



భవిష్యత్తుకు అవసరమైన జ్ఞానాన్ని కూడా భద్రపరచ డం.

పర్యావరణ సమతుల్యతే అసలైన ప్రగతి

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణానికి ఎదురవుతున్న సవాళ్లు తీవ్రమైనవే అయినప్పటికీ, కొన్ని రంగాల్లో ఆశాజనక మార్పులు కనిపిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి 2025 నివేదిక ప్రకారం, ప్రపంచంలో వార్షిక అటవీ నష్టం 2010–2015 మధ్య సుమారు 1.2 కోట్ల హెక్టార్లుగా ఉండగా, 2015–2020 మధ్య సుమారు కోటి హెక్టార్లకు తగ్గింది. ఇది సానుకూల పరిణామమే అయినా, అడవుల నష్టం పూర్తిగా ఆగలేదన్న వాస్తవాన్ని గుర్తించాలి. మరోవైపు భూక్షీణతకు గురైన భూభాగం ప్రపంచవ్యాప్తంగా 2015లో 11.3 శాతంగా ఉండగా, 2019 నాటికి 15.5 శాతానికి పెరిగింది. దీని ప్రభావం సుమారు 320 కోట్లమంది ప్రజల జీవనంపై పడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో అటవీ పునరుద్ధరణ, నేల నాణ్యత మెరుగుదల, నీటి వనరుల సంరక్షణ, స్థానిక సమాజాల భాగస్వామ్యానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. మొక్కలు నాటిన సంఖ్య ఒక్కటే విజయానికి కొలమానం కాకూడదు.నాటిన మొక్కలు బతికి పెరుగుతున్నాయా, స్థానిక జీవవైవిధ్యానికి తోడ్పడుతున్నాయా, నేల ఆరోగ్యం మెరుగు పడుతోందా అనే అంశాలను కూడా పరిశీలించాలి.

హక్కుల గౌరవంతోనే సమగ్ర అభివృద్ధి

భారతదేశంలో ఆదివాసీ సమాజాల హక్కులు, జీవనోపాధి, సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించేందుకు రాజ్యాంగం, చట్టాలు కీలకమైన ఆధారాలను కల్పిస్తున్నాయి. రాజ్యాంగంలోని 342వ అధికరణం షెడ్యూల్డ్ తెగల గుర్తింపునకు సంబంధించినది. షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక స్వపరిపాలనకు 1996 పీసా చట్టం, అటవీ నివాసుల హక్కుల గుర్తింపునకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. అయితే చట్టాల ప్రయోజనం అర్హులైన ప్రజలకు చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుంది. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2026 ఆగస్టు 12న రాజ్యసభకు అందించిన సమాచారం ప్రకారం, జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా అటవీ హక్కుల చట్టం కింద దాదాపు 54,01,561 దరఖాస్తులు అందాయి. వాటిలో 25,42,359 హక్కుల పత్రాలు జారీ కాగా, 18,13,232 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి; 10,45,970 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జారీ చేసిన పత్రాల్లో 24,18,197 వ్యక్తిగత హక్కులకు, 1,24,162 సామూహిక హక్కులకు సంబంధించినవిగా తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, అటవీ శాఖలు, గ్రామసభలు సమన్వయంతో పనిచేస్తే హక్కుల అమలు మరింత మెరుగుపడుతుంది. అంతరిక్షాన్ని చేరడం మానవ మేధస్సుకు నిదర్శనం. భూమిని భావితరాలకు భద్రంగా అందించడం ఆ మేధస్సుకు అసలైన బాధ్యత. ప్రకృతిని కాపాడే అభివృద్ధి, ఆదివాసీ హక్కులను గౌరవించే పాలన, స్థానిక జ్ఞానానికి గుర్తింపు కలిసినప్పుడే ప్రగతికి సంపూర్ణ అర్థం చేకూరుతుంది. భావితరాలు గర్వంగా చదివే అంతరిక్ష విజయాల చరిత్రను లిఖించడమే కాదు.. అవి గర్వంగా జీవించేలా పచ్చని భూమిని వారసత్వంగా అందించడమే మానవ ప్రగతికి అసలైన విజయం.

ఫిరోజ్ ఖాన్, 9640466464

ఆ కార్యాలయంలో ఏం జరుగుతోంది?

- టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ హెడ్ ఆఫీసులో వివాదాస్పద పోస్టింగులు
- సమగ్ర విచారణకు ఉద్యోగ వర్గాల డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్) ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల విధుల కేటాయింపు, పోస్టింగుల వ్యవహారం వివాదాస్పదంగా మారుతోంది. పాఠశాలల్లో పని చేయాల్సిన సిబ్బంది ప్రధాన కార్యాలయానికి పరిమితం కావడం, కొందరిని అధికారుల వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు, ఏళ్ల తరబడి ఒకే చోట పోస్టింగులు కొనసాగడంపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారాలపై శాఖ నూతన కార్యదర్శి దృష్టి సారించి, సమగ్ర విచారణతో వాస్తవాలను వెలికితీయాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.

విధుల కేటాయింపులో పారదర్శకత ఏదీ?

టిజిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ ప్రధాన కార్యాలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం ద్వారా ఉద్యోగుల పోస్టింగులు, విధుల కేటాయింపు జరుగుతున్న తీరుపై కూడా కొన్ని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉద్యోగులు సుదీర్ఘకాలంగా హెడ్ ఆఫీసులోనే కొనసాగుతుండగా, మరికొందరికి విధుల కేటాయింపులో భిన్నమైన వెసులుబాట్లు లభిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. విధుల కేటాయింపుల విషయంలో ఒత్తిళ్లు ఎదురవుతున్నాయని కొందరు నాలుగో తరగతి ఉద్యోగులు చెబుతున్నట్లు సమాచారం. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరి పదోన్నతులు పొందిన కొందరు సిబ్బంది ఏళ్ల తరబడి ప్రధాన కార్యాలయంలోనే కొనసాగుతున్నారనే అంశంపైనా చర్చ జరుగుతోంది. హెడ్ ఆఫీసులో పోస్టింగుల కోసం డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి హెడ్‌ఆఫీసులోనే పోస్టింగులు

ఇటీవల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా గ్రూప్3, గ్రూప్4 కేటగిరీలకు చెందిన 30 మందికిపైగా ఉద్యోగులు ప్రధాన కార్యాలయంలో విధుల్లో చేరినట్లు సమాచారం. అయినప్పటికీ, ఇప్పటికే అక్కడ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కొందరి పోస్టింగుల్లో మార్పులు లేకపోవడంపై ఉద్యోగ వర్గాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మరోవైపు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల నిర్వహణ, పరిశుభ్రత, భద్రత, రోజువారీ కార్యకలాపాలకు సిబ్బంది అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో పాఠశాలల్లో పనిచేయాల్సిన ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు కేటాయించడం వల్ల సంబంధిత విద్యాలయాల పనితీరుపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో సిబ్బంది కేటాయింపులు అవసరాలకు అనుగుణంగా జరుగుతున్నాయా? అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు అంటున్నారు. కాంట్రాక్టు పనులు, బిల్లుల చెల్లింపులు, పరిపాలనా అనుమతుల విషయంలోనూ కొన్ని ఆరోపణలు వినిపిస్తున్నందున సంబంధిత ప్రక్రియలను పారదర్శకంగా సమీక్షించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

నూతన కార్యదర్శి స్పందించేనా?

గురుకుల సంస్థలో ఉద్యోగుల పోస్టింగులు, బదిలీలు, కారుణ్య నియామకాలు, విధుల కేటాయింపు, నాలుగో తరగతి సిబ్బంది వినియోగం, కాంట్రాక్టు పనులు, బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఉద్యోగ వర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. పాఠశాలల్లో పనిచేయాల్సిన సిబ్బంది ప్రస్తుతం ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? ప్రధాన కార్యాలయంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఉద్యోగుల పోస్టింగులకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? విధుల కేటాయింపులు ఏ ప్రాతిపదికన జరుగుతున్నాయి? అనే అంశాలను రికార్డుల ఆధారంగా పరిశీలించాలని కోరుతున్నాయి. తద్వారా వాస్తవాలు నిర్ధారించాలని, ఈ విచారణలో ఏవైనా అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో పాఠశాలల్లో సిబ్బంది అవసరాలను తీర్చి పరిపాలనలో పారదర్శకత పెంచాలని ఉద్యోగులు నూతన కార్యదర్శికి విజ్ఞప్తి చేస్తున్నాయి.

'కృత్రిమ కొరత' సృష్టిస్తే ....

సిపిఐ కరువు దాడులు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హెచ్చరిక
- కరువు పరిస్థితులపై క్షేత్రస్థాయి పరిశీలనకు 3,4 తేదీల్లో జిల్లాల పర్యటనలు
- సహాయక చర్యల కోసం నవంబర్ 10న ఆందోళనలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు నవంబర్ 3,4 తేదీ ల్లో వివిధ జిల్లాల్లో పర్యటన కార్యక్రమాన్ని రూపొందించినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 10న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కరువు పరిస్థితులను ఆసరాగా చేసుకుని ఎవరైనా నిత్యావసర వస్తువులను అక్రమంగా నిల్వచేసి బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే సహించేదిలేదని హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్, ఎం.బాలనర్సింహా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై పేరుతో ఓటర్ల తొలగింపుపై తమకు అభ్యంతరాలు ఉన్నాయని, ఎన్నికల సంఘం తీరుపై విచారణ జరిపించాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. అవసరమైతే అభిశంసన ప్రక్రియ ద్వారా తొలగించే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. ఈ డిమాండ్లపై నవంబర్ 1 ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన సభ, డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా జైల్‌భరో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో కొన్ని మండలాలకే పరిమితం చేయకుండా తెలంగాణ మొత్తాన్ని కరువు ప్రభావిత రాష్ట్రంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కరువు నుంచి ప్రజలను కాపాడేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సమగ్ర కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అక్రమంగా సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారుల గోదాములపై సిపిఐ ఆధ్వర్యంలో కరువు దాడులు నిర్వహించి పేదలకు పంచుతామని సాంబశివరావు స్పష్టం చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా కరువు నివారణ, ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని సూచించారు. రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మికులకు తక్షణ ఉపశమనం కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరువు ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాదని, పట్టణాల్లోని అసంఘటిత రంగ కార్మికుల ఉపాధిపైనా పడుతుందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్మాణ రంగం మందగిస్తే భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఉపాధి కోల్పోతారన్నారు. ఆటో కార్మికులు, ఇతర రోజువారీ కూలీలు కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో పట్టణాల్లో ఉపాధి కోల్పోయిన అసంఘటిత రంగ కార్మికులకు నెలకు కనీసం రూ.15 వేల కరువు భృతి అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయ పక్షపాతం లేకుండా అర్హులైన పేదలను ఎంపిక చేయాలని కూనంనేని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి లాటరీ విధానం లో ఇళ్లు కేటాయించాలని సూచించారు.

కొత్తగూడెంలో లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు చేపట్టిన విషయాన్ని ప్ర స్తావించారు. జీఓ 58, 59 కింద అర్హులైన పేదల కు ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణను పూ ర్తిచేయాలని, ఇళ్లు లేని జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి గృ హ నిర్మాణానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రితో సమావేశమై ఆయన దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ తరపున పోటీ చేసే అం శంపై పార్టీ నాయకత్వం చర్చిస్తోందని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

'సదర్' ఉత్సవాలకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



ప్రజాపక్షం /హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ ప్రతినిధులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 4న హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు సిఎంను ఆహ్వానించారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, యాదాద్రి బోర్డు సభ్యురాలు ఈశ్వరమ్మ యాదవ్, మేడ్చల్ డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు 'ఎఐ'పై

అవగాహన పెంచుకోవాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు కృత్రిమ మేధస్సు (ఎఐ)పై అవగాహన పెంచుకుని, ఆధునిక సాంకేతికతను విధుల్లో సమర్థవంతంగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఎఐ వినియోగంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు వేగవంతం కావడంతో పాటు, ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారం కావాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో ప్రణాళికా శాఖ, టీజీ మ్యాథ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఎఐ సాక్షమ్' కార్యక్రమాన్ని డిప్యూటీ సిఎం ప్రారంభించారు. ప్రభుత్వ ఉత్తర్వుల గుర్తింపు, నివేదికల తయారీ, సమాచార విశ్లేషణ, ప్రాజెక్టుల వ్యయాల అంచనా వంటి పనుల్లో ఏఐతో సమయం ఆదా చేయవచ్చని భట్టి విక్రమార్క తెలిపారు. రైతుల దరఖాస్తులు, పెన్షన్లు సమస్యల పరిష్కారంతోపాటు విద్యుత్ డిమాండ్ అంచనా, పరికరాల లోపాల గుర్తింపులోనూ ఎఐ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆదా అయిన సమయాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వినియోగించాలని సూచించారు.ఎఐ సాధనాల వినియోగంలో సమాచార భద్రత, కచ్చితత్వం, బాధ్యతకు ప్రాధాన్యమివ్వాలని, అనుమతి లేని సాధనాల్లో అధికారిక సమాచారాన్ని నమోదు చేయరాదని స్పష్టం చేశారు. ఎఐ రూపొందించిన సమాచారాన్ని ధ్రువీకరించిన తర్వాతే అధికారిక నిర్ణయాలకు ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, టిజి మ్యాథ్ ఎండి పూజ, ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ జనరల్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎల్ నినో నేపథ్యంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని, నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామీణ ప్రజలకు భరోసా కల్పించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని సెర్ప్ కార్యాలయం నుంచి మంత్రి సీతక్క బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక పరిస్థితులపైన రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల మంది సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో సీతక్క వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, సెర్ప్ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా అదనపు కలెక్టర్లు ఐటిడిఓ అధికారులు, డిఆర్‌డిఒలు, డిపిఒలు, జెడ్‌పిసిఇఒలు, ఇంజనీరింగ్ విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ నినోను ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన 'జలసిరి' వీడియోను మంత్రి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,516 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన 244 గ్రామ పంచాయతీల్లోనూ వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రతి 40 మంది కూలీలకు ఒక మేట్ను నియమించాలని, పనుల నిర్వహణలో సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూనే, కూలీలకు స్థానికంగా ఉపాధి కల్పించి వలసలను నివారించాలన్నారు. ఉపాధి హామీ పనుల బిల్లులు 15 రోజుల్లో వస్తాయని,ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సర్పంచులు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న గ్రామ మహిళా సంఘ భవనాలను ప్రారంభించుకునేలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు పొందే అవకాశం ఉంటుందన్నారు.కాగా గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీగా నియమితులైన దాన కిషోర్‌ను మంత్రి సీతక్క అభినందించి, సత్కరించారు.

'సర్' అక్రమాలపై విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించాలి

- విద్యారంగ సమస్యలపై మిలిటెంట్ పోరాటాలకు సిద్ధంకండి
- ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాసరావు పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో జరుగుతున్న ఓట్ల తొలగింపు అక్రమాలను ప్రజలకు వివరించి, బిజెపి రాజకీయ ప్రయోజనాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం ఎఐఎస్ఎఫ్ మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.హైదరాబాద్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఓటర్ల జాబితాల నుంచి పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగిస్తూ బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆ రోపించారు. ఎల్ నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగే వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుం డా విశ్వవిద్యాలయాలు, హాస్టళ్లకు నిరంతర నీటి సరఫరా అందించేలా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభు త్వం విద్యా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్య కాషాయీకరణకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ విభజన హామీల మేరకు కేటాయించాల్సిన ఉన్నత విద్యాసంస్థలను ఏర్పాటు చేయకుండా కేంద్రం రాష్ట్రంపై వివక్ష చూపుతోందన్నారు. పాఠ్యాంశాల నుంచి పోరాట యోధులు, చరిత్రకారుల అంశాలను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రె సిడెంట్ ఇటిక్యాల రామకృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెహమాన్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోతు రఘురాం, నెల్లి సత్య, భాషబోయిన సంతోష్, వంశీవర్ధన్‌రెడ్డి, లెనిన్, జనార్ధన్, ముదిగొండ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లకురుమల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

50 ఏళ్లకే పెన్షన్.. ఆసరా పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి: తాటిపాముల వెంకట్రాములు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు విమర్శించారు. చేనేత, గీత వృత్తిదారులకు కల్పిస్తున్న తరహాలో గొల్లకురుమలకు 50 ఏళ్లకే పెన్షన్ అందించాలని, ఆసరా పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాద్‌లోని చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి వెంకట్రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కుల గణన చేపట్టకుండా బిసిలను మోసం చేస్తోందని ఆరోపించారు. కులగణన నిర్వహించి, కులాల వారీగా జనాభా లెక్కలు సేకరించి, జనాభా ప్రాతిపదికన ఆయా వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బిసి ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలను అడవుల్లో మేపుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పాలసీ ప్రకటించాలని, దాని అమలుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కింద గొల్లకురుమలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఎలాంటి షరతులు లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రివర్గంలో గొల్లకురుమలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడంగి శ్రావణ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బాలయ్య యాదవ్, జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్, గజ్జి రమేష్ యాదవ్, వేల్పుల సారంగపాణి యాదవ్, అందే అశోక్ యాదవ్, సంఘం నాయకులు మద్దూరి గట్టయ్య, దాడి రాజబాబు యాదవ్, సత్యనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మరో 15 వేల ఉద్యోగాలు భర్తీ

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్: త్వరలో మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నామని, రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడనున్నాయని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని దూర ప్రాంతాల్లోని యువతను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రసిద్ధి చెందిన శిక్షణ సంస్థతో నాణ్యమైన ఉచిత శిక్షణతో పాటు ఉచితంగానే మెటీరియల్‌ను అందించనున్నామని వెల్లడించారు. 'పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో 'పిఎస్ఆర్ యువ నేస్తం' పేరుతో ఆన్‌లైన్‌లో 'పోటీ పరీక్షల'కు ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హైదరాబాద్, సచివాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎంపి రామసహాయం, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆర్‌సి శిక్షణ సంస్థ నిర్వాహకులు ఆర్‌సి శిక్షణ సంస్థలో అబ్దుల్ కరీం, కృష్ణారెడ్డి, సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌సి సంస్థ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఏడాది పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని, అవసరమైతే శిక్షణ కాలాన్ని కూడా పొడిగిస్తామన్నారు. గత 30 ఏళ్లుగా ఆర్‌సి సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఎఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందన్నారు. 2013లో తాను రాజకీయాల్లోకి ప్రవేశించానని, 2014లో ఎంపిగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఇందులో 462 మంది ఉత్తీర్ణత సాధించి ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందారని గుర్తు చేశారు. ఒక ప్రాంతానికి పరిమితమైన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని లక్షల మందికైనా ఆన్‌లైన్ విధానం ద్వారా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు ఉచిత శిక్షణకు లక్ష మందికి పైగా అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని, కటాఫ్ డేట్ వరకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓట్లను తొలగిస్తున్నందుకు నిరసనగా ఢిల్లీలో చేపట్టే నిరసన కార్యక్రమానికి ప్రత్యేక రైలు బోగీలను ఇవ్వాలని కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదని ప్ర త్యేక బోగీలు ఇవ్వకుండా దేశ వ్యాప్తంగా ఇండియా కూటమి నాయకులను ఇ బ్బందుల కు గురిచేస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవం త్ రెడ్డితో కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని, రాను న్న దీపావళిలోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమ స్య పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి సమ్మతించారని పొంగులేటి స్పష్టం చేశారు.

నాడు నోర్లకు స్టిక్కర్లు..చేతులకు సంకెళ్లు..

గత ప్రభుత్వ హయాంలో కనీసం నిరసన కార్యక్రమాలు నిర్వహించకుండా ధర్నాచౌక్‌ను ఎత్తివేశారని, నోర్లకు స్టికర్లు, చేతులకు సంకెళ్ల వేసి, జైలుకు పంపించారని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో స్వేచ్ఛగా మాట్లాడే అవకాశం కల్పించామని, ధర్నాచౌక్‌ను పునరుద్ధరించామన్నారు. కెటిఆర్, హరీశ్ రావు వ్యవహారశైలి, మాట్లాడే భాష బాధకరమన్నారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమానికి కేంద్రంలోని బిజెపి అనేక ఆటంకాలు సృష్టిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం బిజెపి పాదయాత్ర చేపడుతుందని, ఆ పార్టీ తరహా తాము ఎటువంటి ఆటంకాలు కలిగించడం లేదని స్పష్టం చేశారు.



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సిఎం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎల్ నినో కరువుపై రూ.50 వేల కోట్ల కేంద్ర సాయం కోరాలి

సిపిఐ(ఎం) డిమాండ్

ప్రజాపక్షం /హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో నెలకొ న్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమగ్ర ఉపశమన చర్యలు చేపట్టాలని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వానికి ఆయన పలు సూచనలు చేశారు. రాష్ట్రంలోని 365 కరువు మండలాలకు అదనంగా అవసరమైన ప్రాంతాలను గుర్తించి కరువు మండలాలుగా ప్రకటించాలని, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేలు పరిహారం అందించాలని కోరారు. రూ.2 లక్షలలోపు పంట రుణాలతోపాటు ఇతర రుణాల మాఫీ, రైతు భరోసా రెట్టింపు, రేషన్ బియ్యం కోటాను వ్యక్తికి 6 కిలోల నుంచి 12 కిలోలకు పెంపు, ఎనిమిది రకాల నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేయాలని సూచించా రు. ఆరుతడి పంటలకు ఉచిత విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని, వ్యవసాయానికి నిరంతరాయంగా మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిదినాలను 200 కు పెంచి రోజువారీ కూలీని రూ.800 చేయాలని, గ్రామాల్లో తాగు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని కోరారు. కార్మికులకు అదనంగా 50 శాతం ఎల్ నినో భృతి చెల్లించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పేదలకు ఉచిత వైద్యం, యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలని సూచించారు. కరువు నివారణకు కేంద్రం నుంచి రూ.50 వేల కోట్ల ప్రత్యేక సాయం సాధించేందుకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి పంపాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించాలని సిపిఐ(ఎం) నేతలు కోరారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము
జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్ కార్యాలయం, పి.ఐ.యు డివిజన్, జనగామ
టెండర్ నోటీసు నెంబర్. NIT.No.3/D3/ COLLECTOR'S SAND FUND 2026, Dt: 27.10.2026.
(4) పనులు రిజిస్టర్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించనైనది.
1. పనుల సంఖ్య: 4 పనులు (మొదటి పిలుపు), 2. అంచనా విలువ: రూ.21.85 లక్షలు, 3. టెండర్ ప్రారంభ తేదీ: 29.10.2026 ఉదయం 10.30 గంటలు, 4. మొదటి పిలుపు టెండర్ ముగింపు తేదీ: 5.11.2026 మధ్యాహ్నం 3.00 గంటల వరకు. మరిన్ని వివరాల కొరకు www.tenders.telangana.gov.in వెబ్‌సైట్‌లో పనుల పూర్తి వివరములు కలవు, ఈ కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించబడిన టెండర్ నోటీసు లోని ఏదయినా వివరణ కొరకు సంబంధిత అధికారి ఫోన్ నెంబర్: 9948526286 కు సంప్రదించవలెను.
సం/- జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్, పి.ఐ.యు డివిజన్, జనగామ.
DIPR R.O. No. : 12620-PP/CL/ADVT/2026-27, Date: 28-10-2026

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: శంషాబాద్ సర్కిల్-18
తేది: 28.10.2026

NIT No.	పని పేరు	అంచనా విలువ	బిడ్ సమర్పణకు ఆఖరి తేది & సమయం	అధికారి పేరు & చిరునామా
టెండర్ నోటీసు NIT No. 22/ EEC-18/ SHBD/ GHMC/2026-27, తేది: 28.10.2026	01 పని కొరకు "జిహెచ్ఎంసి, శంషాబాద్ సర్కిల్-18 పరిధిలోని శంషాబాద్ W.No.118 మరియు కొత్వాల్‌గూడ W.No.119 లలో బోర్ మోటార్ల మరమ్మతులు, రీవైండింగ్, కొత్త మోటార్ల సరఫరా, అమర్చడం మరియు ఇతర మరమ్మతులు".	రూ. 12.00 లక్షలు	02.11.2026 మ.2.00గం.ల వరకు	శ్రీ డి.కిష్టప్ప, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి.

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శంషాబాద్ సర్కిల్-18, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 12666-PP/CL/ADVT/2026-27, Date: 28-10-2026

బొప్పాయి తోటలో పసికందు!



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : బొప్పాయి తోటలో అప్పుడే పుట్టిన పసికందును వదిలేసిన అమానుష ఘటన మండల పరిధిలోని విఆర్ బంజరలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామ సమీపంలోని బొప్పాయి తోట వద్ద అప్పుడే పుట్టిన పసికందును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ భూక్యా రమణతో పాటు స్థానికులు, ఆశా కార్యకర్త రమ ఆ ప్రాంతానికి వెళ్లి చూడగా పసికందు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జన్మించినట్లు గుర్తించారు. ఇంకా పేగు కూడా తెంచకుండా వదిలేసి వెళ్లినట్లు గుర్తించారు. ఎవరో ప్రసవించగానే వదిలేసినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. పిల్లలు అవసరం లేకపోతే ఎక్కడైనా ఆసుపత్రిలోనైనా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగిస్తే బాగుండేదిదని ఇలా రోడ్డుపై పడేయడం దారుణమని స్థానికులు వాపోయారు. ఆశా కార్యకర్త ఆధ్వర్యంలో పేగు తెంపి పసికందును చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బొప్పాయి తోటలో పసికందు కనిపించడం గ్రామంలో కలకలం సృష్టించింది.

విద్యుదాఘాతంతో వివాహిత మృతి

ప్రజాపక్షం/చంద్రుగొండ: చంద్రుగొండ మండలం పోకలగూడెం గ్రామ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర ఇటుకల కంపెనీలో విద్యుదాఘాతంతో బాల రాజమణి(27)అనే వివాహిత మృతి చెందారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కరిపుట్ మండలం సిక్పల్లి గ్రామానికి చెందిన బాలు అర్జున్ కుటుంబం ఉపాధి కోసం గత ఆరు నెలలుగా ఇటుకల బట్టీలో పని చేస్తూ అక్కడే నివసిస్తోంది. బుధవారం మధ్యాహ్నం రాజమణి బట్టలు ఉతికి ఇనుప తీగపై ఆరేస్తుండగా, తీగకు విద్యుత్ ప్రసరించడంతో షాక్‌కు గురయ్యారు. ఆమెను కాపాడేందుకు వెళ్లిన తండ్రి దీనబంధుకు కూడా విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయారు. తీవ్రంగా గాయపడిన రాజమణి అక్కడిక్కడే మృతి చెందారు. మృతురాలి భర్త బాలు అర్జున్ ఫిర్యాదు మేరకు చంద్రుగొండ పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులపై దాడి కేసులో శిక్ష

ప్రజాపక్షం/సత్తుపలి: పోలీసులపై దాడి చేసి, విధులకు ఆటంకం కలిగించడం, ఇతర నేరాలకు సంబంధించిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 20,000 మొత్తాన్ని జరిమానాగా విధిస్తూ ఖమ్మం జిల్లా సత్తుపల్లి కోర్టు బుధవారం తీర్పు చెప్పింది. ఈమేరకు సత్తుపల్లి ఆరవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం జడ్జి శ్రీనివాస్ తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా, చాత్రాయి మండలం, చిత్తాపూర్ గ్రామానికి చెందిన తిరువీధుల సురేంద్ర అలియాస్ సూర్య (36) అనే యువకుడు ఓ చోరీ కేసులో నిందితుడు. ఇతని కోసం 2025 మార్చి 10వ తేదీన సత్తుపల్లి పట్టణ పరిసరాల్లో గాలిస్తున్న పోలీసులపై సురేంద్ర ఉద్దేశపూర్వకంగా హత్య చేసేందుకు ప్రయత్నించాడు. ఇందులో భాగంగానే కత్తితో దాడి చేయడం ద్వారా సురేంద్ర పోలీసులను గాయపరిచాడు. ఈ మేరకు సురేంద్ర అలియాస్ సూర్యపై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 126/2025 ద్వారా బిఎన్ఎస్ చట్టంలోని 109, 132, 121(1) సెక్షన్ల కింద నమోదైనది. కేసు పూర్వాపరాల విచారణ అనంతరం నిందితుడు సురేంద్రపై మోపిన అభియోగాలు రుజువు కావడంతో అతన్ని కోర్టు దోషిగా నిర్ధారించింది. దీంతో బిఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 109 కింద పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా, సెక్షన్ 132 కింద రెండేళ్ల సాధారణ కారాగార శిక్షతోపాటు రూ. 5వేల జరిమానా, సెక్షన్ 121 (1) కింద ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం. శ్రీనివాస్ తీర్పు చెప్పారు. ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా ఖమ్మం సిసిఆర్‌బి సబ్ ఇన్‌స్పెక్టర్ టి. కవిత, రెండో దర్యాప్తు అధికారిగా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. వీరప్రసాద్ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ డానియల్ ప్రాసిక్యూషన్ తరపున న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కేసు విచారణ, న్యాయస్థాన ప్రక్రియలో సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది సహకరించారు. కేసు దర్యాప్తు, విచారణ ప్రక్రియలో సహకరించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.

ఓటు ద్వారా అభిప్రాయాలు తెలపండి

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై తమ మనసులో ఉన్న అభిప్రాయాలను పట్టభద్రులు తమ ఓటు ద్వారా వ్యక్తపరిచే అవకాశం ఉంటుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఖమ్మంలోని మమత వైద్య విద్య కళాశాల నందు ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రాన్ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యులంతా బాధ్యతాయుతంగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా ప్రభుత్వం మారుతుందా లేదా అనేది కాకపోయినా పట్టభద్రులు తమ అభిప్రాయాలను ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఓటు ద్వారా వ్యక్తం చేసే అవకాశం కలుగుతుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఎన్నో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని ఆ సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆనాటి ప్రభుత్వం అందించిన సేవలు ఎంతో మంది ప్రాణాలు కాపాడాయన్నారు. పట్టభద్రులు తమ కుటుంబ సభ్యులలో ఎవరైనా అర్హత ఉండి ఉంటే వారి ఓటు కూడా నమోదు చేసేలా చూడాలన్నారు. ఓటు నమోదుతో పాటు ఓటు హక్కును కూడా బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మమత సంస్థల డైరెక్టర్ పువ్వాడ నరేన్ రాజ్, ప్రిన్సిపాల్ అనురాధ, సూపరింటెండెంట్ రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు ఆయుధాలపై అవగాహన



ప్రజాపక్షం/సత్తుపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని బేతుపల్లి గంగారంలోని 15వ తెలంగాణ ప్రత్యేక పోలీసు బెటాలియన్‌లో బుధవారం కమాండెంట్ పెద్దబాబు ఆధ్వర్యంలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. గంగారం డిఎవి స్కూల్, సత్తుపల్లి విశ్వశాంతి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది వివిధ ఆయుధాలు, వాటి పనితీరు, పోలీసు విధులు, భద్రతా వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి సైన్యం, పోలీసు శాఖల్లో ఉన్నత స్థానాలకు చేరుకుని దేశసేవ చేయాలని కమాండెంట్ ఎన్. పెద్దబాబు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ అంజయ్య, అసిస్టెంట్ కమాండెంట్లు వేణుగోపాల్ రెడ్డి, వినాయక రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఉదయకుమార్, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, బెటాలియన్ శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో 'సెల్' ముచ్చట్లు!

కొందరు అధికారులు ప్రజా సమస్యలు పక్కన పెట్టి ఫోన్ సంభాషణల్లో తలమునకలు

ప్రజాపక్షం/వైరా: ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే కొన్ని కార్యాలయాల్లో అధికారులు సెల్‌ఫోన్ సంభాషణలు, వాట్సాప్ చాటింగ్, సోషల్ మీడియా వినియోగంలో ఎక్కువ సమయం గడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ సమస్యలు చెప్పుకునేందుకు కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు వాపోతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వివిధ శాఖల ద్వారా అధికారులను నియమించి, అవసరమైన సిబ్బందిని అందిస్తుంది. నిర్ణీత వేళల్లో కార్యాలయాలకు హాజరయ్యే అధికారులు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కాని కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత ఫోన్ కాల్స్, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా కార్యకలాపాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ప్రజలు వేచి ఉండాలా?...ఫోన్ ముచ్చట్లు సాగాలా?

రోజువారి పనులు, కుటుంబ అవసరాలు, వ్యవసాయ పనులు, ఉపాధి బాధ్యతలను పక్కనపెట్టి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలకు ప్రతి నిమిషం విలువైనదే. అలాంటి సమయంలో తమ సమస్యలను వివరించేందుకు అవకాశం లేకపోవడం, సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడం, ఫోన్ సంభాషణలు పూర్తయ్యే వరకు వేచి ఉండాల్సి రావడం ప్రజలకు అసహనాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా ఒక పని కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే వారి ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయి. అధికారులకు అవసరమైన ఫోన్ కాల్స్, అత్యవసర సమాచార మార్పిడి సహజమే. అయితే విధి నిర్వహణ సమయంలో వ్యక్తిగత ఫోన్ వినియోగం ప్రజలకు అందించే సేవలకు ఆటంకం కలిగించకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను శ్రద్ధగా వినడం, సంబంధిత పత్రాలను పరిశీలించడం, పరిష్కార మార్గాలు సూచించడం అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలి. కార్యాలయాల్లో ప్రజలకు అందుతున్న సేవలపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, ఫిర్యాదు పరిష్కారంలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించిన తర్వాత సమయం దొరికితే వ్యక్తిగత ఫోన్ సంభాషణలకు అవకాశం ఉంటుంది. కాని ప్రజా సేవల సమయంలో ప్రజల అవసరాలే ప్రాధాన్యంగా ఉండాలి. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు సేవలందించే విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

తుఫాను ప్రభావంతో నేల కొరిగిన వరి

దెబ్బతిన్న పంటలతో రైతుల ఆందోళన



ప్రజాపక్షం/వేంసూరు: అర్నబ్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, బలమైన ఈదురుగాలుల కారణంగా వేంసూరు మండలంలో వరి పొలాలు నేలకొరిగాయి. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం రైతులకు నష్టాన్ని మిగిల్చింది. ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సాగు కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు, పంట దెబ్బతినడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని గ్రామాల్లో పర్యటించి, నేలకొరిగిన వరి పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుకుంటున్నారు

బాలలను వేధిస్తే కఠిన శిక్షలు

సీనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి



ప్రజాపక్షం/మధిర: బాలబాలికలను వేధింపులకు గురిచేస్తే తీవ్రమైన శిక్షలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎన్.ప్రశాంతి హెచ్చరించారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక తేళ్ల వసంతయ్య మెమోరియల్ స్కూల్‌లో బుధవారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జడ్జి ప్రశాంతి పాల్గొని విద్యార్థులకు పోక్సో చట్టం 2012 గురించి వివరించారు. బాలలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చట్టపరంగా కఠినచర్యలు ఉంటాయని, అత్యవసర సమమయంలో 109(చైల్ లైన్), 112 హెల్ప్‌లైన్ నెంబర్లకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. సోషల్ మీడియాను చెడు మార్గంలో కాకుండా చదువు, విజ్ఞానం పెంపొందించుకోవడానికి ఉపయోగించుకోవాలని, విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బిఎస్.సత్యజిత్, ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, న్యాయవాదులు పి.కృష్ణారావు, ఎం.సతీష్, పిఎల్‌పి వెంకట్, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబి, ఆర్‌యుబిల నిర్మాణం చేపట్టాలి

రద్దయిన రైళ్లు, స్లీపర్ కోచ్‌లు పునరుద్ధరించాలి
రైల్వే స్థలాలపై కొర్రీలు వద్దు
రోడ్ల విస్తరణకు సహకరించాలి
ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్



ప్రజాపక్షం/చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని దీర్ఘకాలిక రైల్వే సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బుధవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ, జిఎం సెక్రటరీ మల్లాది శ్రీనివాస్‌లను ఆయన కలిసి పలు సమస్యలపై అందించిన లేఖలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ మున్సిపల్ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు 22 అడుగుల రైల్వే స్థలాన్ని కేటాయించాలని కోరారు. బూడిదగడ్డ, రైటర్‌బస్తీ, రామవరం, గరిమెళ్లపాడులలో ఆర్‌యుబిలు, లెవల్ క్రాసింగ్‌లు నిర్మించాలని, సర్వారంలో రైతుల కోసం అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. హేమచంద్రాపురం బైపాస్‌లో కొత్త ఆర్‌ఓబితోపాటు సింగరేణి మెయిన్ ఆసుపత్రి వద్ద ఉన్న పాత ఆర్‌ఓబిని విస్తరించాలని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో రద్దయిన మణుగూరు–కాజీపేట, భద్రాచలం రోడ్–డోర్నకల్, బెల్గాం–మణుగూరు రైళ్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్‌లో స్లీపర్ బోగీలను పునరుద్ధరించంతోపాటు తిరుపతికి నేరుగా వారాంతపు రైలు నడపాలని విజ్ఞప్తి చేశారు. భద్రాచలం రోడ్ స్టేషన్‌ను 'కొత్తగూడెం రైల్వే స్టేషన్'గా పేరు మార్చాలని, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరగా రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని కూనంనేని తెలిపారు.

ఓట్ల నమోదు సరే.. నిరుద్యోగ సమస్యల పరిష్కారమేదీ?

రాజీవ్ యువ వికాసం, స్వయం ఉపాధి రుణాల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలి
ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఉపేందర్

ప్రజాపక్షం/నేలకొండపల్లి: పట్టభద్రుల ఓట్ల నమోదు కార్యక్రమం కొనసాగుతున్న వేళ, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిగ్రీలు పూర్తి చేసిన యువత ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎంతమంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించారు?, అర్హులైన దరఖాస్తుదారుల్లో ఎంతమందికి రుణాలు మంజూరు చేశారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని ప్రశ్నించారు. స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన యువతకు రుణాలు, సబ్సిడీలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. పథకాలను ప్రకటించడానికే పరిమితం కాకుండా, వాటి ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో నిరుద్యోగులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని కోరారు. ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో యువత, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ జరగాలని అన్నారు. అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి అశోక్, కోశాధికారి బాలిన కృష్ణంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీను, సభ్యులు నవీన్, అఖిల్ పాల్గొన్నారు



కొమురం భీమ్ పోరాటం చిరస్మరణీయం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి:ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం కొమురం భీమ్ చేసిన పోరాటం చిరస్మరణీయమని ఆదివాసీ సంఘాల నాయకులు కొనియాడారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కొమురం భీమ్ 86వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి అధ్యక్షుడు పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐడబ్ల్యుసిఎ జిల్లా నాయకుడు గుమ్మడి సమ్మయ్య, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల సాధన కోసం భీమ్ తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప పోరాట యోధుడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని, జల్, జంగల్, జమీన్ నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముత్తయ్య, మాజీ ఎంపిపి సమ్మయ్య, కృష్ణ, చంద్రశేఖర్, ఏడుళ్ల రమేష్, వినోద్, బొమ్మల రమేష్, సాగబోయిన సురేష్, గ్రామ పెద్దలు, యువకులు, ఆదివాసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాను వేళ గర్భిణులపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ అంకిత్



ప్రజాపక్షం/చుంచుపల్లి: తుఫాను ప్రభావంతో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రసవ తేదీ సమీపించిన వారిని గుర్తించి, అత్యవసర వైద్య సేవలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంకిత్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పెనగడప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవలు, సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్సా విధానాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిక, ఒపి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబొరేటరీ, ఫార్మసీ, మందుల నిల్వ కేంద్రాన్ని సందర్శించి సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం తుఫాను వాతావరణ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రసవ తేదీ సమీపించిన గర్భిణుల వివరాలను కలెక్టర్ ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనా గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. సురక్షిత ప్రసవాలకు అవసరమైన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు నిరంతరం మెరుగైన వైద్యసేవలు అందించాలని, రోగులకు అవసరమైన చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావం నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య సిబ్బందికి కలెక్టర్ సూచించారు. తనిఖీలో పెనగడప పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ బి.హరీష్, సిబ్బంది పాల్గొన్నారు..

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలు తిప్పికొట్టాలి
డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పోట్ల నాగేశ్వర రావు, బాలసాని లక్ష్మి నారాయణ, కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓట్ల నమోదుకు సంబంధించి గ్రామాల్లో అర్హులైన వారికి గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను కాంగ్రెస్ నేతలు తిప్పికొట్టాలన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామస్థాయి వరకు ప్రజలకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని సూచించారు. ఢిల్లీలో జరగనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు, మండల, పట్టణ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం



ప్రజాపక్షం/సత్తుపల్లి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలోని రాణి కన్వెన్షన్‌లో బుధవారం 73 వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మాజీ టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించారు. తొలి రోజు జరిగిన మ్యాచ్‌ల్లో ఖమ్మం జట్టు పెద్దపల్లిపై ఘన విజయం సాధించింది. రంగారెడ్డి జట్టు ములుగుపై, హైదరాబాద్ జట్టు మెదక్‌పై విజయం సాధించాయి. మరో మ్యాచ్‌లో నాగర్‌కర్నూల్ జట్టు వరంగల్‌పై గెలుపొందింది. పోటీల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు, క్రీడాకారిణులకు కల్పించిన వసతి సౌకర్యాలపై ఎమ్మెల్యే మట్టా రాగమయి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా క్రీడాకారిణులను ప్రోత్సహిస్తూ రాష్ట్రస్థాయి పోటీలను సత్తుపల్లిలో నిర్వహిస్తున్న మువ్వా విజయబాబును అభినందించారు. పోటీలు 30 వరకు కొనసాగనున్నాయి. మహిళా క్రీడాకారిణులు తమ ప్రతిభను చాటుకునేందుకు ఈ పోటీలు వేదికగా నిలుస్తాయని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, ఎఎంసి చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, కబడ్డీ సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం

ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ దేవసేన



ప్రజాపక్షం/కూసుమంచి: అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ శ్రీదేవసేన అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలోని సమస్యలను పరిష్కరించి, తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం కూసుమంచి ఎంపిడిఓ కార్యాలయంలో కలెక్టర్ దివాకర్ టిఎస్‌తో కలిసి ఎలక్టోరల్, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఇఆర్ఒలతో సమీక్ష నిర్వహించారు. ఫారం 6, 6ఎ, 7, 8 దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, ప్రవాస భారతీయుల దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించి, క్షేత్రస్థాయిలో గుర్తించిన మార్పులను ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. ఒకే వ్యక్తికి బహుళ చోట్ల ఓటు నమోదు, గుర్తించిన ఓటర్ల వివరాలను పరిశీలించాలని, ప్రతి నియోజకవర్గంలో అత్యధిక చేర్పులు, తొలగింపులు జరిగిన 20 పోలింగ్ కేంద్రాలను పునఃపరిశీలించాలని ఆదేశించారు. నోటీసులు సక్రమంగా జారీ చేసి, విచారణకు తగిన సమయం ఇవ్వాలని, దరఖాస్తుల రికార్డులను భద్రపరచాలని సూచించారు. యువ ఓటర్ల నమోదు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

జిల్లాలో 10,85,927 మంది ఓటర్లు...

కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి శాసనసభ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 10,85,927 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో లింగ నిష్పత్తి 1,069 కాగా, ఇపి నిష్పత్తి 688గా ఉందని, ఎపిక్ కార్డుల పంపిణీ 99.99 శాతం పూర్తయిందని వివరించారు. జిల్లాలో 18,19 ఏళ్ల యువ ఓటర్లు 11,596 మంది, 85 ఏళ్లు పైబడిన వారు 9,111 మంది, దివ్యాంగ ఓటర్లు 23,588 మంది ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా కొత్తగా 19 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో మొత్తం కేంద్రాల సంఖ్య 1,479కు చేరిందన్నారు. ఎన్నికల ప్రక్రియలో 53 ఎన్ఆర్ఐ దరఖాస్తులు అందాయని, ఫారం 6 దరఖాస్తులు 2,042, ఫారం 6ఎ దరఖాస్తులు 41, ఫారం 7 దరఖాస్తులు 153, ఫారం 8 దరఖాస్తులు 1,936 కలిపి మొత్తం 4,172 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటి పరిష్కారాన్ని వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

ఎల్ నినో ప్రభావం వల్ల ఆకాశానికి నిత్యావసర వస్తువుల ధరలు

ప్రజాపక్షం/ నర్సంపేట : ఎల్‌నినో ప్రభావంతో రోజు రోజుకు నిత్య అవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రభుత్వం స్పందించి నియంత్రించాలని తెలంగాణ జన సమితి పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడుషేక్ జావీద్ అన్నారు. నర్సంపేట పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నీటి సమస్య, నిత్యవసర వస్తువుల సమస్య, కరెంటు సమస్య, రైతులకు పంట సమస్య, తదితర సమస్యలు తలెత్తె అవకాశాలు ఉన్నాయన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు సరిపడు బియ్యం, నూనె, గోధుమ, చక్కెర, ఉల్లిగడ్డ, చింతపండు, కారం, ఉప్పు, అల్లం ఎల్లిగడ్డ, చాపత్త, పప్పులు మొదలగు నిత్యవసర వస్తువులను అందించాలన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు పంట నష్టం జరుగుతున్న సందర్భంగా వారిని ఆదుకోవాలని, కూరగాయల ధరను కూడా నియంత్రించాలని, జూలై 2027వరకు ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఉంటుందని వరంగల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు.

ఎల్ నినో ప్రమాదంతో ఆరుతడి పంటలే శ్రేయస్కరం



ప్రజాపక్షం/బచ్చన్నపేట: ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజులలో భూగర్భజలాలు తీవ్రంగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని, కావున ప్రజలు నీటిని, విద్యుత్‌ను ఎంతో పొదుపుగా వినియోగించుకోవాలని కళాకారులు పాటల ద్వారా చైతన్యపరిచారు. జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద్భంగా కళాకారులు ఆకట్టుకునే పాటల రూపంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు సంజీవ్, కళాకారులు గణేష్, సోమయ్య, కనకరాజు, శంకర్, చంద్రశేఖర్, చిరంజీవి, స్వప్న, చామంతి తమ పాటలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నర్సింగరావు, ఎఇఒ, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను, యువతను మోసగించిన ప్రభుత్వం

ప్రజాపక్షం/పాలకుర్తి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతను మోసం చేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సోమేశ్వర ఫంక్షన్ హాల్లో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఆయుధం. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, యువతకు ఉపాధి, రైతులకు సాగునీరు, ప్రజలకు సంక్షేమం అందించడంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయాలని అన్నారు. ప్రశ్నించే గొంతుకకు ఓటే బలం, ప్రభుత్వ పనితీరును అంచనా వేసి, ప్రజాసమస్యలపై తమ అభిప్రాయాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా వ్యక్తం చేసే అవకాశం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కల్పిస్తాయని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నీటిని ఆదా చేద్దాం...విద్యుత్‌ను పొదుపు చేద్దాం' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/గణపురం: ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని నీరు, విద్యుత్‌ను వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించాలని చెల్పూర్ కెటిపిపి చీఫ్ ఇంజనీర్ చిట్టాప్రగడ శ్రీప్రకాష సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం హెచ్58 జెన్‌కో అధ్యక్షుడు ఎలకంటి రఘోత్తం ఆధ్వర్యంలో రూపొందించిన 'సేవ్ వాటర్..సేవ్ పవర్..సేవ్ ఫ్యూచర్' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నీటి లీకేజీలను అరికట్టడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, అవసరమైన మేరకే నీటిని వినియోగించడం, అనవసర లైట్లు, ఫ్యాన్లు ఆపివేయడం, ఎల్ఇడి బల్బులు ఉపయోగించడం ద్వారా నీరు, విద్యుత్‌ను ఆదా చేయాలని సూచించారు. అధిక వేడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, వృద్ధులు, చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నీరు, విద్యుత్ సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని, భవిష్యత్తు తరాల ప్రయోజనాల కోసం ప్రజలందరూ పొదుపు చర్యలు పాటించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టికెఎస్ రాష్ట్ర కమిటీ, కెటిపిపి రీజినల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మత్తు వద్దు..మనం మారుదాం, దేశాన్ని మారుద్దాం' పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ములుగు: భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ములుగు కలెక్టరేట్‌లో నిర్వహించిన నశాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించి, దానిపై పిల్లలకు అవగాహన కల్పించడం వలన పిల్లలు హర్షం వ్యక్తీకరించారు. ములుగు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ అల్లెం అప్పయ్య, ప్రధాన కార్యదర్శి కొట్టె రాజిరెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, పాలకమండలి సభ్యులు గుడూరు మహిపాల్, ముక్కు సుబ్బారెడ్డి, కోగిల సారయ్య, అబ్బు సతీష్, వావిలాల రవితేజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిట్స్ ప్రిన్సిపాల్ ఎండి ముజీబ్‌తో పాటు ఉపాధ్యక్షులు రవికుమార్, చంద్రమౌళి, రాజు, సోనియా, సుష్మ, సింధుజ, రాజేష్, లలిత్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గ్రామాల అభివృద్ధికి రూ.1.62 కోట్ల నిధులు
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ప్రజాపక్షం/భూపాలపల్లి: గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, మహిళా సమైక్య భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి మొత్తం రూ.1.62 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

పది గ్రామాల్లో అభివృద్ధి పనులు

భూపాలపల్లి రూరల్ మండలంలోని రాంపూర్, చికెన్‌పల్లి, దూదేకులపల్లి, నందిగామ, ఆజంనగర్, బూర్కపల్లి, రాజీవ్‌నగర్, ఆముదాలపల్లి, ఎస్ఎం కొత్తపల్లి, శ్యామ్‌నగర్ తదితర గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు నిర్వహించారు. ఒక్కో భవన నిర్మాణానికి సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, మహిళా సంఘాలకు మెరుగైన వసతులు కల్పించడం, చిన్నారులకు అంగన్వాడీ సేవలను సమర్థవంతంగా అందించడం, గ్రామపంచాయతీలకు సొంత భవనాలను అందుబాటులోకి తీసుకురావడం ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, ఆర్‌టిఎ మెంబర్ సుంకర రామచంద్రయ్య, భూపాలపల్లి తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, మండల పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మైనారిటీ మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి : మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది, తమ కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో మైనారిటీ మహిళలకు స్వయం ఉపాధికి ప్రోత్సాహం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనారిటీ లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం ద్వారా కుటుంబ అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించగలరని పేర్కొన్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారి నైపుణ్యాలను ప్రోత్సహించడం ద్వారా వారు తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. కుట్టు మిషన్లు మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంలో ఎంతగానో ఉపయోగపడతాయని, కుట్టుపని నేర్చుకున్న మహిళలు ఇంటి వద్దనే పని చేసుకుంటూ ఆదాయం సంపాదించవచ్చని అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఆర్థికంగా ఎదిగేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయంగా ఆదాయం సంపాదించుకునే స్థాయికి ఎదగాలని, తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. చిన్న తరహా స్వయం ఉపాధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంతో పాటు కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తాయని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా సమాజంలో సమాన అభివృద్ధికి బాటలు వేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా మైనారిటీ మహిళలు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మహిళల సంక్షేమం, అభ్యున్నతి, స్వయం ఉపాధి కల్పనకు సంబంధించిన కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మంజుల భాస్కర్ సర్పంచులు జిట్టబోయిన రమ్య ప్రశాంత్, కారుపోతుల శ్రీనివాస్, నీరటి లక్ష్మీ, చంద్రయ్య, మాచర్ల స్వ రూప పుల్లయ్య బి.కుమార్ స్వామి, బాలాజీ నా యక్, జి.కుమారస్వామి, లోనే శ్రీనివాస్, ము స్కు సుధాకర్, యాకూబ్ రజిత, విజయ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ఎండి మదార్, రాఘవరావు, మైసిరె డ్డి మైనార్టీ సంఘం నాయకులు అధికారులు ల బ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



ప్రజాపక్షం/హనుమకొండ : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హనుమకొండ కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణ నుంచి హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ మాదకద్రవ్యాల లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీలో పాల్గొన్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు "మాదకద్రవ్యాలకు నో చెప్పండి – ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి – దేశాభివృద్ధిలో భాగస్వాములు కండి" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ సి.హెచ్. సంధ్యారాణి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ గొట్టిముక్కల శ్రీలక్ష్మి, రెడ్‌క్రాస్ సిబ్బంది, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, పాల్గొన్నారు.

రెండో దశ జనగణన పకడ్బందీగా నిర్వహించాలి: భారతీ హోళికేరి



ప్రజాపక్షం/ జనగామ :రెండో దశ జనగణన పకడ్బందీగా నిర్వహించాలని జనగణన సంచాలకులు భారతీ హోళికేరి అన్నారు. జనగణన నిబంధనలు, మార్గదర్శకాలు తప్పక పాటించాలని, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో జనగణన 2027 రెండో దశ జనగణనకు సంబంధించి జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన భారతీ హోళికేరి మాట్లాడారు. జనగణనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రతి ఇంటిలోని, ప్రతి కుటుంబంలోని ప్రతి వ్యక్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలన్నారు. జనగణనలో ఎవరు తప్పిపోకుండా ఒకరి వివరాలు రెండు సార్లు నమోదు కాకుండాజాగ్రత్త తీసుకోవాలన్నారు. జనగణనలో ఖచ్చితత్వం ఉండాలని, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ప్రతి కుటుంబం, వ్యక్తికి సంబంధించిన వివరాలను సరైన విధంగా సేకరించాలని పేర్కొన్నారు. జనగణనలో పట్టణ ప్రాంతాల్లో వార్డును, గ్రామీణ ప్రాంతాల్లో రెవెన్యూ గ్రామాన్ని పరిపాలనా యూనిట్‌గా పరిగణిస్తారని వివరించారు. జనాభా ప్రాంత విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి యూనిట్‌ను అవసరమైన బ్లాక్‌లుగా విభజించి ఎన్యూమరేటర్లకు కేటాయించాలన్నారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌లను ఉప విభాగాలుగా విభజించాలని, ఇందుకోసం అందుబాటులో ఉన్న లేఅవుట్ మ్యాప్‌లను పరిశీలించి జనాభా భవనాలు, సంస్థలు, ఇతర నివాస ప్రాంతాలను గుర్తించి మ్యాప్‌లలో స్పష్టంగా గుర్తించాలన్నారు. ముందస్తు కార్యాచరణ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరిలో జరగబోయే జనాభా గణన ప్రక్రియలో నిర్దేశించిన నిబంధనల ప్రకారం వివరాలను నమోదు చేయాలని, జననాలు, మరణాలు, వివాహాల కారణంగా వలసలు వంటి అంశాల వివరాలు మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఎన్యూమరేటర్లకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌లైన్ నెంబర్ 1855 ద్వారా నివృత్తి చేసుకోవాలని, జనగణనపై ప్రజలకు తప్పుడు సమాచారం చేరకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంలో పనిచేయాలని సూచించారు. సిపిఒ చినకోట్యానాయక్, జిల్లా స్థాయి అధికారులు, ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాయిని



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వారు పుష్ప గుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

పసిడి భగ్గు.. సామాన్యుడి గుండె గుభిల్లు!

పూటకో రేటుతో కొనుగోలుదారుల అయోమయం.. వెలవెలబోయిన మార్కెట్లు ✻ దీపావళి శుభకార్యాల సీజన్‌పైనే వ్యాపారుల గండెడాశలు



ప్రజాపక్షం/గూడూరు;పసిడి ధరలు చుక్కలనంటుతున్నాయి. కొండెక్కికూర్చున్న బంగారం ధర సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరింది.మహిళలకు అత్యంత ఇష్టమైన నిత్యం కటుంబ భవిష్యత్తు కోసం చేసే పొదుపు సాధనమైన పసిడి నేడు కలలో కూడా ఊహించలేని రీతిలో భారంగా మా రింది.గతంలో వారం రోజుల పాటు ఒకే ధర స్థిర ంగా కొనసాగేది. కానీ ప్రస్తుతం రోజులోనే మూ డు నాలుగు సార్లు హెచ్చుతగ్గులు నమోదవుతుండటంతో వినియోగదారులు కొనుగోళ్లు చేయాలా వద్దా అన్న మీమాంసలో పడిపోయారు. అంతర్జాతీయ అనిశ్చితి స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో బంగారం ధరలు రోజు రోజుకూ అగ్నిగుండంలా మారుతున్నాయి.

తెలంగాణ సమాజంలో దసరా పండుగ వేళ ఎంతో కొంత బంగారం కొనుగోలు చేయడం శుభసూచకంగా భావించే సంప్రదాయం ఉంది. కనీసం తులం లేదా అరతులం కొనుగోలు చేసే మధ్యతరగతి పేద కటుంబాలు నేడు గ్రాము రెండు గ్రాములు ఇంకా చెప్పాలంటే గురిజ ఎత్తు బంగారం కొనేందుకు కూడా జంకుతున్నారు. గడిచిన దసరా సమయంలో మార్కెట్‌లో కనీస స్థాయిలో కూడా వ్యాపారం జరగలేదు.

కార్పొరేట్ షాపుల హవా.. చిన్న దుకాణాలకు తాళాలు

పెద్ద పెద్ద బ్రాండెడ్ కార్పొరేట్ షోరూమ్‌లలో ఆఫర్ల ప్రచారాల ద్వారా కొంతమేర వ్యాపారం జరుగుతున్నప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని చిన్న చిన్న జ్యూవెలరీ షాపులు పూర్తిగా వెలవెలబోతున్నాయి. దీనిపైనే ఆధారపడి బతుకుతున్న స్థానిక విశ్వబ్రాహ్మణ (స్వర్ణకార) కటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో మునిగిపోయాయి.

'అర్నబ్' తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ములుగు: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క అప్రమత్తం చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈదురుగాలుల సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు అవసరమైన హామీ సహకారాలు అందించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి: కలెక్టర్



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలం కేంద్రంలోని పిఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలో విద్యాబోధన తీరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతులు, ప్రయోగశాల నిర్వహణను పరిశీలించారు. వివిధ తరగతులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయుల బోధనా తీరును అడిగి తెలుసుకున్నారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాలతో పాటు హెల్త్ కేర్, రిటైర్ ఒకేషనల్ కోర్సుల తరగతులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీస్తూ, అన్ని తరగతుల్లో వంద శాతం హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముఖ గుర్తింపు హాజరు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతులు, ల్యాబ్ సౌకర్యాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్ వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, నర్సులు, ఇంజనీర్లు, తదితర ఉన్నత స్థాయిలకు చేరుకోవాలనే లక్ష్యంతో క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ తనిఖీల్లో గణపురం తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపిడిఒ, ఎంఇఒ, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే 'వికసిత్ భారత్-2047'సాధ్యం

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/ వరంగల్ : మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యవంతమైన యువతతోనే వికసిత్ భారత్2047 సాధ్యమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ, వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, చదువుపై దృష్టి సారించి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహనపై సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు, వైస్ చైర్మన్ శానబోయిన రాజ్‌కుమార్, సలహాదారులు ఇవి శ్రీనివాసరావు, కోశాధికారి బొల్లం శివ, రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు నాదెం శాంతికుమార్, మేనేజింగ్ కమిటీ మెంబర్స్ మండల పరశురాములు, తోట సంపత్ కుమార్, మామిడాల రమేష్ బాబు, డాక్టర్ రాజ్‌కుమార్, తిరుపతిరెడ్డి, ముల్క ప్రసాద్, కళాశాల డైరెక్టర్లు సిహెచ్ వాణి, తదితరులతో పాటు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



ప్రజాపక్షం/హసన్‌పర్తి: పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని హసన్ పర్తి పోలీస్ స్టేషన్లో పోలీస్ ఇన్స్‌పెక్టర్ ఆకునూరి మహేందర్ ఆధ్వర్యంలో బుధవారం సెయింట్ మేరీ పాఠశాల వి ద్యార్థులకు పోలీస్ స్టేషన్ సందర్శన (ఓపెన్ హౌస్) అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ పనితీరు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర, ఆయుధాల వినియోగం,సాంకేతిక పరిజ్ఞానం, పోలీస్ విధివిధానాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరించారు. అ లాగే దేశ రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు వివరించి, వారిలో దేశభక్తిని, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు మహిళలు, బాలల రక్షణ కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాల గురించి విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు హసన్ పర్తి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రేమపేరుతో వేధించిన యువకుడు అరెస్టు

డిఎస్‌పి నాగేంద్రచారి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : నేరప్రవృత్తిని పరిగణనలోకి తీసుకుని రౌడీషీట్ ఓపెన్ చేస్తామని రాజన్న సిరిసిల్ల డిఎస్‌పి కత్తురోజు నాగేంద్రచారి అన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఓ యువతిని జుబైర్ గతకొన్ని రోజులుగా ప్రేమపేరుతో నమ్మించి అసభ్యంగా ప్రవర్తించినట్లుగా ఫిర్యాదు అందినదని చెప్పారు. ఈ ఘటనపై ఎల్లారెడ్డిపేట పోలీసులు కేసు నమోదు చేయగా డీఎస్పీ విచారించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి అతడి నేరచరిత్ర వివరించారు. గతంలో హుజురాబాద్‌లో పోక్సో కేసు నమోదు అయిందన్నారు. అతడిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తామన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, ఎస్సై రమేశ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.


పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘనత



ఇద్దరికి విజయవంతంగా మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలు

ప్రజాపక్షం/పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మరో అరుదైన ఘనతను సాధించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ పర్యవేక్షణలో ఇద్దరు రోగులకు అత్యాధునిక టోటల్ నీ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలను వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించింది. తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో నడవడానికి ఇబ్బందులు పడుతున్న ఇద్దరు రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లో ఈ శస్త్రచికిత్సలను నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అధిక వ్యయంతో కూడుకున్న ఈ చికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా అందించడం పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.ఈ శస్త్రచికిత్సల విజయవంతానికి ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ కుమార్ బృందం, అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ చంద్రశేఖర్ బృందం,ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సమన్వయంతో కృషి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన మౌలిక వసతులు, ఆధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యుల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం శస్త్రచికిత్సలు చేయించుకున్న ఇద్దరు రోగులు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. పేదలకు నాణ్యమైన వైద్యసేవలను అందించడంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉండటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లలో ఒక్క రోడ్డైనా వేశారా?



మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/సిద్దిపేట : సిద్దిపేట నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖలో పనులు మూడేళ్ళలో రూ.300 కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత మూడేళ్లలో ఒక్క గ్రామీణ ప్రాంత రోడ్లు చేయలేదని మండిపడ్డారు. సిద్దిపేట పంచాయతీ రాజ్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్ శాఖ పనులపై సమీక్ష నిర్వహించారు. బిఆర్ఎస్ హయాంలో మంజూరు అయిన పనులు రద్దు చేశారని, మూడేళ్లలో సిద్దిపేటకు ఈ ప్రభుత్వం ఒక్క కొత్త పని మంజూరు చేసింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల వారీగా పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రాజ్ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనులు త్వరితగతిన అయ్యేట్లు చూడాలని చెప్పారు. నియోజకవర్గంలో హ్యామ్ రోడ్లకు రూ.50కోట్లతో మంజూరు అయిన పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఇ, ఇఇ, డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు చేతుల మీదుగా హలో తెలంగాణ యాప్ ప్రారంభం

తెలంగాణ ప్రాంత ప్రజలకు మరింత సమాచారాన్ని అందించడం కోసం ఉదయ్ కిరణ్ రెడ్డి తయారు చేసిన హలో తెలంగాణ సోషల్ మీడియా యాప్‌ను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు బుధవారం సిద్దిపేటలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, గుండు భూపేష్, పాల సాయిరాం, కొండం సంపత్ రెడ్డి, శ్రీహరి యాదవ్ , ఎడ్ల సోమిరెడ్డి కుంభం ఎల్లారెడ్డి, రమేష్ గౌడ్, తిరుపతి, కనకరాజు, జర్నలిస్టులు ఆకుల శ్రీనివాస్ రెడ్డి, కూతురు రాజిరెడ్డి రమణారావు, రంగ దాంపల్లి శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌కు ప్రపంచ ప్రత్యేక గుర్తింపు

'ఆల్ఫోర్స్' చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/కొత్తపల్లి : క్రీడల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుంచి ఉపశమనం లభించడమే కాకుండా వివిధ కార్యక్రమాలను చాలా హుషారుగా చేపట్టవచ్చని ఆల్ఫోర్స్ చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోలర్ స్కేటింగ్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని చాలామంది ఈ క్రీడను ఎంపిక చేసుకుంటున్నారని అన్నారు. గోదావరిఖనిలో నిర్వహించిన జోనల్‌స్థాయి రోలర్ స్కేటిం గ్ పోటీలలో 9వ తరగతి చదువుతున్న పి.శ్రీహాస్ అండర్ 15 విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి వచ్చే నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలక ఎంపికవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. విజేతకు ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి జాతీయస్థాయి పోటీలలో అద్భుతమైన క్రీడా స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎల్ నినోపై కార్యాచరణ

ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/పెద్దపల్లి : సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమష్టిగా కార్యాచరణ చేపట్టాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. కలెక్టరేట్‌లో విప్ విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే మక్కన్ సింగ్, డిసిపి రాంరెడ్డిలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఖరీఫ్ పంటలను ఎస్సారెస్పీ ద్వారా కాపాడామని, ఇప్పుడు ప్రాజెక్టుల్లో నీరు లేదని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని అన్నారు. యాసంగిలో వరి వద్దని పప్పు, చిరుధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, శనగ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఆవాసానికి ఏడాది పాటు తాగునీరు ఇచ్చేలా ప్లాన్ చేయాలని, నీటి పొదుపుపై ప్రచారం, ప్రతి ప్రజాప్రతినిధి తన ఇంటిపై సోలార్ ప్యానెల్ పెట్టి ఆదర్శంగా ఉండాలని, సూర్య ఘర్ యోజనను విస్తరించాలని,ధాన్యానికి మద్దతు ధర అందేలా కొనుగోళ్ల పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. విప్ విజయ రమణారావు మాట్లాడుతూ యాసంగిలో వరి ప్రోత్సహించవద్దని, బోరు నీటితో వరికి బదులు మొక్కజొన్న వేస్తే ఎక్కువ విస్తీర్ణం సాగవుతుందని, శనగకు ఒక తడి చాలని, వ్యవసాయానికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందని, ప్రస్తుతం రోజుకు 12 గంటల విద్యుత్తు అందిస్తున్నట్లు, పంట వ్యర్థాలు కాల్చవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ప్రచారం చేయాలని సూచించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జూన్–అక్టోబర్ 863 మిమీ వర్షం,8% లోటు, అక్టోబర్‌లో వర్షం సున్నా అని, భూగర్భ జలమట్టం 5.31మీకు పడిందని, గతేడాది కంటే 1.41మీ తగ్గిందని, యాసంగిలో 1.53 లక్షల ఎకరాల్లోనే పంట, 90 వేల ఎకరాలు బీడు అని, ఖరీఫ్‌లో 14 మండలాల్లో 2.12 లక్షల ఎకరాలకు నీరిచ్చామని, ఎల్లంపల్లిలో 17.62 టిఎంసిలు ఉందని, 285 రోజులకు సరిపోతుందని, నవంబర్ 2వ వారంలో 311 కేంద్రాల ద్వారా 2.75 లక్షల టన్నుల కొనుగోలు లక్ష్యమని చెప్పారు. ఎమ్మెల్యే మక్కన్ సింగ్ మాట్లాడుతూ తాగునీటి కోసం డెడ్ స్టోరేజీ నుంచి కూడా తరలించేలా వ్యవస్థలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం వరి మద్దతు ధర, సన్నాలకు అదనంగా రూ.500, సీతమ్మలోధి ట్రెక్కింగ్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, మున్సిపల్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌ను సందర్శించిన 'ఆల్ఫోర్స్' విద్యార్థులు

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాయోగిక అవగాహన కల్పించాలని ఉద్దేశంతో విద్యార్థులను రైల్వే స్టేషన్ సందర్శనకు తీసుకెళ్లినట్లు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు.బుధవారం సుల్తానాబాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలకు చెందిన నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి విద్యార్థులు స్థానిక రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను కేవలం చదువులకే పరిమితం కాకుండా అన్నిరంగాల్లో వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. భాగంగానే విద్యార్థులను రైల్వేస్టేషన్ సందర్శన కోసం తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక

కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల మున్సిపల్ పరిధిలోని చింతకుంట చెరువు పరిరక్షణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి, తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ మున్సిపల్, నీటిపారుదల శాఖల అధికారులతో కలిసి చింతకుంట చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు ప్రస్తుత పరిస్థితి, పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, సంబంధిత అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చెరువు పరిరక్షణకు అవసరమైన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, చెరువు స్థలాన్ని కాపాడేందుకు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న కోర్టు భవనాల సముదాయానికి కేటాయించిన స్థలాన్ని, అలాగే ఆర్డీవో కార్యాలయ భవన నిర్మాణానికి కేటాయించిన భూమిని కలెక్టర్ పరిశీలించారు. ఆయా స్థలాలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, నిర్మాణ పనులకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు. తదుపరి మున్సిపల్ పరిధిలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణతో పాటు,ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ఉన్నారు.

100 పడకల ఆసుపత్రిని వెంటనే పూర్తి చేయాలి

ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్



ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డా.సంజయ్ కల్వకుంట్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, వైద్య సేవలు,మౌలిక సదుపాయాలు, రోగులకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు.100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోరుట్ల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి కేసీఆర్ 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు.ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రులు, ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఏర్పాటు ద్వారా గత ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందన్నారు. 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చెందాల్సిన వైద్యశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలోనే సేవలు అందిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రిలో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఉన్నప్పటికీ, దాదాపు మూడేళ్లుగా తాళం వేసి ఉండటం, తాళం చెవి అందుబాటులో లేకపోవడంతో తాళం పగలగొట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను సైతం వినియోగించుకోలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో అధికారులు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకూ ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండకూడదని ఎమ్మెల్యే అన్నారు. ఆసుపత్రి అభివృద్ధిపై నిర్లక్ష్యం వీడి,కోరుట్ల ప్రజల ఆరోగ్య అవసరాలకు ప్రాధాన్యతనిచ్చి మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు.



'నషా ముక్త్ భారత్' కోసం కృషి

కలెక్టర్ చిత్రా మిశ్రా

ప్రజాపక్షం/కరీంనగర్ : నషా ముక్త్ భారత్ కోసం అందరం కృషి చేద్దామని .. జీవితాలను చిన్నాభిన్నం చేసే పొగాకు, గుట్కా తదితర మత్తు పదార్థాల అలవాట్లకు ప్రతి ఒక్కరూ దూరం ఉండాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ, ఓయూ ఎన్ఎస్ఎస్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త్ భారత్, నషాముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్–2047 అవగాహన కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో వర్చువల్ గా వీక్షించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన వర్చువల్ కార్యక్రమానికి ఎస్ఆర్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. వర్చువల్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితంతోపాటు కుటుంబానికి, సమాజానికి నష్టం కలిగిస్తుందన్నారు. మాదక ద్రవ్య రహిత సమాజ స్థాపన కోసం ప్రతి పౌరుడు బాధ్యతతో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కలెక్టర్.. వివిధ శాఖల అధికారులు, ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. అంతకుముందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ చైర్మన్ సంగేం లక్ష్మణరావు, మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో 'నషా ముక్త్ భారత్' (మాదకద్రవ్య రహిత భారతదేశం) అవగాహన ర్యాలీ గీతా భవన్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, డీఎంహెచ్ఓ రాజ్ గోపాల్ రావు, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



జగిత్యాల ఎస్‌పి అశోక్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల : రక్తదానం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జగిత్యాల ఎస్‌పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్‌టిట్యూట్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బ్లడ్ డొనేషన్ క్యాంప్‌కు ముఖ్య అతిథిగా ఎస్‌పి అశోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ సర్కిళ్ల సిఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది, యువత స్వచ్ఛంద రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా ప్రతీ సంవత్సరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ అమరవీరులను ఎప్పటికీ మర్చిపోకుండా,నిత్యం గుర్తు చేసుకోవడానికి జిల్లాలో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోలీసులు చేపడుతున్న ఇట్టి కార్యక్రమాలకు యువత నుండి అనూహ్య స్పందన రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పోలీస్ అధికారులను అభినందించారు. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశాల దృష్ట్యా ప్రజలు నీరు, విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, డిఎంహెచ్ఓ సుజాత, సిఐలు సుధాకర్, కరుణాకర్,రాజ్ కుమార్, తిరుపతి, వేణు, సైదులు,తదితరులు ఉన్నారు.


యావత్ కరీంనగర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రైతాంగం కరువు కోరల్లో చిక్కుకుని అల్లాడుతుందని, ప్రభుత్వం తక్షణమే జిల్లా మొత్తం కరువు జిల్లాగా ప్రకటించాలనించి సిపిఐ డిమాండ్ చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితా పూర్తిగా అశాస్త్రీయంగా, హాస్యాస్పదంగా ఉందని జిల్లాలో కేవలం కరీంనగర్ రూరల్, కరీంనగర్ అర్బన్, హుజురాబాద్ మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమని, ఏ ప్రాతిపాదికన ఆ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మానకొండూరు, తిమ్మాపూర్, గంగాధర, రామడుగు, చొప్పదండి, చిగురుమామిడి, సైదాపూర్, శంకరపట్నం, ఇల్లందకుంట వంటి మండలాల్లో వరి, పత్తి పంటలకు సాగునీరు అందక, ప్రభుత్వం విద్యుత్ సకాలంలో ఇవ్వక చేతికొచ్చే దశలో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదనకు వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోయిన ప్రతీ మండలాన్ని కరువు జాబితాలో చేర్చుతూ సప్లిమెంటరీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఎల్‌నినో వర్షాభావంతో దెబ్బతిన్న ప్రతి ఎకరాకు 25 వేల రూపాయల తక్షణ పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించి రైతులను ఆదుకోవాలన్నారు. కరీంనగర్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

డ్రగ్ రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

పోలీసు కమిషనర్ గౌష్ ఆలం



ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ కమిషనరేట్‌ను మాదకద్రవ్య రహిత (డ్రగ్ ఫ్రీ) కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని పోలీసు కమిషనర్ గౌష్ ఆలం అన్నారు. మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్ డిపిఎస్) కేసులపై బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఈగల్ టీమ్) ఎస్పీ గిరిధర్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆధ్వర్యంలో కమిషనరేట్ పోలీస్ అధికారులతో కలిసి పెండింగ్ ఎన్‌డిపిఎస్ కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ, కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను పరిశీలించి, దర్యాప్తులో కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దర్యాప్తు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గంజాయి సరఫరా చేసే ప్రధాన పెడ్లర్లపై నిరంతర నిఘా ఉంచాలని, సరఫరా వ్యవస్థను పూర్తిగా ఛేదించాలని ఆదేశించారు. దర్యాప్తు అధికారులు ఎన్‌డిపిఎస్ చట్టాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, సరైన ఆధారాలతో పకడ్బందీగా ఛార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా కళాశాలలు, విద్యాసంస్థల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలోని డీ–అడిక్షన్ కేంద్రాలు, అందులోని వ్యక్తుల కదలికలపై పూర్తి స్థాయి నిఘా కొనసాగించాలని ఆదేశించారు. సమావేశంలో గంజాయి వినియోగదారులకు (కన్స్యూమర్లకు) ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించి, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, ఎదురయ్యే అనర్థాలను సిపి, ఎస్పీలు వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనరేట్ ఏసీపీలు వెంకటస్వామి, విజయకుమార్, మాధవి, ఈగల్ ఎసిపిలు ఉపేందర్, సోమనాథ్, పుష్పన్ కుమార్, సీఐలు, ఎస్సైలు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.


పక్కాగా ఆర్ అండ్ ఆర్ సర్వే

అదనపు కలెక్టర్ శ్రీరాములు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : చామనపల్లి గ్రామంలో ఆర్ అండ్ ఆర్ సర్వే పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఆర్ అండ్ ఆర్ (పునరావాసం, పునరుద్ధరణ) సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నంది మేడారం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసే క్రమంలో చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, నిబంధనల్లో సడలింపులు కల్పిస్తూ గ్రామం మొత్తాన్ని భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ కాలనీ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు గ్రామంలోని ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో సమగ్రంగా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి ఒక ప్రత్యేక ప్రాజెక్టు నంబర్ కేటాయించి, ఇంటిలోని కుటుంబ సభ్యుల వివరాలతో పాటు చెట్లు, మోటార్లు, ఇతర పరికరాలు తదితర ఆస్తుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో అదనప కలెక్టర్ వెంట పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, ధర్మారం తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో నష్టాలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలు, ఇబ్బందులపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనికలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కలెక్టర్ ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదవుతున్న ఎన్‌డీపీఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాదక ద్రవ్యాల నియంత్రణ చర్యలు, శాఖలవారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై చేయాల్సిన విస్తృత ప్రచారం, డిఅడిక్షన్ కేంద్రంలో వైద్య సేవలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ డ్రగ్స్, మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాక ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని సూచించారు. అటవీశాఖ, వ్యవసాయ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, ఇంటర్ విద్యాధికారి శరత్, మున్సిపల్ కమీషనర్లు ఖదీర్ పాషా, లోకేశ్, జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష, వ్యవసాయ, కార్మిక, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘోర వైఫల్యం

మందుల అధిక ధరలపై 'సుప్రీం' వ్యాఖ్యల నేపథ్యంలో కాంగ్రెస్ విమర్శలు



న్యూఢిల్లీ : మందుల అధిక ధరలపై కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసి ప్రశ్నించిన నేపథ్యంలో, కాంగ్రెస్ బుధవారం మోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. ఖరీదైన మందులు, ఆసుపత్రుల భారీ బిల్లుల సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించింది. అధికార గర్వంతో ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడాన్ని ప్రభుత్వ 'ఘోర వైఫల్యం' అని అభివర్ణించింది. మందుల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పి), రిటైలర్లకు విక్రయించే ధర మధ్య భారీ వ్యత్యాసం ఉందని సుప్రీంకోర్టు ప్రస్తావించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ సమాచార విభాగం ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ ప్రభుత్వంపై ఈ విమర్శలు చేశారు. మందుల ధరల దోపిడీకి ఏమైనా సమర్థన ఉందా? ఔషధ తయారీదారులను ఇష్టారాజ్యంగా వ్యవహరించనివ్వాలా? అంటూ సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాగా, ఖరీదైన మందులు, ఆసుపత్రుల భారీ బిల్లులు సాధారణ కుటుంబాలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో హిందీలో చేసిన పోస్టులో పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ద్రవ్యోల్బణం ప్రభావం ఆరోగ్య సేవలపైనా తీవ్రంగా పడిందని, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం అధికార గర్వంతో ఈ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ అసమర్థతకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని ఆయన ఆరోపించారు. కుటుంబాలు భారీ వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్నాయని, ఆత్మీయులకు చికిత్స చేయించేందుకు కొందరు అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. 'వైద్యం వ్యాపారం మాత్రమే కాదు.. అది ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయం. ఔషధ కంపెనీల లాభాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రజలకు అందుబాటు ధరల్లో మందులు, తక్కువ ఖర్చుతో చికిత్స అందేలా చూడాలి. వైద్యం కోసం సామాన్యులు అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తే, అలాంటి పరిస్థితులను ఏ విధంగా 'అచ్చే దిన్' అంటాం?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకుంటే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తున్నదని ఆయన అన్నారు. ఇది మోదీ ప్రభుత్వానికి పెద్ద వైఫల్యమని విమర్శించారు. ఔషధ ధరల నియంత్రణకు బాధ్యత వహించే నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పిపిఎ) పూర్తిగా నిర్వీర్యమైన సంస్థలా కనిపిస్తోందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. ఔషధ తయారీదారులకు అనుకూలంగా మొత్తం వ్యవస్థ ఎందుకు పనిచేస్తోందని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేన్సర్ మందులపై గరిష్ఠ చిల్లర ధరలో 30 శాతానికి వాణిజ్య మార్జిన్‌ను పరిమితం చేయాలని నిర్ణయించినట్లు కేంద్రం ధర్మాసనానికి తెలిపింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తులు, అన్ని మందులకూ ఏకరీతిగా 16 శాతం మార్జిన్ను ఎందుకు అమలు చేయలేరని ప్రశ్నించారు.

వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు రూ.7,395 కోట్లు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజన(పిఎంవిజిఎస్‌వై) అమలుకు రూ.7,395 కోట్ల నిధులు కేటాయించేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. నిర్దేశించిన పథకాల అమలు నుంచి స్థానిక స్థాయిలో సామర్థ్య నిర్మాణం, ప్రణాళికల రూపకల్పనకు ప్రాధాన్యమిచ్చే విధానంలోకి ఇది కీలక మార్పు అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామ పంచాయతీలు తమ ప్రాంతంలోని వనరులు, పరిమితులను గుర్తించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించుకోగలవని వైష్ణవ్ తెలిపారు. నిర్దిష్ట పనులను ముందుగానే నిర్దేశించే పథకాల స్థానంలో, స్థానిక సంస్థలే తమ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించుకునేలా బలోపేతం చేయడం ఈ విధానంలోని ప్రధాన మార్పు అని ఆయన వివరించారు. జాతీయ స్థాయిలో ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి తరం పాలనా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే కార్యక్రమంగా ఈ పథకాన్ని పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ తన అధికారిక ప్రకటనలో అభివర్ణించింది. 2026–27 నుంచి 2030–31 వరకు ఈ పథకాన్ని అమలు చేయడానికి ఆమోదం లభించింది. ఈ కాలం 16వ ఆర్థిక సంఘం పదవీకాలంతో సమానంగా ఉంటుంది. పథకం మొత్తం వ్యయం రూ.7,395.55 కోట్లు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.4,869.48 కోట్లు కాగా, రాష్ట్రాల వాటా రూ.2,526.07 కోట్లు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ పథకంలో కీలక అంశం. వారి పనితీరు, పాలనా సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు సాధారణ, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా 2.55 లక్షలకు పైగా గ్రామ పంచాయతీలు, సంప్రదాయ స్థానిక సంస్థల్లోని సుమారు 32 లక్షల మంది ఎన్నికైన ప్రజాప్రతినిధులతో పాటు పంచాయతీ సిబ్బంది, ఇతర భాగస్వాములు ఈ పథకం ద్వారా ప్రత్యక్షంగా ప్రయోజనం పొందుతారు. పిఎంవిజిఎస్‌వై పోర్టల్ ద్వారా ఏటా 2.55 లక్షల సమగ్ర గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు సహాయం అందిస్తారు. స్థానిక ప్రాధాన్యాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న వనరులను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకొస్తారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంచి, అభివృద్ధిలో లోటుపాట్లను గుర్తించడంతోపాటు అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారు. పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఆడిట్‌ఆన్‌లైన్ వేదిక ద్వారా ఏటా కనీసం 2.55 లక్షల ఆన్‌లైన్ ఆడిట్ ప్రణాళికల రూపకల్పనకు సహాయం అందిస్తారు. సంబంధిత ఆడిట్లను సకాలంలో పూర్తి చేయడంపైనా దృష్టి సారిస్తారు. మెరుగైన లెక్కల నిర్వహణ, ఆర్థిక సమాచారాన్ని ప్రజలకు వెల్లడించడం, పంచాయతీల సొంత ఆదాయాన్ని పెంచడం ద్వారా గ్రామీణ స్థానిక సంస్థల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల యంత్రాంగాలు ఈ పథకాన్ని అమలు చేస్తాయి. అవి ఏటా కార్యాచరణ ప్రణాళికలను సమర్పించాలి. కేంద్ర ప్రభుత్వం నియమించిన సాధికార కమిటీ వాటిని పరిశీలించి ఆమోదిస్తుంది. పంచాయతీలు లేని ప్రాంతాల్లోని సంప్రదాయ స్థానిక సంస్థలతో సహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకం కింద శాశ్వత ఉద్యోగాలను సృష్టించరు. అయితే, సాంకేతిక సహాయం అందించేందుకు అవసరాన్ని బట్టి రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయుల్లో కాంట్రాక్టు సిబ్బందిని నియమించుకోవచ్చు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 3 శాతం డిఎ, డిఆర్ పెంపు

న్యూఢిల్లీ : దీపావళి పండుగకు ముందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త అందించింది. కరువు భత్యం (డిఎ), కరువు ఉపశమన భత్యం (డిఆర్)లను 3 శాతం పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో 1.17 కోట్ల మందికిపైగా ఉద్యోగులు, పెన్షనర్లు ప్రయోజనం పొందనున్నారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్ని ప్రకటించిన కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దీనిని 'దీపావళి కానుక'గా అభివర్ణించారు. పెంచిన డిఎ, డిఆర్ 2026 జులై 1 నుంచి అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం మూల వేతనం లేదా పెన్షన్‌పై 60 శాతంగా ఉన్న డిఎ, డిఆర్ రేటుకు అదనంగా 3 శాతం పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటనలో తెలిపింది. ధరల పెరుగుదల ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ పెంపుతో కేంద్ర ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.10,016.10 కోట్ల అదనపు భారం పడనుంది. ఈ నిర్ణయం ద్వారా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు ప్రయోజనం పొందుతారు. ఏడో కేంద్ర వేతన సంఘం సిఫారసుల ఆధారంగా ఆమోదించిన సూత్రానికి అనుగుణంగానే డిఎ, డిఆర్ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

జెఎన్‌యులో పిహెచ్‌డి ప్రవేశాల్లో రిజర్వేషన్ల ఉల్లంఘన: ఎస్‌ఎఫ్‌ఐ ఆరోపణ



న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జెఎన్‌యు) 2026–27 విద్యా సంవత్సరానికి పిహెచ్‌డి ప్రవేశాల్లో రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘించిందని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) ఆరోపించింది. సీట్ల కేటాయింపులో లోపాలను వెంటనే సరిదిద్దాలని డిమాండ్ చేసింది. పత్రికా సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందా కారత్ సహా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ, షెడ్యూల్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్ తెగలు (ఎస్‌టి), బెంచ్‌మార్క్ వైకల్యాలున్న అభ్యర్థులకు ప్రాస్పెక్ట్‌లో తగినన్ని సీట్లు కేటాయించలేదని ఆరోపించారు. మొత్తం 711 సీట్లలో ఎస్‌టిలకు 7.5 శాతం రిజర్వేషన్ ప్రకారం 53 సీట్లు కేటాయించాల్సి ఉండగా, 38 మాత్రమే ప్రకటించారని తెలిపారు. అదే విధంగా ఎస్‌సిలకు 15 శాతం రిజర్వేషన్ ప్రకారం సుమారు 107 సీట్లు అవసరమవగా, 103 మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. వైకల్యాలు ఉన్న అభ్యర్థులకు సుమారు 36 సీట్లు కేటాయించాల్సి ఉండగా, 17 మాత్రమే ప్రకటించారని ఆరోపించారు. ఈ అంశంపై జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్లు స్పందించాయని ఎస్‌ఎఫ్‌ఐ తెలిపింది. ప్రవేశాల్లో లోపాలను సరిదిద్ది, రిజర్వు సీట్ల భర్తీకి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది.

జౌహర్ యూనివర్సిటీ భూములు, భవనాలు
'ఇడి' అటాచ్

న్యూఢిల్లీ : సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజం ఖాన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని మొహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీ భూములు, భవనాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) బుధవారం అటాచ్ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ యూనివర్సిటీ ప్రస్తుత మార్కెట్ విలువ సుమారు రూ.1,170 కోట్లుగా ఉందని కేంద్ర దర్యాప్తు సంస్థ తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లా సింఘన్ఖేడా గ్రామం, జౌహర్ నగర్‌లో ఉన్న యూనివర్సిటీ ప్రాంగణం మౌలానా మొహమ్మద్ అలీ జౌహర్ ట్రస్ట్ ఆధీనంలో ఉందని ఇడి పేర్కొంది. ఆజం ఖాన్ ఈ ట్రస్ట్‌ను స్థాపించడంతోపాటు దాని కార్యకలాపాలను నియంత్రిస్తున్నారని తెలిపింది. ఆయన యూనివర్సిటీకి గౌరవ ఛాన్సలర్గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ ఆస్తులను అటాచ్ చేస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇడి తన ప్రకటనలో వెల్లడించింది. ఈ కేసుకు సంబంధించి ఆగస్టులో ఇడి సోదాలు నిర్వహించింది. ప్రస్తుతం రాంపూర్ జైలులో ఉన్న ఆజం ఖాన్‌ను కూడా అధికారులు విచారించారు. లక్నో కేంద్రంగా పనిచేసే మౌలానా మొహమ్మద్ అలీ జౌహర్ ట్రస్ట్‌కు ఆజం ఖాన్ ప్రధాన ట్రస్టీగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ మంత్రిగా పనిచేసిన ఆయనతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ట్రస్ట్ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారు. ఈ ట్రస్ట్ 2006లో స్థాపించిన మొహమ్మద్ అలీ జౌహర్ యూనివర్సిటీతోపాటు రాంపూర్ జిల్లాలో ఒక పబ్లిక్ స్కూల్‌ను నిర్వహిస్తోంది.

నకిలీ మద్యం తయారీకి 'ఎఐ' సాయం!



ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని దేవాస్ జిల్లాలో కల్తీ మద్యం తయారీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రసాయనాలతో నకిలీ మద్యం తయారు చేసే పద్ధతులను తెలుసుకోవడానికి ముఠాలోని ప్రధాన నిందితుడు కృత్రిమ మేధ (ఎఐ) వేదికలను ఉపయోగించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కల్తీ మద్యం సేవించి పలువురు మరణించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మృతుల సంఖ్య పదికి చేరిందని స్థానికులు చెబుతున్నారు. ఈ కేసులో ఇప్పటివరకు పది మందిని అరెస్టు చేశారు. దేవాస్ కొత్వాలి పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి శశికాంత్ చౌరాసియా తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఆరు అట్టపెట్టెల దేశీయ మద్యాన్ని స్వాధీనం చేసుకుని, అనుమానితులను విచారించగా అక్రమ మద్యం తయారీ కేసు వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు అజయ్ రాథోడ్ సెప్టెంబరు నుంచి ఎఐ వేదికల ద్వారా ఇంట్లో మద్యం తయారీ పద్ధతులు, రసాయన మిశ్రమాల గురించి తెలుసుకున్నట్లు పోలీసులు ఆరోపించారు. అనంతరం ఇండోర్‌లోని ఓ ప్రైవేటు సంస్థ నుంచి రసాయనాలను తెప్పించుకున్నట్లు తెలిపారు. అక్టోబరు 2 నుంచి 7 మధ్య స్క్రాప్ వ్యాపారుల నుంచి లైసెన్సు పొందిన మద్యం బ్రాండ్ల ఖాళీ సీసాలను సేకరించి, రసాయనాలు, నీటితో తయారుచేసిన మద్యాన్ని వాటిలో నింపినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు చెప్పారు. అసలైన మద్యంతో ఈ కల్తీ మద్యాన్ని కలిపి అక్టోబరు 6 నుంచి 12 మధ్య స్థానికులకు విక్రయించినట్లు తెలిపారు. రసాయనాలు సరఫరా చేసిన ఇండోర్ గోదాముకు అధికారులు సీల్ వేశారు. దేవాస్, ఇండోర్ జిల్లాల్లోని మూడు లైసెన్సు పొందిన మద్యం దుకాణాలకు చెందిన ఇద్దరు మేనేజర్లు, ఇద్దరు విక్రయదారులు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరు అసలైన మద్యాన్ని అక్రమంగా ముఠాకు సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, మృతుల్లో ఇద్దరి శరీర అవయవ నమూనాలతోపాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపారు. మరణాలకు ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ముఠాతో సంబంధాలున్న మరో ఇద్దరు మద్యం దుకాణాల సిబ్బంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇలావుంటే, చందనా, బింజనా గ్రామాల్లో సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 16 మధ్య కనీసం పది మంది వాంతులు, తల తిరగడం, నోటివెంట నురుగు రావడం వంటి లక్షణాలతో మరణించారని గ్రామస్థులు ఆరోపించారు. ముగ్గురు కంటి చూపు కోల్పోయారని, పలువురు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని మాజీ సర్పంచ్ సునీల్ పటేల్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతూ పట్వారీ బాధిత కుటుంబాలను పరామర్శించి, చందనా, పరిసర ప్రాంతాల్లో గత నెల రోజుల్లో విషపూరిత మద్యం కారణంగా కనీసం 22 మంది మరణించారని, దాదాపు 40 మంది చూపు కోల్పోయారని ఆరోపించారు. మద్యం మాఫియాను కాపాడేందుకు అధికారులు మరణాల వివరాలను దాచిపెడుతున్నారని విమర్శించారు. అయితే, ఈ సంఖ్యలను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరించలేదు. తొలుత మద్యం కారణంగా మరణాలు సంభవించాయన్న ఆరోపణలను జిల్లా అధికారులు తోసిపుచ్చారు. ప్రజల్లో ఆగ్రహం పెరగడంతో అక్టోబరు 25న ఉజ్జయిని డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి విచారణ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. సాగర్, దేవాస్ జిల్లాల్లో కల్తీ మద్యం మరణాలపై ఒత్తిడి పెరగడంతో, ఆ రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు సహా తొమ్మిది మంది సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మద్యం సరఫరా వ్యవస్థ, రసాయనాల కొనుగోలు మూలాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

చేపల ఉత్పత్తి 3 కోట్ల టన్నులకు పెంచడమే లక్ష్యం

న్యూఢిల్లీ: భారతదేశంలో రాబోయే ఐదేళ్లలో చేపల ఉత్పత్తిని 3 కోట్ల టన్నులకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతుల విలువను రూ.1.25 లక్షల కోట్లకు పెంచాలని యోచిస్తోంది. ఈ లక్ష్యాలను సాధించేందుకు చిన్న తరహా అంతర్గత మత్స్య సంపద అభివృద్ధి కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌పిఎ) రూపొందిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఎఒ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రణాళికను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో కేంద్ర మత్స్యశాఖతో పాటు 'బే ఆఫ్ బెంగాల్ ప్రోగ్రామ్ ఇంటర్–గవర్నమెంట్ ఆర్గనైజేషన్ (బిఒబిపిఐజిఒ) భాగస్వామ్యంగా ఉంది. ప్రస్తుతం భారత్‌లో ఏటా 1.97 కోట్ల టన్నుల చేపలు ఉత్పత్తి అవుతున్నాయి. ఇందులో సుమారు 75 శాతం నదులు, సరస్సులు, చెరువులు, జలాశయాలు వంటి అంతర్గత జల వనరుల నుంచే లభిస్తోంది. సముద్ర ఆహార ఎగుమతుల విలువ ఇప్పటికే రూ.70,000 కోట్లను దాటింది. ఈ కొత్త ప్రణాళిక ద్వారా మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, చేపల నిల్వ, రవాణా, విక్రయ వ్యవస్థలను మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం, మత్స్యకారుల హక్కులను పరిరక్షించడం కూడా ఇందులో భాగం. వాతావరణ మార్పులు, నీటి నాణ్యత తగ్గడం, నీటిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం వంటి సమస్యలను పరిష్కరించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. మత్స్యకారుల అభిప్రాయాలను సేకరించి, వచ్చే నెలలో ఈ ప్రణాళికను అధికారికంగా విడుదల చేయనున్నారు.

అత్యంత తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న దేశం
పెరుగుతున్న ఆర్థిక అసమానతపై పట్టింపు ఏదీ?

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ : పెరుగుతున్న ఆర్థిక అసమానత భారతదేశం ఎదుర్కొంటున్న 'అత్యంత తీవ్రమైన సమస్యలలో ఒకటి' అని, ఈ 'ఆర్థిక సంక్షోభం' వాస్తవికతను ప్రభుత్వం గుర్తించాలని, ఉపాధి అవకాశాలను విస్తరించడమే కాకుండా, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని బుధవారం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఆర్థికాభివృద్ధి వల్ల కలిగే ప్రయోజనాలు సామాన్యుడి దరికి చేరినప్పుడే ఆ వాదనలకు అర్థం ఉంటుందని, లేనిపక్షంలో ఈ గణాంకాలు పురోగతిని కాకుండా, పెరుగుతున్న ఆర్థిక అంతరాన్ని మాత్రమే తెలియజేస్తున్నాయని ప్రతిపక్ష కాంగ్రెస్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ధ్వజమెత్తింది. కుటుంబాలు, బ్యాంక్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్, ఇతర ఆర్థిక ఆస్తులలో ఎక్కువ డబ్బు పెట్టుబడిగా పెట్టినప్పటికీ, వారి 'కొత్త అప్పు' చాలా వేగంగా పెరిగిందని, ఫలితంగా, గత ఏడాది రూ.22.57 లక్షల కోట్లతో పోలిస్తే, 2025–26 ఆర్థిక సంవత్సరంలో నికర గృహ ఆర్థిక పొదుపులు సుమారు 4శాతం తగ్గి, రూ.21.69 లక్షల కోట్లకు పడిపోయాయని పేర్కొన్న ఒక మీడియా కథనాన్ని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేశ్ 'ఎక్స్' పోస్ట్‌లో పంచుకున్నారు. ఓటు హక్కును లాక్కోవడానికి మోదీ ప్రభుత్వం తహతహలాడుతోందని, ఇప్పుడు జీవించే హక్కును కూడా తొలగించాలని చూస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా మోదీ ప్రభుత్వంపై ఆరోపణల దాడికి దిగారు. 'పండుగల మధ్యలో, నడుము విరిచేంత ద్రవ్యోల్బణం, సంపాదనలోని ప్రతీ పైసాను మింగేస్తోంది. గణాంకాలే నిజాన్ని చెబుతున్నాయి. ఆహార ద్రవ్యోల్బణం 2.13శాతం నుంచి 7.74శాతానికి పెరిగింది. గృహ రుణం : మూడు రెట్ల వేగంతో 36.7శాతం పెరిగింది. గృహ ఆర్థిక పొదుపు : 4శాతం తగ్గింది. రిటైల్ ద్రవ్యోల్బణం : 5.54శాతం. టోకు ద్రవ్యోల్బణం : 11.39శాతం నమోదైంది' అని మల్లికార్జున్ ఖర్గే తన 'ఎక్స్' హిందీ పోస్టులో వెల్లడించారు. 'ప్రస్తుతం అధికారంలో ఉండి ధర్నాలు చేస్తున్న బిజెపికి, మోదీకి వారి అర్థంలేని ఆర్భాటాల నుండి ఎప్పుడైనా సమయం దొరికితే, వారు 2014కు ముందు వచ్చిన తమ 'బహుత్ హుయీ మెహంగాయీ' యాడ్‌ను తిరిగి చూసుకోవాలి.అచ్చే దిన్ వాగ్దానం కోసం ఎదురుచూస్తూ ప్రజలు 12ఏళ్లు వృథా చేసుకున్నారు' అని మల్లి కార్జున్ ఖర్గే విమర్శించారు.

బాధితులకు కొండంత అండ

- నేటి నుంచే ఆర్థిక సాయం పంపిణీ
- ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి: అర్నాబ్ తుపాను బీభత్సం వల్ల పంటలు, ఇళ్లు, ఆస్తులు కోల్పోయిన బాధితులు త్వరితగతిన కోలుకునేందుకు వీలుగా ప్రభుత్వం తరపున సమగ్ర సహాయక ప్యాకేజీని ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు ప్రకటించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందస్తుగా షెల్టర్ క్యాంపుల్లో తలదాచుకున్న ప్రతి ఒక్కరికీ రూ. 1,000 చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందించనున్నారు. ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాలకు 25 కేజీల బియ్యం, చేనేత మగ్గాలు ఉన్నవారికి మరియు మత్స్యకార కుటుంబాలకు 50 కేజీల బియ్యంతో పాటు కేజీ చొప్పున ఉల్లిపాయలు, వంటనూనె, కందిపప్పు ఉచిత రేషన్ ఇస్తారు. ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైతే రూ. 10 వేలు షాపులు/దుకాణాలు దెబ్బతింటే రూ. 25 వేలు, తోపుడు బండ్లు (పుష్ కార్ట్స్) నష్టపోతే రూ. 20 వేలు అందిస్తారు. ద్విచక్ర వాహనాలకు రూ. 3 వేలు, త్రిచక్ర వాహనాలకు రూ. 10 వేలు, వీవర్ కవ్యనిటీకి రూ. 25 వేలు సహాయం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులకు ఫిషింగ్ బోట్లు, వలలు ధ్వంసమైతే రూ. 25 వేలు పరిహారం చెల్లిస్తామన్నారు.

రైతన్నకు ఊరట...నష్టపరిహారాల వివరాలు

వ్యవసాయ, ఉద్యానవన పంటలు దెబ్బతిన్న రైతాంగాన్ని పూర్తి స్థాయిలో ఆదుకుంటామని సిఎం భరోసా ఇచ్చారు. పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు ఎన్యుమరేషన్ తక్షణమే చేపడుతున్నట్లు తెలిపారు. అరటి పంట హెక్టారుకు రూ. 35 వేలు చొప్పున ఆర్థిక సాయం. పత్తి, చెరకు హెక్టారుకు రూ. 25 వేలు చొప్పున పరిహారం. టమోటో, ఇతర పంటలు హెక్టారుకు రూ. 25 వేలు చొప్పున ఆయా కేటగిరీల వారీగా పరిహారం పంపిణీ చేయనున్నారు. పంట పరిహారం మినహా మిగిలిన అన్ని రకాల బాధితులకు తక్షణ ఆర్థిక సాయాన్ని గురువారం (నేటి) నుంచే నేరుగా అందిస్తామని సిఎం తెలిపారు.


యుద్ధ ప్రాతిపదికన విద్యుత్, రహదారుల పునరుద్ధరణ

ఈ తుపాను ధాటికి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు నేలకూలాయని సిఎం వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మినహా మిగిలిన అన్ని జిల్లాల్లోనూ విద్యుత్ సరఫరాను విజయవంతంగా పునరుద్ధరించామని తెలిపారు. ఆ రెండు జిల్లాల్లో బురద, ఎడతెరిపి లేని వర్షాల వల్ల పనులకు కొంత ఇబ్బంది కలుగుతోందని, (శుక్రవారం) సాయంత్రానికి అక్కడ కూడా సరఫరా సాధారణ స్థితికి వస్తుందని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై కూలిన చెట్లను తొలగించి రాష్ట్ర, పంచాయతీ రహదారులలో రాకపోకలను బుధవారం రాత్రికే పునరుద్ధరించినట్లు చెప్పారు. తుపాను నష్ట తీవ్రతపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్లో సుదీర్ఘంగా మాట్లాడినట్లు సిఎం వెల్లడించారు. రాష్ట్రంలో తుపాను ప్రభావం, జరిగిన నష్టం వివరాలను కేంద్రానికి వివరించానని, ప్రాథమిక అంచనా నివేదికను పంపిస్తున్నామని తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయి సమగ్ర నివేదికను కూడా సమర్పిస్తామన్నారు. నేడు (గురువారం) వర్చువల్ కేబినెట్ నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకున్న అనంతరం, మధ్యాహ్నం తానే స్వయంగా తుపాను ప్రభావిత జిల్లాల్లో పర్యటించి నష్ట తీవ్రతను నేరుగా పరిశీలిస్తానని సిఎం ప్రకటించారు.

సాంకేతికత, ముందస్తు ప్రణాళికతో ముప్పును తగ్గించాం

అధునాతన సాంకేతికత, పక్కా ముందస్తు ప్రణాళికతో 'అర్నాబ్' తుపాను సృష్టించిన ముప్పు నుంచి రాష్ట్రాన్ని అత్యంత సమర్థవంతంగా రక్షించుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గడిచిన 3 రోజుల్లోనే ఏకంగా 7 విడతలుగా ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించామని సిఎం వెల్లడించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి మొదలుకొని గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది వరకు దాదాపు 30 వేల మంది క్షేత్ర స్థాయి అధికారులతో నిరంతరం టెలికాన్ఫరెన్సులు నిర్వహిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించామన్నారు. 'అంచనా, కచ్చితత్వం, క్షేత్ర స్థాయి కార్యాచరణ' అనే వ్యూహంతో తుపాను ప్రభావం చూపే ప్రాంతాలను మాత్రమే ముందే గుర్తించి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని, దీనివల్ల ముప్పు తీవ్రతను గణనీయంగా తగ్గించగలిగామని స్పష్టం చేశారు.

ఇప్పటికీ బాల్య వివాహాలు!



న్యూఢిల్లీ : భారతదేశంలో బాల్య వివాహాల సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినప్పటికీ, ఈ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 1996లో 50 శాతానికి పైగా ఉన్న బాల్య వివాహాల రేటు ప్రస్తుతం 20 శాతానికి కొద్దిగా ఎక్కువ స్థాయికి తగ్గింది. అయినప్పటికీ, భారతదేశంలో ప్రతి ఐదుగురు యువతుల్లో ఒకరు 18 సంవత్సరాల వయసు పూర్తికాకముందే వివాహం చేసుకుంటున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా బాల్య వివాహాలకు గురైన బాలికల్లో దాదాపు మూడో వంతు మంది భారతదేశానికి చెందినవారే. ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో దేశంలోని మొత్తం బాల్య వివాహాల్లో సగానికి పైగా నమోదవుతున్నాయి. మరోవైపు, కేరళం, లక్షద్వీప్ వంటి ప్రాంతాల్లో పరిస్థితి మెరుగ్గా ఉంది. జాతీయ స్థాయిలో బాల్య వివాహాలు తగ్గుతున్నాయని చెప్పడం మాత్రమే సరిపోదని, సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, విద్యావకాశాల కొరత, సామాజిక ఆచారాలు బాల్య వివాహాలకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా పేద కుటుంబాలు తమ కుమార్తెలను పోషించడం కష్టంగా భావించి చిన్న వయసులోనే వివాహం చేయడానికి మొగ్గు చూపుతున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. బాలికలకు నాణ్యమైన విద్య,ఆరోగ్యసేవలు,నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక అవకాశాలు కల్పించడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

బాల్య వివాహాలు బాలికల బాల్యాన్ని, విద్యను, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే హక్కును దెబ్బతీస్తాయి. చిన్న వయసులో గర్భధారణ వల్ల తల్లి, శిశువుల ఆరోగ్యానికి ప్రమాదాలు పెరుగుతాయి. అలాగే గృహహింసకు గురయ్యే అవకాశం, మానసిక ఒత్తిడి, ఆర్థిక ఆధారపడటం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఫలితంగా పేదరికం, లింగ అసమానతలు తరతరాల పాటు కొనసాగుతాయి. భారతదేశంలో బాల్య వివాహాల నిరోధానికి చట్టాలు అమల్లో ఉన్నాయి. చట్టం ప్రకారం, 18 సంవత్సరాల లోపు బాలికకు లేదా 21 సంవత్సరాల లోపు బాలుడికి సంబంధించిన వివాహం బాల్య వివాహం పరిధిలోకి వస్తుంది. 2024లో ప్రారంభించిన బాల్య వివాహాల రహిత భారతదేశ ప్రచారం ద్వారా 2030 నాటికి ఈ ఆచారాన్ని పూర్తిగా నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో కూడా బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలనకు ప్రాధాన్యం ఉంది. అయితే, చట్టాలు ఉండటం మాత్రమే సరిపోదు. బాలికలు పాఠశాలల్లో కొనసాగేందుకు ప్రోత్సహించడం, తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించడం, బాల్య వివాహాలను గుర్తించి అడ్డుకోవడం, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవడం కీలకం. 2030 లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలి. ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత, స్వేచ్ఛగా తన భవిష్యత్తును నిర్ణయించుకునే హక్కు కల్పించినప్పుడే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుంది.

స్పెయిన్‌లో హైస్పీడు రైళ్లు ఢీ: 68 మంది మృతి



మాడ్రిడ్: యూరప్ దేశం స్పెయిన్‌లోని దక్షిణ మాడ్రిడ్‌లో బుధవారం ఒక హై స్పీడ్ రైలు ఆగి ఉన్న రైలును ఢీ కొట్టింది. ప్రమాదంలో 68 మంది మరణించినట్లు అధికారులు చెప్పారు. దక్షిణ మాడ్రిడ్‌కు 140 కి.మీ దూరంలో ఉర్దా పట్టణంవద్ద ఈ ఘోర ప్రమాదం సంభవించింది.
ఈ రెండు రైళ్ళలోనూ 500 మంది ప్రయాణం చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. మృతుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఒక ప్రైవేటు ఆపరేటర్ నడిపించే రైలులో 147 మంది ప్రయాణికులు ఉండగా, హైస్పీడు రైలులో 397 మంది ప్రయాణికులు ఉన్నారని కాస్టిల్లా లామంఛాలోని అధికారులు చెప్పారు. ఈ రెండు రైళ్ళూ ఎలా ఢీకున్నాయనే విషయాన్ని అధికారులు ధృవీకరించలేదు. కానీ ఆగి ఉన్న రైలును హైస్పీడు రైలు ఢీకొట్టిందని సమాచారం.
గడచిన జనవరినెలలో అడమజ్‌లో 46 మంది ప్రయాణికులు మరణించిన దారుణమైన రైలు ప్రమాద విధ్వంసంకంటే ఈ ప్రమాదాన్ని అత్యంత తీవ్రమైనదిగా స్థానిక పత్రికలు చెబుతున్నాయి.
ఈ హైస్పీడ్ రైళ్ళు ఢీకొట్టుకున్న ఘటనపట్ల స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంఛెజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన కార్యక్రమాలన్నీ రద్దుచేసుకుని సమయం అంతా ఈ విషయం పైనే కేటాయించారు. ఎప్పటికప్పుడు రవాణాశాఖామంత్రితో, రైల్వే అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ ప్రదేశానికి హెలికాప్టర్ల ద్వారా సహాయ బృందాలను, అగ్నిమాపక దళాలను తరలించారు. స్థానిక బ్లడ్‌బ్యాంకుల ద్వారా సహాయాన్ని తరలించారు. ఆసుపత్రుల్లో పడకలు సిద్ధం చేశారు. ఘటనా ప్రదేశాన్ని సందర్శించిన ఒక స్పానిష్ బ్రాడ్‌కాస్టర్‌తో ఆ రైలులో ప్రయాణం చేసిన ఒక యువకుడు మాట్లాడుతూ, ఈ ఘటనను అత్యంత వినాశకరమైనదిగా అభివర్ణించారు.

ఇజ్రాయెల్ కొత్త ప్రభుత్వంలో ...
అరబ్ పార్టీలే కింగ్ మేకర్
ఏ కూటమికీ మెజారిటీ లేదని ముందస్తు సర్వేల వెల్లడి



టెల్అవీవ్: ఇజ్రాయెల్‌లో ఎన్నికల పోలింగ్ పూర్తయి, ముందస్తు సర్వే నివేదికలు వచ్చిన తర్వాత రాజకీయ ఎత్తుగడల కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. నెతన్యాహూ ఎట్టి పరిస్థితుల్లో తిరిగి అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని గాడి ఐసెన్‌కోట్ నాయకత్వంలోని ఇజ్రాయెల్ ప్రధాన ప్రతిపక్ష బ్లాక్ శపథం చేసింది. మరోవైపు ఏ కూటమికీ సంపూర్ణ మెజారిటీ రాదని ముందస్తు సర్వేలు ప్రకటించడంతో, నిర్ణయాత్మక స్థానంలో ఉన్న అరబ్ పార్టీల(జాయింట్ లిస్ట్)తో ప్రధాన ప్రత్యర్థి యషార్‌పార్టీ చేతులు కలపడం ద్వారా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఐసెన్‌కోట్‌కు డెమోక్రాట్స్‌పార్టీ నాయకుడు యైర్ గోలన్ పిలుపు ఇచ్చారు. అరబ్ పార్టీలకు 19 సీట్లు వస్తాయని, ఐసెన్‌కోట్ కూటమికి 47 స్థానాలు వస్తాయని ముందస్తు సర్వేలు వెల్లడించాయి.''నాకు తెలుసు, నెతన్యాహూ ఓడిపోయారు, 120 వరకూ అంకెలు లెక్కపెట్టడం నాకు తెలుసు, ఈ విధంగా ప్రజాస్వామ్యం ఇజ్రాయెల్‌లో బతికిబట్టకడుతుంది'' అని గోలన్ ఎక్స్ వేదికగా స్పందించారు.''వాస్తవాలు మనకు గట్టి గుణపాఠం నేర్పాలి, మనం భయపడటం మానేయాలి, ఐక్యం కావాలి, జాత్యాహంకారాన్ని అణచివేయాలి, లేకపోతే భవిష్యత్తే లేదు, యూదుఓట్లు, అరబ్ ఓట్ల మధ్య నెతన్యాహూ చేస్తున్న జాత్యాహంకార విభజనను మనం అడ్డుకోవాలి'' అని ఆయన ఎక్స్‌లో రాశారు. నెతన్యాహూను గద్దె దించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, తమతో జత కట్టాలని కోరారు. కాగా సెంట్రల్ ఎలక్షన్ కమిటీ పాక్షిక సమాచారం మేరకు, భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం నాటికి 85 శాతం బ్యాలెట్ బాక్సుల కౌంటింగ్ పూర్తయ్యేనాటికి అధికార, ప్రతిపక్ష కూటమిలో ఎవ్వరికీ మెజారిటీ రాలేదని బిబిసి తెలియజేసింది.
మంగళవారం 77.7 శాతం పోలింగ్ జరిగింది. 2022 పార్లమెంటు ఎన్నికల్లో 70.6 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. పలు సర్వేల్లో నెతన్యాహూ కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. లికుడ్ పార్టీ సారథ్యంలోని కూటమికి 54 సీట్లు, ఐసెన్‌కోట్ కూటమికి 47 స్థానాలు, అరబ్ పార్టీలకు 19స్థానాలు వస్తాయని సర్వేలు చెబుతున్నాయి. ఈవిధంగా చూస్తే, నెతన్యాహూకున్న ఆధిక్యత ప్రభుత్వ ఏర్పాటుకు సరిపోదు. ఇంకా ఏడుగురు సభ్యుల మద్దతు కావాలి. అరబ్ పార్టీల కూటమి సహాయం లేకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు కనిపించడంలేదు. ఎటు చూసినా అరబ్‌పార్టీలు గుండుగుత్తగా అత్యంత కీలకమైనస్థానంలో ''కింగ్ మేకర్''గా మారతాయని ముందస్తు నివేదికలు వెల్లడించాయి. దీనిపై జాయింట్ లిస్ట్ చైర్మన్ యూసఫ్ జబరీన్ స్పందిస్తూ, బెంజిమన్ నెతన్యాహూ ప్రభుత్వానికి అధికారం దక్కనీయకూడదనుకునే పార్టీలన్నీ ఇప్పుడు తమతో చర్చలు జరపాల్సిందేనని అన్నారు. ''నెతన్యాహూ రక్తపాత ప్రభుత్వానికి బలమైన, వాస్తవికమైన ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని అనుకుంటే, ప్రజలు ఆకాంక్షిస్తున్న మార్పుకు మార్గం సుగమం చేయాలనుకుంటే ఎవరైనా వచ్చి మాతో మాట్లాడాలి'' అన్నారు.
నెతన్యాహూ ఆధిక్యంలో ఉన్నారన్న ఈ సర్వే నివేదికలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, నెతన్యాహూను ముందుగానే ''తనవాడు''గా ప్రకటించడంవల్ల ఆయనకు ఎంతో ప్రయోజనం చేకూరిందని అన్నారు. నవంబరు నాలుగో తేదీన అంటే వచ్చే బుధవారంనాడు ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఇజ్రాయెల్ పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉండగా, 61 స్థానాలు సంపాదించుకున్న కూటమి లేదా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అధికారాన్ని సంపాదించుకుంటుంది. ఐతే ఛానల్ 12 ముందస్తు సర్వే ప్రకారం, నెతన్యాహూకు 52 స్థానాలు, ఛేంజ్ బ్లాక్‌కు 51 స్థానాలు, అరబ్ పార్టీలకు 18స్థానాలు వచ్చాయి. ఛానల్ 13 సర్వే ప్రకారం, నెతన్యాహూకు 51 స్థానాలు, ఛేంజ్ బ్లాక్‌కు 51 స్థానాలు, అరబ్ పార్టీలకు 18 స్థానాలు వచ్చాయి. కన్–11 సర్వే ప్రకారం నెతన్యాహూకు 51, ఛేంజ్ బ్లాక్‌కు 51స్థానాలు, అరబ్‌పార్టీలకు 18స్థానాలు వచ్చాయి. ఛానల్ 14 సర్వే ప్రకారం నెతన్యాహూకు 60స్థానాలు, ఛేంజ్ బ్లాక్‌కు 43స్థానాలు, అరబ్ పార్టీలకు 17స్థానాలు, ఛానల్–16 సర్వే ప్రకారం, నెతన్యాహూకు 53స్థానాలు, ఛేంజ్ బ్లాక్‌కు 51స్థానాలు, అరబ్‌పార్టీలకు 16స్థానాలు, ఐ–24 సర్వే ప్రకారం నెతన్యాహూకు 55 స్థానాలు, ఛేంజ్ బ్లాక్‌కు 49స్థానాలు, అరబ్‌పార్టీలకు 16స్థానాలు వచ్చాయి.

బహిరంగ అభిశంసన
(మొదటి పేజీ తరువాయి)

ఆ ప్రదేశానికి మార్చాలని నిర్ణయించుకుందని ఆయన అన్నారు. 'ఓట్ చోరీ' ఆరోపణపై నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరగబోయే ర్యాలీకి నాందిగా అక్టోబర్ 30న జ్ఞానేశ్ కుమార్‌పై బహిరంగ అభిశంసన కార్యక్రమాన్ని ఇండియా కూటమనికి చెందిన 21 పార్టీలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నాయని ఆయన తెలిపారు. అయితే, దానినిని కూడా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ, మోదీ–షా ద్వయం చేతిలో కీలుబొమ్మగా మారిన జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తాము విశ్రమించబోమని స్పష్టంగా చెబుతున్నామని, ఒకవేళ మమ్మల్ని తమను అడ్డుకుంటే, అమిత్ షా ఇంటికి, ప్రధాని మోదీ ఇంటికి వెళ్లి అక్కడ భారీ ధర్నా చేస్తామన్నారు. మా లక్ష్యం నెరవేరే వరకు, చివరి వరకు పోరాడుతామని వేణుగోపాల్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు.

పారిపోయిన ఫ్లావియో

వాషింగ్టన్: బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో పరాజయం పాలైన ఫ్లావియో బోల్సొనారో ఆకస్మికంగా దేశం వదిలి పారిపోయారని కథనాలు వెలువడ్డాయి. ఆయన అర్జెంటీనాలో ఉన్నారని తాను విన్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఈక్వెడార్ దేశానికి పారిపోయారని తొలుత వార్తలు వచ్చాయి.చివరకు ఆయన కుటుంబ సమేతంగా మియామీ చేరుకున్నారు.దేశం నుండి పారిపోయారని వచ్చిన భిన్న కథనాలపై ఆయన స్పందించలేదు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫ్లావియోను పాస్‌పోర్టులు స్వాధీనం చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత కొద్ది గంటలకే ఈ పరిణామాలు సంభవించాయి. గడచిన ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు, వామపక్షనేత, కార్మిక నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డాసిల్వా చేతిల్లో పరాజయం పాలైన తర్వాత లులా విజయాన్ని గుర్తించేందుకు తొలుత ఫ్లావియో బోల్సొనారో తిరస్కరించారు. మళ్ళీ తనుకు తానుగా ప్రతిపక్ష నాయకుడుగా ప్రకటించుకున్నారు. ఈ ఎన్నికను గుర్తించినప్పటికీ, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి, తాను న్యాయపోరాటం చేస్తానని ప్రకటించారు. ఫ్లావియోపై అవినీతి ఆరోపణలు పుష్కలంగా ఉన్నాయి. ఆయనపై విచారణ జరుగుతూ ఉండటంతో పాస్‌పోర్టులు స్వాధీనం చేయాలని పోలీసులు ఆయన ఓడిపోయిన వెంటనే డిమాండ్ చేశారు. కానీ ఆయన తన పాస్‌పోర్టులను స్వాధీనం చేయలేదు.బోల్సొనారో కోరితే ఆయన కుటుంబానికి వీసాలు జారీ చేసి ఆశ్రయం ఇస్తామని అమెరికా విదేశాంగమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది. ట్రంప్ అనుమతితోనే ఆయన మియామీ చేరుకున్నారు.అవినీతికి పాల్పడ్డారని, లెక్కల్లో చూపించని ధనాన్ని అక్రమమార్గాల్లో తరలించారని రెండుకేసులు ఫ్లావియో బోల్సొనారో స్వదేశంలో ఎదుర్కొంటున్నారు. ఈ కేసులపై విచారణ ప్రారంభమయ్యేలోపు, పోలీసులు ఆయన పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకునేలోపే ఫ్లావియో ఆచూకీ లేదు.ఆయన ఈక్వెడార్ విమానం ఎక్కారని మొదట అర్జెంటీనా అధికారులు గట్టిగా ఉద్ఘాటించి చెప్పారు. కానీ ఆయన అమెరికా చేరుకున్నారు.

సూడాన్ మార్కెట్‌పై డ్రోన్ దాడి
100 మంది మృతి

షెండి: అరబ్ ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈశాన్య ఆఫ్రికాదేశం సూడాన్‌లో సైన్యం జరిపిన డ్రోన్ దాడిలో 100 మంది పైగా మరణించారు. దక్షిణ డార్ఫూర్ రాష్ట్ర రాజధాని నగరం న్యాలాలో చాలా రద్దీగా ఉండే మార్కెట్‌పై ఈ డ్రోన్ దాడి జరిగిందని ఆ దేశంలో హింసాత్మక చర్యలను పర్యవేక్షిస్తున్న ''ఎమర్జెన్సీ లాయర్స్'' అనే మానవహక్కుల సంఘం ప్రకటించింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ దాడిలో మరో 113 మంది గాయపడ్డారని కూడా ప్రకటన పేర్కొంది. మరణించిన వారిలో, గాయపడినవారిలో ఎక్కువమంది మహిళలే ఉన్నారని, ఈ దాడికి సైన్యమే కారణమని ఎమర్జెన్సీ లాయర్స్ తీవ్రంగా విమర్శించింది.ఈ మారణకాండ ద్వారా ఒక సాధారణ పౌర మార్కెట్ ప్రదేశాన్ని సామూహిక హింసాత్మక ప్రదేశంగా మార్చేసిందని, ప్రస్తుతం దేశంఓ కొనసాగుతున్న యుద్ధంవల్ల పౌరుల ప్రాణాలకు ఈ దా దులు మరింత ముప్పు పెం చుతాయని, వారి బాధలు అనూహ్యంగా పెరిగిపోతాయని,ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని మానవహక్కుల సంఘం డిమాండ్ చేసింది. 2023 ఏప్రిల్ నుండి సూడాన్‌లో ప్రభుత్వ దళాలకు, ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్‌కు మధ్య పోరాటం జరుగుతోంది. ఇటీవలికాలంలో ఈ రెండు వర్గాలమధ్య డ్రోన్ దాడులు విపరీతంగా పెరిగాయి. దీంతో వందలమంది సాధారణ పౌరుల మరణాల సంఖ్య పెరిగింది. మంగళవారంనాడు దేశ రాజధాని ఖార్టూమ్‌లో జరిగిన దాడులతో 12 గంటలసేపు ప్రజలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజధాని ఖార్టూమ్‌ను గత ఏడాది ప్రభుత్వదళాలు స్వాధీనం చేసుకున్న తర్వాత నగరంలో దాడులు తగ్గాయి.

నెతన్యాహూకు దక్కని మెజారిటీ
హంగ్ పార్లమెంటులో అరబ్‌పార్టీలే కీలకం
85 శాతం కౌంటింగ్ పూర్తి

టెల్అవీవ్: ఇజ్రాయెల్ పార్లమెంటుకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపు బుధవారం సాయంత్రం 85 శాతం పూర్తయ్యేనాటికి ప్రధానమంత్రి నెతన్యాహూ నాయకత్వంలోని కూటమికి మెజారిటీ దక్కలేదు. ఈ కూటమికి 53 స్థానాలు లభించాయి. ప్రధాన ప్రత్యర్థి గాడి ఐసెన్‌కోట్ నాయకత్వానగల కూటమికి 48 స్థానాలు లభించాయి.అరబ్ పార్టీలకు 19 స్థానాలు లభించాయి. ఐతే ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి ఎవ్వరికీ పూర్తి మెజారిటీ లభించలేదు.ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే అనివార్యంగా అరబ్ పార్టీలతో(జాయింట్ లిస్ట్) జత కట్టాల్సిందేనని ఆ కూటమి చైర్మన్ యూసఫ్ జబరీన్ వ్యాఖ్యానించారు. నెతన్యాహూ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.85 శాతం కౌంటింగ్ పూర్తయిన తర్వాత కూడా వరికీ సరైన మెజార్టీ రాకపోవడంతో జాయింట్ లిస్ట్ కింగ్ మేకర్‌గా అవతరించింది.120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంటులో 61 స్థానాల మెజార్టీ పొందిన కూటమి లేదా పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు అర్హత పొందుతుంది.ఐతే ఈ ఎన్నికల్లో సైన్యం,భద్రతాదళాలు,పోలీస్,దౌత్యవేత్తలతోపాటు 4.80లక్షల ఓట్లను ఇంకా లెక్కించవలసి ఉంది.నిర్ణీత ప్రకారం నవంబరు నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడతాయని ఎన్నిక సంఘం తొలుత ప్రకటించింది.కాగా నెతన్యాహూకు చెందిన లికుడ్ పార్టీ ఒక ప్రకటన చేస్తూ అరబ్ పార్టీలు ఈ ఎన్నికలను దొంగిలించి తమ అధీనంలోకి తీసుకున్నాయని విమర్శించింది.

సాధించేందుకు కృషిచేయాలి
(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడితే దాని ప్రభావం పక్కనున్న మండలాలపైనా పడే అవకాశముందని కూనంనేని అన్నారు. అందువల్ల వర్షపాతం ఆధారంగా మాత్రమే కరువును నిర్ణయించకుండా, భూగర్భ జలాలు, పర్యావరణ ప్రభావం, వ్యవసాయ పరిస్థితులు, తాగునీటి లభ్యత వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కరువు ప్రభావిత ప్రాంతాలకు తగిన గుర్తింపు కల్పించి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపడంతోపాటు, అవసరమైన సహాయం కోసం ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

తాగునీరు, సాగునీటి సమస్యలకు పరిష్కారం : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తీవ్ర సమస్యగా మారుతోందని, నీటి కోసం కొత్త బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అవసరమైన చోట నీటి వనరులను అభివృద్ధి చేస్తూనే, బోర్ల తవ్వకాలను నియంత్రించడం, భూగర్భ జలాల వినియోగాన్ని క్రమబద్ధీకరించడం, తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా మధ్య సమన్వయం అవసరమని అన్నారు. నీటి కొరతతో వ్యవసాయంతోపాటు పట్టణాల్లో నిర్మాణ రంగం కూడా దెబ్బతింటుందని, నిర్మాణ పనులు నిలిచిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కరువు ప్రభావాన్ని గ్రామీణ ప్రాంతాలకే పరిమితం చేయకుండా పట్టణాల్లోనూ ఉపాధి, జీవనోపాధిపై పడే ప్రభావాన్ని అంచనా వేయాలని కోరారు.

రైతులకు బీమా, రుణాలపై వెసులుబాటు : కరువు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని కూనంనేని కోరారు. రైతులకు పంటల బీమా సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పంట నష్టపరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని అన్నారు. చిన్న, సన్నకారు రైతులు, చిన్న వ్యాపారులు తీసుకున్న రుణాల చెల్లింపులపై కనీసం ఏడాది పాటు మారటోరియం విధించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకు చెల్లించాల్సిన ఈఎంఐల విషయంలోనూ కరువు ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని వెసులుబాటు కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా అదనపు పనిదినాలు కల్పించాలని అన్నారు. పశువులకు మేత కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతోపాటు, అవసరమైన ప్రాంతాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కరువు సమయంలో రైతులకు అందించే సహాయ ప్యాకేజీలో గతంలో ఉన్న తొమ్మిది రకాల సహాయ అంశాలను పునఃపరిశీలించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విస్తరించాలని కోరారు.

పట్టణాలకూ ఉపాధి హామీ పథకం : కరువు ప్రభావం పట్టణాల్లోనూ ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నందున, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ తరహా పథకాలను పట్టణాలు, నగరాలకూ విస్తరించాలని డిమాండ్ చేయాలని కూనంనేని సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు ఆదాయ భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు.కరువు పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించేందుకు రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను అందించాలని కోరారు. పేదలకు ప్రతి నెలా అదనంగా బియ్యం అందించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. వంట నూనె వంటి నిత్యావసరాల ధరలు పెరగకుండా చూడటంతోపాటు, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకులు అర్హులైన పేదలకు చేరేలా పర్యవేక్షణ పెంచాలని కోరారు.

విద్యుత్ రాయితీలపై పునఃసమీక్ష

ప్రస్తుతం అమలవుతున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో పరిమితిని స్వల్పంగా దాటిన కుటుంబాలు ఎదుర్కొనే సమస్యలను పరిశీలించాలని కూనంనేని సూచించారు. కరువు సమయంలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశమున్నందున, పేద కుటుంబాలపై అదనపు బిల్లుల భారం పడకుండా తగిన వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. అధికంగా నీరు, విద్యుత్ వినియోగించే పరిశ్రమలు, డేటా సెంటర్లు తదితర సంస్థలకు అందిస్తున్న రాయితీలను కూడా సమీక్షించాలని అన్నారు. నీటి కొరత తీవ్రంగా ఉన్న సమయంలో అందుబాటులో ఉన్న వనరులను ప్రజల తాగునీటి అవసరాలు, వ్యవసాయం, ఇతర అత్యవసర అవసరాలకు ప్రాధాన్యమిస్తూ వినియోగించేలా విధానం రూపొందించాలని సూచించారు.

నీటి అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

తెలంగాణకు సంబంధించిన నీటి లభ్యత, వినియోగం, ఇతర రాష్ట్రాలతో నీటి పంపిణీకి సంబంధించిన అంశాలపై వాస్తవ గణాంకాలతో సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కూనంనేని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య నీటి వినియోగానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను స్పష్టంగా ప్రజల ముందుంచాలని అన్నారు. రాజకీయ ఆరోపణలకు తావులేకుండా అధికారిక గణాంకాలు, గణాంక ఆధారాలు, వాస్తవ వివరాలతో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని సూచించారు. కరువు సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని కూనంనేని పిలుపునిచ్చారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించి, రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సాయం, రైతులకు ఉపశమన చర్యలు, ఉపాధి హామీ పథకం విస్తరణ వంటి అంశాలపై హామీలు సాధించాలని కోరారు.

మండల కమిటీలు ఏర్పాటు
(మొదటి పేజీ తరువాయి)

రైతులను గుర్తించి వ్యక్తిగత స్థాయిలోనూ పశుగ్రాసం సాగును ప్రోత్సహిస్తారు. పశువుల మేత కొరతను ముందుగానే అంచనా వేసి, అవసరమైన ప్రాంతాల్లో పశుగ్రాసం అందుబాటులో ఉండేలా కమిటీ ప్రణాళికలు రూపొందిస్తుంది. పశువులు, మేకలు, గొర్రెలకు తగినంత తాగునీరు అందించేందుకు అవసరమైన ప్రాంతాల్లో కొత్త పశువుల నీటి తొట్టెలను నిర్మించడంతో పాటు ఇప్పటికే ఉన్న తొట్టెలను పరిశీలించి మరమ్మతులు చేపడతారు.

గ్రామీణ తాగునీటిపై దృష్టి

తాగునీటి కొరత ఎదురయ్యే గ్రామాలను గుర్తించి, గ్రామీణ నీటి సరఫరా శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన మరమ్మతులు, ఇతర నివారణ చర్యలు చేపడతారు. గ్రామీణ తాగునీటి మౌలిక సదుపాయాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షిస్తారు. నీటి భద్రతలో భాగంగా చిన్న నీటిపారుదల చెరువులు, ఫీడర్ ఛానళ్లు, ఫీల్ ఛానళ్ల అభివృద్ధి, మరమ్మతులతో పాటు వ్యవసాయ కుంటలు, మ్యాజిక్ సోక్ పిట్స్, డ్రెయిన్ ఎండ్ సోక్ పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, చెక్‌డ్యాములు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పునర్భరణ ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటారు.

వారానికొకసారి సమీక్ష..
జిల్లా కలెక్టర్లకు నివేదికలు

మండల సమన్వయ కమిటీలు కనీసం వారానికి ఒకసారి సమావేశమై పనుల పురోగతిని సమీక్షించాలి. గుర్తించిన పనులు, మంజూరైన పనులు, ప్రారంభించిన పనులు, పూర్తయిన పనులు, కల్పించిన ఉపాధి, నీటి సంరక్షణ పనులు, జలసిరి కార్యక్రమం తదితర అంశాలపై పురోగతిని పరిశీలించాలి. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. ప్రతి కమిటీ వారపు పురోగతి నివేదికను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలి. సిద్ధం చేసిన వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను సంబంధిత గ్రామపంచాయతీ జీపీ సాప్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. అన్ని మండలాల్లో కమిటీల ఏర్పాటు, ఎల్ నినో నివారణ చర్యల సమర్థవంతమైన అమలు, కమిటీల పనితీరుపై క్రమం తప్పకుండా సమీక్షించే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది.

దరఖాస్తు చేసుకోవాలి
(మొదటి పేజీ తరువాయి)

చేయటమంటే తాము ఇంతకుముందు ఓటరుగా లేమని, కొత్తగా తొలిసారి దరఖాస్తు చేస్తున్నామని అంగీకరించటమే. మారిన అడ్రసుతో ఫారం 8 దాఖలు చేస్తే ఓటరు జాబితాలో పాత ఓటరు స్థానం లభిస్తుంది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి.మోహన బుధవారం విచారణలో పై ప్రశ్న లేవనెత్తారు.

పిటిషనర్‌ల తరఫున హాజరైన అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ తమ వాదనలో – ఢిల్లీలోని 1 కోటి 45లక్షల ఓటర్లలో 47 లక్షలమంది తమ ఎన్యూమరేషన్ ఫాంలు తిరిగి సమర్పించలేదని చెప్పారు. వారిలో 43 లక్షలమందిని శాశ్వతంగా నివాసం మారినట్లు లేదా ప్రస్తుత చిరునామాలో లేని కేటగిరీలో చేర్చారు; 31.59 లక్షలమంది శాశ్వతంగా నివాసం మారారని, 11 లక్షలమంది జాడతెలియలేదని పేర్కొన్నారు. చాలామంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫాంలలో పాత అడ్రసు ఉన్నందున వాటిని అందుకోలేదని భూషణ్ చెప్పారు. తమ కొత్త అడ్రసులతో ఫారం 8కి బదులు ఫారం 6 దాఖలు చేయాలని వారికి చెబుతున్నందున వారు ఆ క్రమం పూర్తిచేయలేదన్నారు. ఇప్పుడైనా ఎన్యూమరేషన్ ఫాం సమర్పించేందుకు, ఫారం 8 ద్వారా కొత్త అడ్రసు ఇచ్చేందుకు వారిని ఇసి అనుమతించాలని కోరాడు. ''ఓటర్లు తమ వద్దకు రావాలని ఇసి చెప్పే బదులు, ఇసి అధికారులే వారి వద్దకు ఎందుకు వెళ్లకూడదని సిజెఐ ప్రశ్నించారు. వారి పాత అడ్రసుకు పంపిన ఫాం తిరిగి ఇవ్వనంత మాత్రాన వారు శాశ్వతంగా ఇల్లు మారారని నిర్ధారించలేమన్నారు.

తాజా ఓటరు జాబితాలో పేరున్నవారు కొత్త ఓటరుగా ఫారం 6 ఎందుకు దాఖలు చేయాలని జస్టిస్ బాగ్చీ ప్రశ్నించారు. ఢిల్లీలో తొలిసారి ఓటరుగా నమోదు కోరుతున్నవారికే ఫారం 6 వర్తిస్తుందన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు కోల్పోయిన వారిని ఇసిఐ ఎలా అప్రమత్తం చేయాలి అని బెంచి ప్రశ్నించగా, తొలగించిన వారి పేర్లను వారి పోలింగ్ బూత్‌లవద్ద ప్రదర్శించాలని సూచించారు. ఇంతకుముందు మీరు కలుసుకోలేకపోయిన వారి పేర్లను వారి పూర్వపు ఎలక్టోరల్ వివరాలతో ప్రచురించి, వారిని తమ సమీప బిఎల్ఓ దగ్గరకు వెళ్లమని కోరాలని జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. ఇసి అడ్వొకేట్ డిఎస్ నాయుడు ఇసి నిర్వహించిన చైతన్య కార్యక్రమాల గూర్చి చెప్పగా, కొందరు తాత్కాలికంగా తమ అడ్రసులో ఉండకపోవచ్చు, మరికొందరికి అసలు ఫారమే అందకపోయి ఉండవచ్చునని జస్టిస్ బాగ్చీ అన్నారు.

లాజికల్ వ్యత్యాసాలు : తార్కిక అపసవ్యతలు లేదా వ్యత్యాసాలు (ఎల్‌డి) కేటగిరి చట్టబద్ధతపై కోర్టు రూలింగ్ ఇవ్వలేదని జస్టిస్ బాగ్చీ వివరణ ఇచ్చారు. పశ్చిమ బెంగాల్ ప్రొసీడింగ్స్‌లో తాత్కాలిక ఏర్పాటుగా మాత్రమే దానిని ఉపయోగించేందుకు అనుమతించామన్నారు. బిహార్ సర్‌పై తీర్పు ఈ సమస్యను అసలు పరిశీలించలేదన్నారు. 'ఎన్నికల కమిషన్ తమ వివరాలు గతంలోని సర్‌తో సరిపోలలేదని 33 లక్షల మంది ఓటర్లను గుర్తించింది. వాటిలో 19.34 లక్షలమంది 'ఎల్‌డి కేటగిరి' అని ప్రశాంత్ భూషణ్ కోర్టుకు చెప్పారు. ఈ వ్యత్యాసాలు గుర్తించే ప్రమాణాలను ఇసి స్పష్టం చేయలేదు. ఎల్‌డి కింద నోటీసులు జారీ చేసేందుకు అదనపు వడపోతలు అవసరమా అని చివరి రోజున కోర్టు అడిగింది. అయినా ఇసి యాంత్రికంగా నోటీసులు జారీ చేసిందని భూషణ్ చెప్పారు.

కోర్టు సూచనలను ఇసి చర్చిస్తుందని, తొలగదించబడిన ఓటర్లకు ప్రత్యామ్నాయ ఫారం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తుందని ఇసిఐ తరఫు అడ్వొకేట్ చెప్పారు. ఈ ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో లేనందున ఫారం 6 ఉపయోగిస్తున్నామని ఆయన చెప్పగా, సరికొత్త ఓటర్లకు, ఇంతకుముందు ఓటరుగా ఉండి ఎన్యూమరేషన్ పూర్తిచేయని ఓటర్లకు మధ్య తేడా స్పష్టంగా ఉండాలని ధర్మాసనం నొక్కి చెప్పింది.

సమష్టి కార్యాచరణ
(మొదటి పేజీ తరువాయి)

నాయకులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎం.అంజన్‌కుమార్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు బి.వినోద్‌కుమార్, ఎల్.రమణ, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, బిజెపి శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య పాల్గొన్నారు. ఎంఐఎంఅధ్యక్షులు అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, తెలంగాణ జన సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్ సమావేశంలో పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ప్రొఫెసర్ సింహాద్రి, వెంకటేశ్వర్లు, ఆర్‌జెడి నాయకురాలు శోభ యాదవ్, బిఎస్‌పి రాష్ట్ర నాయకుడు శ్రీరామ్ కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు హేమ సుదర్శన్, టిడిపి నాయకురాలు కాట్రగడ్డ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లపై ప్రజల్లో అవగాహన పెంపొందిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించి రాష్ట్రాన్ని కరువు ముప్పు నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమావేశం నిర్వహించామని తెలిపారు. నేతలు ప్రస్తావించిన అంశాలను నమోదు చేసుకున్నామని, సాధ్యమైన మేరకు వాటిని ప్రభుత్వ కార్యాచరణలో భాగంగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంపై గతంలోనూ శాసనసభలో చర్చించామని, వివిధ సమావేశాలు, సదస్సులు నిర్వహించడంతోపాటు శాస్త్రవేత్తలు, నిపుణులతో సంప్రదింపులు జరిపామని వివరించారు. ఈ అంశంపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రానున్న నెలల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, అవసరమైన సన్నద్ధతతో ఉన్నామని పేర్కొన్నారు.

తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తామని, పశువులకు తాగునీరు, మేత అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సిఎం హామీ ఇచ్చారు. వర్షపాతం లోటు ఒక్క తెలంగాణకే పరిమితమైతే పొరుగు రాష్ట్రాల్లో కురిసే వర్షాలతో ప్రాజెక్టులకు నీరు చేరే అవకాశం ఉండేదని, అయితే ప్రస్తుతం రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలు, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ వర్షపాతం లోటు ఏర్పడటం ఆందోళన కలిగించే అంశమన్నారు. ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటి లభ్యత తగ్గిన పరిస్థితుల్లో జలవనరుల నిర్వహణ మరింత కీలకంగా మారిందని వివరించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేస్తూ, వాటి ప్రభావాన్ని తగ్గించేందుకు శాఖలవారీగా సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి అవసరాలను తీర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అఖిలపక్ష నేతలు చేసిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను రూపొందించామని డిప్యూటీ సిఎం వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, పశువులకు అవసరమైన నీటి వసతులు కల్పించేందుకు అవసరమైన బడ్జెట్, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సమావేశంలో వచ్చిన సూచనలను పరిశీలించి, అమలుకు సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కేంద్రం నుంచి సహాయం అందేలా ప్రతిపాదనలు సమర్పిస్తాం

కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో అన్ని చర్యలు చేపడుతూనే, కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా సమర్థవంతంగా వినియోగించుకుంటుందని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. ఇప్పటికే కేంద్రానికి నివేదిక పంపించామని, అవసరమైన సహాయం అందేలా ప్రతిపాదనలు సమర్పిస్తామని ఆయన చెప్పారు. కేంద్రం నుంచి అవసరమైన సహాయం పొందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అవసరమైతే అఖిలపక్ష ప్రతినిధులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని కోరుతామని చెప్పారు. గతంలో కరోనా వంటి సంక్షోభాలను ఎదుర్కొన్న సమయంలో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేశాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితుల్లోనూ రాజకీయాలకు అతీతంగా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రతీకా రావల్, షెఫాలీ వర్మ విధ్వంసం..

జింబాబ్వేతో మూడు వన్డేల సిరీస్ భారత్‌దే

సొంతగడ్డపై జింబాబ్వేతో జరిగిన మూడో వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 3–0తో క్లీన్ స్వీప్ చేసింది. వడోదర వేదికగా బుధవారం జరిగిన ఆఖరి వన్డేలో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఈ పర్యటనలో జింబాబ్వే ఒక్క విజయాన్ని నమోదు చేయలేకపోయింది. మూడు టి–20ల సిరీస్‌లో కూడా జింబాబ్వే క్లీన్ స్వీప్ అయిన సంగతి తెలిసిందే. ఆఖరి వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 39.5 ఓవర్లలో 131 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ మోడెస్టర్ ముపాచిక్వా(48 బంతుల్లో 7 ఫోర్లతో 37), కెప్టెన్ జోసెఫిన్ న్కోమో (67 బంతుల్లో 4 ఫోర్లతో 35) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ(5/39) ఐదు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించగా.. క్రాంతి గౌడ్, సయాలీ సత్ఘరే రెండేసి వికెట్లు పడగొట్టారు.

అనంతరం భారత్ 17 ఓవర్లలో 2 వికెట్లకు 133 పరుగులు చేసి గెలుపొందింది. ప్రతీకా రావల్(56 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59 నాటౌట్), షెఫాలీ వర్మ(26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లతో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో భారత విజయంలో కీలక పాత్ర పోషించారు. జింబాబ్వే



బౌలర్లలో నామ్వెలో సిబండా, లారిన్ ఫిరి తలో వికెట్ తీసారు.

సిక్సర్‌తో విజయం.. 132 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తమ ఓపెనర్‌గా యస్తికా భాటియాను పంపించగా.. ఆమె డకౌట్‌గా వెనుదిరిగింది. ఫస్ట్ డౌన్‌లో హర్లిన్ డియోల్‌ను బ్యాటింగ్‌కు పంపించగా.. ప్రతీకా రావల్ ఆచితూచి ఆడింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 58 పరుగులు జోడించారు. ఆచితూచి ఆడిన హర్లీన్ డియోల్(19) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగింది. క్రీజులోకి వచ్చిన షెఫాలీ వర్మ జింబాబ్వే బౌలర్లపై విరుచుకుపడింది. మరోవైపు ప్రతీకా రావల్ 47 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుంది. ప్రతీకా రావల్ నిదానంగా ఆడినా.. షెఫాలీ వర్మ టి–20 తరహా బ్యాటింగ్‌తో చెలరేగింది. విన్నింగ్ షాట్‌గా భారీ సిక్సర్ బాది 26 బంతుల్లో హాఫ్ సెంచరీతో పాటు టీమిండియా విజయలాంఛనాన్ని పూర్తి చేసింది.

న్యూజిలాండ్‌పై ఊచకోత.. మళ్లీ అభిషేక్‌దే అగ్రస్థానం

న్యూజిలాండ్‌పై విధ్వంసకర శతకంతో చెలరేగిన టీమిండియా ఓపెనర్ అభిషేక్ శర్మ ఐసిసి ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని అందుకున్నాడు. 897 రేటింగ్ పాయింట్స్‌తో ఇషాన్ కిషన్ (866)ను వెనక్కి నెట్టి టాప్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నాడు. గాయంతో గత రెండు టి–20 మ్యాచ్‌లకు ఇషాన్ కిషన్ దూరమైన విషయం తెలిసిందే. దాంతో అతను అగ్రస్థానాన్ని కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. పాకిస్థాన్ బ్యాటర్ సాహిబ్జాద ఫర్హాన్(883) రెండో ర్యాంక్‌ను అందుకున్నాడు. న్యూజిలాండ్ పర్యటనలో పేలవ ప్రదర్శన కనబర్చిన శ్రేయస్ అయ్యర్ ఐదు స్థానాలు దిగజారి 9వ స్థానంలో నిలిచాడు. మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసిన తిలక్ వర్మ 724 రేటింగ్ పాయింట్స్‌తో పదో ర్యాంకును అందుకున్నాడు. న్యూజిలాండ్‌తో తొలి టి–20లో హాఫ్ సెంచరీతో సత్తా చాటిన సంజూ శాంసన్ ఆరు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంక్ అందుకున్నాడు. అభిషేక్ శర్మతో కలిసి దూకుడుగా ఆడిన వైభవ్ సూర్యవంశీ 9 స్థానాలు ఎగబాకి 45వ ర్యాంక్ సాధించాడు.




టాప్–10లో ఒక్కరు లేరు.. భారత్ చేతిలో చిత్తుగా ఓడినా న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ మాత్రం బౌలింగ్ విభాగంలో మెరుగైన ర్యాంక్ అందుకున్నాడు. ఈ సిరీస్‌లో కట్టడిగా బౌలింగ్ చేయడంతో పాటు రెండో టి–20లో నాలుగు వికెట్లు తీయడంతో సాంట్నర్ 665 రేటింగ్ పాయింట్స్‌తో ఏడో స్థానంలో నిలిచాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో రషీద్ ఖాన్(733) అగ్ర స్థానంలో ఉండగా.. భారత్ నుంచి ఒక్కరు కూడా టాప్10లో లేరు. అక్షర్ పటేల్ 11వ స్థానంలో కొనసాగుతుండగా.. అర్షదీప్ సింగ్ 6 స్థానాలు ఎగబాకి 15వ ర్యాంకులో నిలిచాడు.

టెస్ట్‌ల్లో దుమ్మురేపిన మార్కో జాన్సెన్.. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో సౌతాఫ్రికా ప్లేయర్ మార్కో జాన్సెన్ దుమ్మురేపాడు. బౌలింగ్‌తో పాటు ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానాన్ని అందుకున్నాడు. బౌలింగ్ విభాగంలో ఐదు స్థానాలు ఎగబాకిన అతను 876 రేటింగ్ పాయింట్స్ టాప్ ర్యాంక్ అందుకున్నాడు. భారత పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 853 రేటింగ్ పాయింట్స్‌తో ఒక స్థానం దిగజారి ఐదో ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో రవీంద్ర జడేజాను వెనక్కి నెట్టిన మార్కో జాన్సెన్ అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. భారత్ టెస్ట్ క్రికెట్ ఆడి చాలా రోజులు కావడంతో ర్యాంకులపై ప్రభావం చూపింది. బ్యాటింగ్ విభాగంలో సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా నాలుగు స్థానాలు ఎగబాకి రెండో స్థానాన్ని అందుకున్నాడు. ఆసీస్‌పై అతను అద్భుత సెంచరీ చేసిన సంగతి తెలిసిందే. హ్యారీ బ్రూక్ అగ్రస్థానంలో కొసాగుతున్నాడు. భారత్ నుంచి రిషభ్ పంత్ ఏడో స్థానంలో, శుభ్‌మన్ గిల్ తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నారు.

ప్రాచీన భారతదేశ చరిత్రకు ఆధారాలు







ప్రాచీన భారతదేశ చరిత్రను పునర్నిర్మించడానికి సాహిత్య, పురావస్తు, విదేశీ యాత్రికుల వృత్తాంతాలు ప్రధాన ఆధారాలుగా ఉపయోగపడతాయి. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం, మహాభారతం, బౌద్ధ త్రిపిటకాలు, జైన ఆగమాలు ఆనాటి మత, సామాజిక, తాత్విక పరిస్థితులపై సమాచారాన్ని అందిస్తాయి. అయితే ఈ గ్రంథాల్లోని ప్రతి అంశాన్ని చారిత్రక వాస్తవంగా పరిగణించకుండా, ఇతర ఆధారాలతో పోల్చి పరిశీలించాలి. పురావస్తు ఆధారాల్లో శాసనాలు, నాణేలు, మట్టి పాత్రలు, భవన అవశేషాలు, సమాధులు, పనిముట్లు ముఖ్యమైనవి. అశోకుని శాసనాలు మౌర్య పరిపాలన, ధమ్మ విధానం గురించి ప్రత్యక్ష సమాచారాన్ని అందిస్తాయి. నాణేల ద్వారా వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ, పాలకుల గురించి తెలుసుకోవచ్చు. మెగస్తనీస్, ఫాహియాన్, హ్యూయెన్‌త్సాంగ్ వంటి విదేశీ రచయితల వృత్తాంతాలు కూడా ఉపయోగకరమైనవి. అయితే వారి రచనల్లో వ్యక్తిగత అభిప్రాయాలు, పరిమిత అవగాహన ఉండవచ్చని గుర్తించాలి.

పూర్వ చారిత్రక యుగం

శిలాయుగ సంస్కృతులు

భారతదేశ పూర్వ చరిత్రను ప్రధానంగా పాతరాతి యుగం, మధ్యరాతి యుగం, కొత్తరాతి యుగం, లోహయుగాలుగా అధ్యయనం చేస్తారు. పాతరాతి యుగంలో మానవులు ప్రధానంగా వేట, ఆహార సేకరణపై ఆధారపడ్డారు. రాతి పనిముట్ల వినియోగం ఈ దశకు ముఖ్య లక్షణం. మధ్యరాతి యుగంలో చిన్న రాతి పనిముట్లు, అంటే మైక్రోలిథ్‌లను విస్తృతంగా ఉపయోగించారు. కొత్తరాతి యుగంలో వ్యవసాయం, పశుపోషణ, స్థిర నివాసాల అభివృద్ధి మానవ జీవితంలో కీలక మార్పులు తీసుకొచ్చాయి. మెహర్గఢ్ ప్రాంతంలో వ్యవసాయం, పశుపోషణకు సంబంధించిన తొలి ఆధారాలు లభించాయి. బుర్జహోమ్‌లో గుంతల నివాసాలు, జంతువులతో సంబంధమున్న సమాధులు కనిపించాయి. దక్షిణ భారతదేశంలో కొత్త రాతి సంస్కృతులకు చెందిన పశుపోషణ, స్థిర నివాసాల ఆధారాలను పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పరిణామాలు ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వైపు మానవ సమాజం మారిన విధానాన్ని వివరిస్తాయి. ఈ మార్పును కొన్నిసార్లు కొత్తరాతి విప్లవంగా పేర్కొంటారు.



సింధు లోయ నాగరికత

సింధు నాగరికతను హరప్పా నాగరికత అని కూడా పిలుస్తారు. దీని పరిణతి చెందిన దశ సాధారణంగా క్రీ.పూ. 2600–1900 మధ్యకాలానికి చెందుతుంది. హరప్పా, మొహెంజోదారో, ధోలావీరా, రాఖీగఢీ, లోథాల్ వంటి ప్రాంతాలు ఈ నాగరికతకు ముఖ్య కేంద్రాలు. దీని విస్తృతి ప్రస్తుత పాకిస్తాన్తో పాటు వాయవ్య, పశ్చిమ భారతదేశంలోని విస్తార ప్రాంతాలకు వ్యాపించింది. ఈ నాగరికతకు ప్రణాళికాబద్ధమైన పట్టణ నిర్మాణం, కాల్చిన ఇటుకల వినియోగం, మురుగునీటి పారుదల వ్యవస్థ, ప్రమాణీకరించిన తూనికలు, కొలతలు ప్రత్యేకలక్షణాలు. ప్రజలు వ్యవసాయం, పశుపోషణ, చేతివృత్తులు, అంతర్గత, విదేశీ వాణిజ్యంపై ఆధారపడ్డారు. మెసొపొటేమియాతో వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు ఆధారాలు సూచిస్తున్నాయి. హరప్పా లిపి ఇప్పటివరకు పూర్తిగా అర్థం కాలేదు. అందువల్ల పాలనా వ్యవస్థ, మత విశ్వాసాలు, సామాజిక నిర్మాణంపై అనేక అంశాలు ఇంకా చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. ఈ నాగరికత పతనానికి వాతావరణ మార్పులు, నదీ ప్రవాహాల మార్పులు, వాణిజ్య క్షీణత వంటి అనేక కారణాలను పరిశోధకులు ప్రతిపాదించారు.

పట్టణ ప్రణాళిక, ఆర్థిక వ్యవస్థ



హరప్పా నాగరికత పట్టణ ప్రణాళిక ప్రాచీన ప్రపంచంలో విశేషమైన స్థానం కలిగి ఉంది. అనేక నగరాల్లో వీధులు ఒకదానికొకటి దాదాపు లంబకోణాల్లో కలిసే విధంగా నిర్మితమయ్యాయి. నివాస ప్రాంతాల్లో బావులు, స్నానపు గదులు, మురుగు నీటి కాలువలు కనిపిస్తాయి. మొహెంజోదారోలోని మహాస్నానవాటిక ప్రసిద్ధ నిర్మాణం. ధోలావీరాలో నీటి నిల్వ, నిర్వహణకు సంబంధించిన సంక్లిష్ట నిర్మాణాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. ఆర్థిక వ్యవస్థ విషయానికి వస్తే గోధుమ, బార్లీ వంటి పంటల సాగు, పశుపోషణ, పూసల తయారీ, లోహపు పనులు, కుండల తయారీ ప్రధానమైనవి. పత్తి వినియోగానికి సంబంధించిన ప్రాచీన ఆధారాలు కూడా ఈ నాగరికతతో అనుసంధానిస్తారు. ముద్రలు, ప్రమాణీకరించిన తూనికలు వాణిజ్య కార్యకలాపాలకు ఉపయోగపడేవి. లోథాల్ వద్ద లభించిన నిర్మాణాన్ని చాలాకాలంగా నౌకాశ్రయంగా గుర్తించినప్పటికీ, దాని ఖచ్చితమైన స్వరూపంపై చర్చ కొనసాగుతోంది. హరప్పా సమాజంలో పెద్ద రాజభవనాలు లేదా స్పష్టమైన దేవాలయాల ఆధారాలు పరిమితంగా ఉండటం గమనార్హం. ఈ లక్షణాలు పట్టణ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం, వాణిజ్య సంబంధాలపై అవగాహన కల్పిస్తాయి.

‘సెంట్రలైజ్డ్ కిచెన్’ విధానాన్ని విరమించుకోవాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడిలో ఎఐటియుసి నేతల డిమాండ్

ప్రజాపక్షం/ములుగు : మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న ప్రభుత్వం.. మధ్యాహ్న భోజన పథకం మహిళా కార్మికులను రోడ్డున పడేసే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో మంత్రి వ్యక్తిగత సహాయకుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భగా జంపాల రవీందర్ మాట్లాడుతూ 24 ఏళ్లుగా వంట కార్మికులు సొంత డబ్బులతో నాణ్యమైన భోజనం తయారు చేస్తూ విద్యార్థులకు సేవలందిస్తున్నారని తెలిపారు. వేతనాలు పెంచకపోగా, బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 54,200 మంది కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల



హామీ మేరకు కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం చెల్లించాలని, వారిని తొలగించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని, వంట సరుకులు, గ్యాస్, కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 12నెలల వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అల్పాహార పథకాన్ని కూడా వంట కార్మికులతోనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు, ప్రధాన కార్యదర్శి బండి నర్సయ్య, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పోరెడ్డి ప్రమీల, ప్రధానకార్యదర్శి గడ్డం భారతితో పెద్ద సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

నిజామాబాద్ అర్బన్ : ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇంటి ముట్టడి నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమాండ్లు, ఫిరోజ్ అలీ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి, జిల్లా అధ్యక్షురాలు బైరి సాయమ్మ, వివిధ మండలాల బాధ్యులు లత, పోసాని, బాయమ్మ, నాగలక్ష్మి, నరేష్, గంగామణితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ : రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడి నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రతినిధిగా మాజీ జెడ్‌పిటిసి రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు భూక్యా రమేష్, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ నాయకులు చిట్యాల లక్ష్మి, సుంకర లక్ష్మి, పూర్ణ, లతీఫ్, మానసతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షుడు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షురాలు గుదే రాజ్యలక్ష్మి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సత్తుపల్లి మండల ప్రధానకార్యదర్శి మహాదేవ లక్ష్మి, పి.సీత, జరీనా, శ్రీలక్ష్మి, జీవ, మాణిక్యం, నాగలక్ష్మి, సుజాత, నాగ మ్మ, సక్కుబాయి, చంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ : మధ్యాహ్న పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌కు యూనియన్ నాయకులు, మధ్యాహ్న భోజన కార్మికులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బిజ్జ శ్రీనివాసులు, జిల్లా ప్రధానకార్యదర్శి మారేడు శివశంకర్‌తో పాటు కార్మికులు గడ్డి, కొప్పుల లక్ష్మి, పుట్ట పార్వతమ్మ, ఆకుమని భీమమ్మ, తిరుపతయ్య, పి.జగన్, వి.మధు తదితరులు పాల్గొన్నారు.



1న ఇండియా కూటమి

‘ఛలో ఢిల్లీ’లో పాల్గొనాలి

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపు

ప్రజాపక్షం/నిజామాబాద్ : నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సర్‌ను రద్దు చేయాలని, సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నవంబర్ 1న ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరగనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎల్ నినో ప్రభావంతో జిల్లాలో కరువు మండలాల వివరాలను వ్యవసాయాధికారులు బహిర్గతపర్చాలని కోరారు. నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించాలన్నారు. వరి ఎకరాకు రూ.30వేల నష్టపరిహారాన్ని, పత్తికి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం, మిర్చి ఎకరాకు 50 వేల రూపాయలు, ఇతర పంటలకు, కూరగాయలకు ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. రిజర్వాయర్లలో, చెరువులలో ప్రస్తుతం ఉన్న నీటిమట్టాలపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలన్నారు. భూగర్భజలాలు బాగా ఉన్న బోర్లలను ప్రభుత్వం ఆధీనంలో తీసుకుని ఆయా గ్రామ, పట్టణ ప్రజలందరికీ సమానంగా తాగునీటిని వాడకం కోసం అందించాలన్నారు. పంటల ఉత్పత్తి తగ్గిన నేటి తరుణంలో మార్కెట్‌లో ధరలు పెరగకుండా నియంత్రించటానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల ఆహార వస్తువులను తక్కువ ధరలతో సరఫరా చేయాలని కోరారు. కౌలు రైతులను గుర్తించి పంట నష్టపరిహారం వారికే ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, రబీలో ఎలాంటి పంటలు వేయని రైతులందరికీ గ్రామీణ ఉపాధిపథకం కింద పనులు కల్పించి, రోజుకు రూ.700లు కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ తాగునీటి వసతి కల్పించాలని కోరారు. పశువులకు పశుగ్రాసం కొరత రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, సభ్యులు ఓమయ్య, రాజన్న, స్వరూపరాణి పాల్గొన్నారు.









పేదలందరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి సురేష్

ప్రజాపక్షం/కల్లూరు : కల్లూరు మున్సిపాలిటీతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పేదలందరికీ ఉపాధి హామీ పనులు కల్పించి, రోజు కూలీ 700 రూపాయలు ఇవ్వాలని, రెండు వందల రోజులు పనులు కల్పించాలని, పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకొని బియ్యం, తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా పేదలకు అందించాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల సత్తుపల్లి నియోజకవర్గ సదస్సు కల్లూరులో మార్కెట్ యార్డ్‌లో వ్యవసాయ కార్మిక సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా



దండి సురేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు కూలీలందరూ ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్ధినేని కరుణకుమార్, ప్రజాసంఘాల నాయకులు దండు ఆదినారాయణ, వేము రాంబాబు, షేక్ రంజాన్ బి,కొత్తపల్లి వెంకటనారాయణ, కృష్ణమూర్తి, రామకృష్ణ, ధనమ్మ, కృష్ణ, వెంకటరమణ, నరసింహారావు, రేణుక, చిట్టెమ్మ, అలివేలు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసిలో చేరిన ఆటో కార్మికులు

ప్రజాపక్షం/మహబూబాబాద్: మున్సిపల్ పరిధిలోని శనగపురం మెడికల్ కాలేజీలకు సంబంధించిన ఆటో అడ్డ కార్మికులు సుమారు 60 మంది బుధవారం ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ ఆధ్వర్యంలో ఎఐటియుసిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకొని ఉద్యోగ అవకాశాలు లేక యువకులు జీవనోపాధి కోసం ఆటోలు నడిపించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. రోజురోజుకు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో ఆదాయం లేక కుటుంబ పోషణకు ఆటో కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఆటోలు ఫైనాన్స్‌లో తీసుకుని, నెల వచ్చిందంటే కిస్తీ కోసం కుస్తీలు పడుతున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో



ఆటోడ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ఆటోకార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెలుగు శ్రావణ్, మంద శంకర్, తండా శ్రీనాథ్, ఆటోకార్మికులు సయ్యద్ యాకుబ్‌పాషా, కె.శ్రీనివాస్, సిహెచ్.వెంకన్న, ఎం.మధు, పడిశాల సైదులు, ఎం.సాగర్, కె.వంశీ, షేక్‌ఇమ్రాన్, జె.సురేందర్, జి.కృష్ణ, కె.రమేష్, జి.సందీప్, ఎల్. వీర భద్రాచారి, ఎం.వినోద్, మనోజ్ పాల్గొన్నారు.



ఎసిబి వలలో అవినీతి చేప

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: పెట్రోల్‌బంకు యజమానినుండి 20వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా యాదాద్రిభువనగిరి జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ కె. వెంకటేశ్వర్లును అతని అనుచరుడు కాసారం రవీందర్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు పక్కా ప్రణాళికతో బుధ వారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతని వద్దనుండి రూ.20వేలు స్వాధీనం చేసుకున్నారు. చౌటుప్పల్ మండలం చీమలకొండూరు గ్రామం ప్రెటోల్‌బం కుకు వెరిఫికేషన్ సర్టిఫికెట్ జారి చేయడంతోపాటుగా డైలీ సేల్స్ రిజిస్టర్‌ను ఇచ్చేందుకు బంకు యజమాని చింతల యాదగిరిని మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు రూ.50వేలు డిమాండ్ చేశారు. అందులో భాగంగా ముందుగా రూ.20వేలు మొదటగా ఇచ్చేందుకు అంగీకారం కుదుర్చు కున్న బంక్ యజమాని ఎసిబి అధికారులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన అధికారులు రూ.20వేలను చింతల యాదగిరికి అందజేశారు. డబ్బును వెంకటేశ్వర్లు అనుచరుడైన ప్రైవేటు వ్యక్తి కాసారం రవీందర్‌కు అందజేయగా అట్టి డబ్బును మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు అందజే యడంతో అక్కడే కాపుకాసి ఉన్న ఎసిబి అధికారులు డబ్బుతో సహా వెంక టేశ్వర్లు అతని అనుచరుడు రవీందర్‌ను అరెస్టుచేసి మీడియా ముందు హాజ రుపర్చారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పి జగదీష్ మాట్లాడుతూ అరెస్టుచే సిన వెంకటేశ్వర్లును నాంపల్లిలోని ఎస్పీఈ, ఎసిబి కేసుల ప్రత్యేక న్యాయ స్థానంలో హాజరుపర్చి కేసు దర్యాప్తు చేపడుతామని తెలియజేసారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ప్రజాపక్షం/చింతపల్లి : భూ ససమస్యల పరిష్కారానికి, రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్‌బాలునా యక్ అన్నారు. మండల పరిధిలోని శ్రీశివసాయి కాటన్‌మిల్లులో సిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బాలునా యక్ ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. భూభా రతి చట్టం ద్వారా భూ రికార్డుల నిర్వాహణలో పారదర్శకతకు చర్యలు తీసు కోనున్నట్లు ఆయన తెలిపారు. సొంత ఇళ్లు పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవాన్ని అందిస్తుందని అన్నారు. ఉపర్పరపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అంగన్‌వాడి కేంద్రంలో చిన్నా రికి బాలునాయక్ అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీ లల్దార్ విజయలక్ష్మీ, నాయకులు దొంతం సంజీవరెడ్డి, హరినాయక్, ఎరు కల వెంకటయ్యగౌడ్, అంగిరేకుల నాగభూషణ్, ముచ్చర్ల గిరి, పవన్‌కు మార్, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టగొట్టొద్దు

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి



ప్రజాపక్షం/దేవరకొండ: మహిళలను కోటీశ్వరులను చేస్తామనే తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న మహిళా వంట కార్మికులను రోడ్డున పడేసే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా నల్లగొండ జిల్లా దేవరకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సంద ర్భంగా రామస్వామి మాట్లాడుతూ 2023/24 సంవత్సరానికి సంబందిం చిన 9నెలల అల్పాహారం పెండింగ్ బిల్లులను వెంటనే కార్మికుల ఖాతాలలో జమ చేయాలని, గత 24 సంవత్సరాలుగా వంట పథకంలో స్వంత డబ్బులు పెట్టుకొని నాణ్యమైన వంటలు చేస్తూ విద్యార్థులను స్వంత పిల్ల లుగా నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికు లకు ఏ ప్రభుత్వాలు కూడా వేతనాలు పెంచకపోయినా అన్యాయం చేయ లేదన్నారు. ఎన్నికల ముందు వంట కార్మికులకు అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయకుండా వంటల మీదనే ఆధా రపడి జీవిస్తున్న 54,200 మంది వంట కార్మికులను రోడ్డున పడేసే విధంగా ప్రభుత్వం మధ్యాహ్న భోజనాన్ని బ్రహ్మాణ సంస్థలైన హరేరామ హరే కృష్ణ వారికి కట్టబెట్టడానికి అల్పాహారం పేరుతో సెంట్రలైజ్డ్ కిచెన్ విధానానికి సిఎం ఆత్రుతగా పనిచేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. పాత పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, బిల్లులు, వేత నాలు ప్రతి నెల మొదటి వారంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటరాములు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్య క్షురాలు జంగమ్మ, ఏఐటీయూసీ మండల కార్యదర్శి మల్లయ్య, ధనలక్ష్మి, యాదయ్య, బుజ్జమ్మ, సాయిలు, సుల్తానా, పద్మ, నారమ్మ పాల్గొన్నారు.

నవంబర్ 6న యువజన కళాకారుల ఎంపిక

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాస్థాయి యువజనోత్సవాల సంద ర్భంగా సూర్యాపేట జిల్లాలోని వయసు 15 నుండి 29 సంవత్సరాల లోపు యువతీ యువకులకు జానపద నృత్యం ((గ్రూప్), జానపాద పాటలు (గ్రూప్), చిత్రలేఖనం, కవిత్వం, వీది నాటకం నందు నవంబర్ 6న జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు డివైఎస్ఓ బి. వెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీ లలో ప్రథమ స్థానం సాధించిన వారిని రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారిని జాతీయ స్థాయిలో జనవరి 10 నుండి 12 వరకు న్యూఢి ల్లీలో జరిగే యువజనోత్సవాలకు పంపడం జరుగుతుందన్నారు. యువ జన ఉత్సవాల్లో పాల్గొనేవారు వారి యొక్క విరాలను నవంబర్ 4లోపు జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న జిల్లా యువజన, క్రీడల కార్యాల యములో స్వయంగా గాని లేదా కార్యాలయం యొక్క ఈమెయిల్ dysosuryapet123@gmail.com కు లేదా వాట్సప్ నెంబర్ 9100949979 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

మానవ హక్కుల కేసుల పట్ల
నల్లగొండ జిల్లా యంత్రాంగం స్పందన భేష్

గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గిన హెచ్‌ఆర్‌సి కేసులు

హెచ్‌ఆర్‌సి చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్



ప్రజాపక్షం/నల్లగొండ : మానవ హక్కుల కేసుల పట్ల జిల్లా యంత్రాంగం స్పందన అద్భుతంగా ఉందని,గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లా నుంచి హెచ్‌ఆర్‌సికి వచ్చే ఫిర్యాదులు గణనీయంగా తగ్గాయని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా ఆర్‌అం డ్‌బీ అతిథి గృహంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిం చిన అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని ఎమ ర్జెన్సీ,ఐసీయూ,యూడీఐడీ కేంద్రాలను సందర్శించి సౌక ర్యాలను పరిశీలించారు.అనంతరం మీడియాతో మాట్లా డుతూ జిల్లాలో అధికారులు బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారని,ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 5 కేసులు మాత్రమే హెచ్‌ఆర్‌సి కి వచ్చాయని, వాటికి కూడా వెంటనే స్పందించి నివేదికలు సమర్పించారని తెలిపారు. గత ఏడాది 45 నుంచి 50 కేసులు రాగా ఒక్క కేసు తప్ప మిగతా అన్నింటినీ పరిష్కరించారన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 17 వేల కేసులు పెండింగ్ లో ఉండగా 15 వేలకు పైగా పరిష్కరించామని, ప్రతిరోజూ 40 నుంచి 50 కేసులు వస్తున్నాయని, అందులో విద్య, ఆరోగ్యం, భూములు, సీనియర్ సిటిజన్స్, పోలీసు,రెవెన్యూ కేసులు ఉంటున్నా యని చెప్పారు.ప్రభుత్వ ఆసుపత్రి సందర్శనలో రోజూ 1200 మంది అవుట్ పేషెంట్లు,700 మంది ఇన్ పేషెంట్ల సామర్థం ఉందని, నెలకు 800 ప్రసవాలు జరుగుతున్నా యని, అందులో 60 సాధారణ ప్రసవాలు,40 సిజేరి యన్ లు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే అధికారుల పరమావధి

ప్రజలకు సేవలు అందించడమే పరమావధిగా అధికా రులు పనిచేయాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు.బుధవారం జిల్లా కేందంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా కలె క్టర్ బి.చంద్రశేఖర్,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,జిల్లా అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్షిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల కమిషన్ కేసుల పట్ల నల్లగొండ జిల్లా యంత్రాంగం తక్షణ స్పందన అభినందనీయమన్నారు. జిల్లా ,రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల అధికారుల సహ కారం బాగుందని ప్రశంసించారు. విద్య, వైద్యం, భూములు, సీనియర్ సిటిజన్స్,పోలీస్,రెవెన్యూ తదితర కేసులతో పాటు సుమోటో కింద కొన్ని కేసులను స్వీక రించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. విద్య,వైద్యం విష యంలో అనేక కేసులు వస్తున్నాయన్నారు.

‘పిఎం రహత్ పథకం’పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకా లంలో వైద్య చికిత్స అందించి వారి ప్రాణా లను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం రహత్ పథకంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. జిల్లా పరి ధిలో మొత్తం 38 ఆసుపత్రుల్లో ఈ పథకం కింద వైద్య సేవలు అందుబాటులో ఉన్నా యని అర్హత నిబంధనలకు అనుగుణంగా రూ.1.5లక్షల వరకు గరిష్టంగా ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవ చ్చని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ప్రమాదంలో గాయపడిన వారిని సమీపం లోని ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య చికిత్స అందేలా సహకరించాలని ప్రజలకు సూచించారు. ప్రమాద బాధితులకు సకా లంలో చికిత్స అందించడం ద్వారా ప్రాణాపా య పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయ డానికి ప్రజలు ముందుకు రావాలని, ప్రమా దం జరిగినప్పుడు క్షతగాత్రులను ఆదుకోవ డంలో నిర్లక్ష్యం చేయవద్దని అత్యవసర పరిస్థి తుల్లో 112కు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. హెల్మెట్ ధరించా లని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

గుర్తించిన 7 గ్రామాల్లో రక్తహీనత సర్వే

సర్వేను 15 రోజుల్లో పూర్తి చేయాలి

కలెక్టర్ బి. చంద్రశేఖర్



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : గిరిజన ప్రాం తాల్లో గుర్తించిన 7 గ్రామాల్లో రక్తహీనత సర్వే ను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలె క్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ కార్యక లాపాలపై సీడీపీఓలు, అంగన్ వాడీ సూపర్ వైజర్లతో సమీక్ష నిర్వహించారు.గిరిజన సంక్షే మ కమిటీ గుర్తించిన 7 గ్రామాల్లో 18 ఏళ్లలోపు బాలికలు, మహిళలకు రక్తహీనత సర్వే నిర్వ హించి,బాధితులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. సర్వే ఫలితాల ఆధా రంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల న్నారు. జిల్లాలో మంజూరైన 41 నూతన అంగన్ వాడీ కేంద్రాలకు సోమవారం లోగా శంకుస్థాపన చేయాలని,నిర్ణీత గడువులో పను లు ప్రారంభించని కేంద్రాలకు తిరిగి అనుమ తులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్ చార్జ్ అద నపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిశు సంక్షేమ శాఖ అధికారి లావణ్య, సీడీపీఓలు, సూపర్ వైజర్లు హాజరయ్యారు.

నవంబర్ 6 చివరి తేదీ

వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల నియోజ కవర్గ ఓటరు నమోదును పెంచేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలె క్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు,ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షిం చారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పెండింగ్ లో ఉన్న ఫారం 6,7,8 దరఖాస్తులను వారంలో పరిష్కరిస్తామని తెలిపారు.ఓటరుగా నమోదు కావాలంటే దరఖాస్తుదారు 3 సంవత్సరాల క్రితం డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలని,స్థానికులై ఉండా లని, దరఖాస్తుతో పాటు స్వీయ ధ్రువీకరణతో కూడిన డిగ్రీ సర్టిఫికెట్, ఇతర పత్రాలు సమర్పిం చాలని తెలిపారు.



విద్యాప్రమాణాల మెరుగుదలకు చర్యలు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురు కులాలు, ఇతర రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు, వారి ఆరోగ్యం, విద్యాప్రమాణాలు, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికా రులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు బాధ్యతాయుతంగా పర్యవేక్షించాలని, సమస్యలను గుర్తించి సకా లంలో పరిష్కరించాలని సూచించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యాసం స్థల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరును ప్రతిరోజూ పర్య వేక్షించాలని సూచించారు. హాజరు వివరాలను సంస్థల వారీగా సేకరించి, ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలలోపు కలెక్టరేట్‌లోని పర్ఫార్మెన్స్ మానిటరింగ్ సిస్టమ్ బృందానికి నివేదించాలని ఆదేశించారు. హాజరు నమోదు వ్యవస్థలో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, అన్ని సంబంధిత సంస్థల్లో సమర్థ వంతంగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత, ఆరోగ్యం, విద్యాప్రగతి విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు నిరం తరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, బిసి వెల్ఫేర్ అధికారి విశాల్, డిఎస్‌సిడిఓ లతా, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, అనూష, ఆర్‌సిఓలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలకు మరో అంతర్జాతీయ ఘనత

ప్రదర్శించే అవకాశాన్ని దక్కించుకున్న తడక వైష్ణవి



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: అంతర్జాతీయంగా పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు మరో అరుదైన ఘనతను సాధించింది.ప్రపంచ ప్రఖ్యాతి చెందిన చేనేత వస్త్ర అవనికలో తెలంగాణ వైభవానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ అందాలకు దేశం పట్టం గట్టేందుకు 12వ పార్లమెంటరీ ఫోరం బ్రిక్స్ కార్యక్రమంలో భారతీయ చేనేత ఉత్పత్తులను ప్రదర్శించే అవకాశం పోచంపల్లికి చెందిన 22 యేళ్ళ తడక వైష్ణవికి దక్కింది. కేంద్ర చేనేత జౌళి శాఖ పరిధిలోని డిసిఎఫ్‌హెచ్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని వీవర్స్ సర్వీస్ సెంటర్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఆమె కొత్త ట్రెండ్ తగ్గట్టుగా వినూత్న కళాకృతులతో నైపుణ్యంతో నేసిన వస్త్రాలను,తయారి దశలను గ్రాఫికల్ డిజైన్‌లను వినియోగదారులకు వివరించారు.అన్ని వయస్సుల వారికే కాకుండా అన్ని వస్తువుల్లో చేనేత మార్కు ప్రతిబింబించేల అందరి అభిరుచులకు అనుగుణంగా వస్త్రాల ప్రదర్శన చేస్తున్నారు.దేశ వ్యాప్తంగా ఎంపికైన నాలుగు చేనేత స్టోర్లలో చిటికి లూమ్స్ ఒకటిగా నిలిచి 21దేశాల ప్రతినిధుల సమక్షంలో ఆమే భారతీయ చేనేత కళా వైభవాన్ని ప్రదర్శిం చింది. కాగా హైదరాబాద్ మణికొండలో ఉన్న చిటికి లూమ్స్ ద్వారా వైష్ణవి సంప్రదాయ చేనేత కళకు ఆధునికతను జోడిస్తూ భారతీయ నేతకా రుల నైపుణ్యాన్ని ప్రపంచానికి చెప్పాలనే సంకల్పంతో విశేషంగా కృషి చేస్తు న్నారు.సంప్రదాయ పోచంపల్లి ఇక్కత్ చీరలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతం. నైపుణ్యంతో కూడిన టై అండ్ డై పద్ధతి జ్యామితీయ ఆకృతులను ప్రతేక మైన డిజైన్లతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది.అలాంటి గొప్ప వార సత్వం నుంచి వచ్చిన వైష్ణవి సప్రదాయాన్ని కాపాడుతూనే కొత్త డిజైన్లపై దృష్టి సారిస్తున్నారు.భారతీయ నేత కారుల నైపుణ్యాన్ని ముందుతరాలకు అందించాలన్న లక్ష్యంతో ప్రయాణిస్తుండటం విశేషం.

సాగునీరు సాధనకు ఉద్యమం : సిపిఐ



ప్రజా పక్షం / సంస్థాన్ నారాయణపురం: సిపిఐ మండల కౌన్సిల్ సమా వేశం సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో చిలివేరు అంజయ్య అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, కె శ్రీనివాస్‌లు హాజరై మాట్లాడుతూ సాగునీరు సాధనకై ఉద్యమించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈనెల 31న సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో జరిగే రాచకొండ రిజర్వాయర్ సాధనకై చేపట్టే ధర్నాకు రైతులు, ప్రజలు పాల్గొని పోరాటానికి మద్దతు తెలిపాలని కోరారు. గతంలో సిపిఐ పార్టీ అనేక రూపాలలో ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి పై ఉద్యమాలను నిర్వహిం చారు. రెండుసార్లు పాదయాత్ర, నియోజకవర్గ స్థాయిలో సదస్సులు, సీని యర్ ఇంజనీర్లతో సమీక్షలు, ఈ ప్రాంత సస్యశ్యామలం కోసం సిపిఐ అలుపు లేని పోరాటాలు, అమరవీరుల త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. రాచకొండ ప్రాంతంలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి భూగర్భ జలాలను పెంపొందించడంతోపాటు రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రకటించిన శరవేగంగా పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి శివన్నగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా నారాయణపురం చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించే దిశగా పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. రిజర్వాయర్ ఏర్పా టుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కల కొండ సంజీవ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పల్లె మల్లారెడ్డి, సుర్వి నరసింహా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి దుబ్బాక సంజీవ, సర్పంచ్ ముత్యాల అంజయ్య, నల్లవెల్లి ముత్యాలు, శాఖ కార్యదర్శులు బదుల పెంటయ్య, గుండు నరసింహా, మన్నె భీమారెడ్డి పాల్గొన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు రేషన్ డీలర్లకు హరీశ్‌రావు అన్యాయం

ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: గజ్వేల్‌లో జరిగిన డీలర్ల రాష్ట్ర సదస్సులో హరిష్ రావు మాట్లాడిన మాటల్లో ఏమాత్రం నిజంలేదని, 10 సంవత్సరాలు అధికా రంలో ఉండి కూడా రేషన్ డీలర్ల సమస్యలు పట్టించుకోకుండా కనీసం వారి కమిషన్ పెంచటానికి అ ఇష్టంగా ప్రవర్తించిన హరీష్‌రావు రాష్ట్ర సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డీలర్లను కలవలేదని, టైం కూడా ఇవ్వలేదని విమర్శించడం తగదని తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి యర గాని నాగన్నగౌడ్ అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర డీలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాల బాధ్యులు హైద్రాబాద్‌లోని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నివాసం వద్దకు రాగా వారిని కలిసి మాట్లాడి వినతిపత్రం తీసుకుని వారు డీలర్ల సమస్యల పట్ల మా ప్రభు త్వం సాధ్యమైనంత వరకు తీర్చడానికి సుముఖంగా ఉన్నదని తెలిపి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి డీలర్ల సమస్యను లెటర్ ద్వారా తెలియజేసి త్వరలో డీలర్ల బాధ్యులతో చర్చిస్తామని తెలియజేసిన విషయం గురించి వివరించారు. హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై, ఉత్తమ్‌కుమా ర్‌రెడ్డి టైం కూడా ఇవ్వడంలేదని మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీలర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు ఎన్‌డి అజ్మతుల్లా, ప్రధాన కార్యదర్శి గుండు గురవయ్య, యూనియన్ నాయకులు రాగం లింగయ్య, మామిడి కాశయ్య, పేరబోయిన వెంకటేశ్వర్లు, అర్వపల్లి వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

ప్రజాపక్షం/నల్లగొండ : రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. బుధ వారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవ సాయ విద్యుత్, పరిశ్రమల ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్,ఆయిల్ తదితర భాగా లను దొంగిలిస్తూ రైతులకు, సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఘటన లపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మిర్యాలగూడ డిఎస్పి జి.రవి ఆధ్వ ర్యంలో,నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, మిర్యాలగూడ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ జె. సోమనర్సయ్య,రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పిఎన్‌డి ప్రసాద్,వేములపల్లి ఎస్ఐ వి సురేష్ రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు జరిపి ముఠాను గుర్తించినట్లు వెల్లడించారు. వేములపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు 22న ధనవత్ పాండు నాయక్ ఫిర్యాదు మేరకు... నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ పై ఉన్న ఎల్15 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ కు చెందిన 500 కేవీవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 300 కిలోల కాపర్, 250 లీటర్ల ఆయిల్ చోరీ అయినట్లు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేపట్టారు. గతంలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ దొంగిలించి హయత్‌నగర్‌లోని పాత సామాన్ల వ్యాపారి దేశీరామ్‌కు అమ్మినట్లు ఒప్పుకున్నారు. డబ్బులు ఇచ్చేందుకు, మరికొంత కాపర్ కొనేందుకు అతను మిర్యాలగూడ రాజీవ్ నగర్‌లోని చంద్ పాషా ఇంటికి వచ్చాడని చెప్పడంతో అతన్ని కూడా అదుపులోకి తీసు కుని వారి వద్ద నుంచి డబ్బులు, కాపర్, సఫారీ కారును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బాలల హక్కులపై అవగాహన



ప్రజాపక్షం/లక్ష్మ ణ చందా : సురక్షిత్ బచ్‌పాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె. భవిష్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్యాల్‌లో బుధవారం విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జెజెబి మెంబర్ నరేష్ కుమార్ బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఎస్ఐ శ్రావణి పోక్సో చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. డిఎల్ఎస్ఎ లీగల్ హెడ్ కౌన్సిల్ లింగ గౌడ్,అడ్వకేట్ రమణా గౌడ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూషణ్,పారా లీగల్ వాలంటీర్స్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

'కొండపల్లి'లో 1000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్: అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పోలీసు అధికారులు స్పందించారు. పెంచి కల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామంలో బుధవారం ఉదయం పోలీసులు చేపట్టిన కార్డన్ అండ్ సెర్చ్ తనిఖీల్లో గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. గ్రామంలో గుడుంబా తయారీ కేంద్రాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి పానకాన్ని పారబోసినట్లు పేర్కొన్నారు.గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యం



ప్రజాపక్షం/మందమర్రి: యాసంగి సీజన్‌లో నీటి వనరులకు అనుగుణంగా వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి సూచించారు. మందమర్రి మండలం అం దుగులపేట గ్రామ పంచాయతీలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ నిర్వహించారు. రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. రైతులు నూనెగింజలు, పప్పుధాన్యాలు, ఉద్యాన పంటల వైవిధ్యీకరణ చేపట్టాలని సూచించారు. నేల సారం దెబ్బతినకుండా ఉండేందుకు పంట వ్యర్థాలను దహనం చేయవద్దని స్పష్టం చేశారు.వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్. కనకరాజు, గ్రామ సర్పంచ్ ముత్యం రమ, పంచాయతీ కార్యదర్శి వీరేందర్, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ప్రజాపక్షం/లక్షెట్టిపేట: ప్రస్తుత సమాజంలో సవాలుగా మారిన సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ ఎస్ఐ హైమ సూచించారు. మంచిర్యాల జిల్లా డిసిపి ఆదేశాల మేరకు లక్షెట్టిపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో షీ టీమ్స్ నిర్వహిస్తున్న పాత్ర, లక్ష్యాలను వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ట్రాఫిక్ నిబంధనలు, వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. ఆపద లేదా సమస్య ఎదురైనప్పుడు వెంటనే డయల్ 100 లేదా రామగుండం షీ టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700, మంచిర్యాల షీ టీమ్ నంబర్ 8712659385కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామ కల్యాణి, షీ టీమ్ సిబ్బంది శ్రవణ్, రాజేందర్, వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పేదలకు వరం : ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ నేరడిగొండ: పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ కలీం ఆధ్వర్యంలో నిర్వహించినలో 37 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, సాధీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఎంపిడిఒ గంగాసాగర్ రెడ్డి, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

మెదక్ ఆర్డీఓ రమాదేవి వెల్లడి

ప్రజాపక్షం/నిజాంపేట్ : రీసర్వేతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. నిజాంపేట మండలం వెంకటాపూర్ కెలో బుధవారం భూములను రీ సర్వేపై ఏర్పాటుచేశారు. ఏళ్ల తరబడి మోకపై ఉన్న రైతులకు ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తుందని, అక్రమంగా పట్టాలు పొందిన వారికి సంక్షేమ పథ కాలు రద్దయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన రైతులకు న్యా యం చేస్తామన్నారు. కిషన్, తహసిల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ ము త్యాల సరిత మధుసూదన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఉప సర్పంచ్ గజం ప్రవీణ్, గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

'భైంసా' సమగ్రాభివృద్ధికి కృషి

2040నాటి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/భైంసా : భైంసా పట్టణ సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ కీలకంగా దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు.బుధవారం భైంసా పురపాలక కార్యాలయంలో మాస్టర్ ప్లాన్ అమలుపై రెండో కన్సల్టేటివ్ వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌పై సంబంధిత స్టేక్‌హోల్డర్లతో ఇప్పటికే కలెక్టరేట్‌లో తొలి కన్సల్టేటివ్ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.ప్రస్తుత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సంబంధిత వర్గాలకు ఏవైనా సందేహాలు,అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.తాజా గణాంకాల ప్రకారం భైంసా పట్టణ జనాభా సుమారు 60 వేల వరకు ఉందని, భవిష్యత్‌లో జనాభా మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా పట్టణ ప్రణాళిక ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 2040 నాటికి పట్టణ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, మైదానాలు, పార్కులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.అందరి సహకారం,సూచనలతో భైంసా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసి పట్టణ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేద్దామని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మాస్టర్ ప్లాన్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా రూపొందించాలని సూచించారు.ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై ఎవరికైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పారిశ్రామిక, వాణిజ్య, నివాస ప్రాంతాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ మౌలిక వసతుల మెరుగుదలకు మాస్టర్ ప్లాన్ ఎంతో కీలకమని పేర్కొన్నారు.కన్సల్టేటివ్ వర్క్‌షాప్‌లో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఏడీ అశ్విని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను వివరించారు. పారిశ్రామిక, వాణిజ్య, నివాస జోన్లకు సంబంధించిన పటాలను, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై పలువురు వ్యక్తం చేసిన సందేహాలను ఆమె నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ కుతిజా సిద్ధికీ, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఎఎస్‌పి సాయి కిరణ్,మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ ఎస్‌టి కమిషన్ కృషి

జాటోతు హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/నిజామాబాద్ : గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సిఎస్‌టి) అంకిత భావంతో కృషి చేస్తోందని కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. సంబంధిత శాఖల అధికారులు కూడా నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి జాతీయ కమిషన్‌తో చర్యలు చేపట్టవచ్చనే దానిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్, సిరికొండ మండలంలోని సర్పంచ్ తండా, గడ్డమీది తండా, కొండాపూర్, గోప్యాతండాను, నవీపేట్ మండలంలోని మాన్‌సింగ్ తండాలను సందర్శించారు. పై ప్రాంతాల్లో గిరిజనులతో మమేకమై వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంకనూ అందుబాటులోకి రావల్సి ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి, సిపి సాయిచైతన్యలతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అన్ని శాఖల అధికారులతో సమస్యలపై గిరిజనులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డిఎఫ్ఒ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, అదనపు డిపిసి శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురష్, జాతీయ ఎస్‌సి కమిషన్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, డిఆర్ఒ గీత, ఆర్‌డిఒ రాజేంద్రకుమార్, అధికారులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన

జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి సుచరిత

ప్రజాపక్షం/ అల్లాదుర్గం : సురక్షిత్ బచ్‌పన్ అభియాన్‌లో భాగంగా మండలంలోని ముస్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జూనియర్ సివిల్ కోర్ట్ జడ్జి సుచరితవిద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన ప్రత్యేక సదస్సు నిర్వహించారు.బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని వివరించారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడాలను గుర్తించాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండటంతో పాటు సామాజిక మాధ్యమాలను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా వేధింపులను అరికట్టవచ్చని తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు!


దళితులు, గిరిజనులకు అన్యాయం.. అనర్హులకు ఇళ్లా?, విచారణ జరిపితేనే న్యాయం జరుగుతుందంటున్న బాధితులు

ప్రజాపక్షం/నిర్మల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యం క్షేత్రస్థాయిలో నీరుగారుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం కొత్త లోలం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై తీవ్ర వివాదం నెలకొంది.అర్హులైన నిరుపేదలు, దళితులు, గిరిజన కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని, అనర్హులకు ప్రాధాన్యం కల్పిస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఆశలకు లబ్ధిదారుల ఎంపికలోని అవకతవకలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి జాబితా ఏమైంది? మార్పుల వెనుక ఎవరున్నారు? కొత్త లోలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం తొలుత రూపొందించిన అర్హుల జాబితాను పక్కనపెట్టి, అనంతరం మార్పులు చేశారనే ఆరోపణలు వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. సర్పంచ్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి,తనకు అనుకూలమైన వ్యక్తులకు లబ్ధి చేకూర్చేలా జాబితాను మార్పించారనే విమర్శలు గ్రామంలో వినిపిస్తున్నాయి.నిబంధనల ప్రకారం ఇల్లు లేని నిరుపేదలకు, అర్హత కలిగిన దళిత,గిరిజన కుటుంబాలకు ప్రాధాన్యం ఇ వ్వాల్సి ఉండగా,వారి పేర్లను పక్కనపెట్టి ఆర్థికం గా మెరుగైన స్థితిలో ఉన్నవారిని ఎంపిక చేశారనే ది బాధితుల ప్రధాన ఆరోపణ.నిజంగా ఇల్లు లేని కుటుంబాలకు కాకుండా, అనర్హులుగా భావిస్తున్న వారికి ఇళ్లను కేటాయిస్తే ప్రభుత్వ పథకం ఉద్దేశ మే దెబ్బ తింటుందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ధ్రువీకరణపైనా అనుమానాలు! లబ్ధిదారుల ఎంపికలో గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు జరిగిన పరిశీలనపై బాధితులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఇళ్ల పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.మండల అధికారులు, గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ ప్రక్రియలోనూ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అయితే,అధికారుల పాత్రపై వచ్చిన ఆరోపణలను నిర్ధారించేందుకు సమగ్ర విచారణ అవసరం. అర్హతను నిష్పక్షపాతంగా ధ్రువీకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.





కలెక్టర్ జోక్యం చేసుకోవాలి! జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని గ్రా మస్థులు కోరుతున్నారు. వ్యక్తిగత ప్రాధాన్యాలకు అనుగుణంగా ఎంపిక జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారదర్శక విచారణతోనే పేదలకు న్యాయం : ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు అండగా నిలవాల్సిందిపోయి, ఈ వివాదాలకు వేదికగా మారడం ఆందోళనకరమని బాధితులు పేర్కొంటున్నారు.కొత్తలోలం ఇందిరమ్మ ఇళ్ల వివాదంపై జిల్లా కలెక్టర్ స్పందించి, వాస్తవాలను వెలికితీసి అ ర్హులకు న్యాయం చేస్తారా? అన్నది వేచి చూడాలి.

జనాభా గణనకు క్షేత్రస్థాయిలో పటిష్ఠ ప్రణాళిక

మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ప్రజాపక్షం / మెదక్ : మెదక్ జిల్లాలో జనాభా గణన–2027 రెండవ దశ నిర్వహణకు సంబంధించి అక్టోబర్ 28, 29 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను గురువారం అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. జనగణన–2027లో భాగంగా జనాభా గణన దశ–2కు సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని మెదక్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, చార్జ్ అధికారులు అదనపు చార్జ్ అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జనాభా గణన రెండవ దశలో గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై జనాభా గణనకు సంబంధించిన విధివిధానాలు, చేపట్టాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు మరియు గణాంకాల సేకరణ ప్రక్రియపై శిక్షణ అందించారు. జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు హైదరాబాద్ నుంచి వచ్చిన జనగణన శాఖ అధికారినిలు మార్గపూడి ఉష, చించెట్టి మోనిక రెండు రోజులపాటుశిక్షణ అందిస్తున్నారని వివరించారు. జనగణన ప్రక్రియను నిర్దేశిత నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరెండంట్లు, పాల్గొన్నారు.

పంట పొలంలో మొసలి కలకలం

ప్రజాపక్షం/పాపన్నపేట : మండల పరిధిలోని ఎంకే పల్లి గ్రామ శివారులో బుధవారం ఉదయం పంటపొలంలో మొసలి ప్రత్యక్షమై రైతులు, గ్రామస్థులను భయాందోళనకుగురిచేసింది. మంజీరా నది తీరంలో నీటిమట్టం తగ్గిపోవడంతో మొసలి సమీపంలోనిపంటపొలంలోకి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. పొలంలో మొసలిని చూసిన రైతులు ఆందోళనకు గురై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఆర్ఓ హేమచందన తమ సిబ్బంది తో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, మొసలిని పట్టుకునేందుకు రెస్క్యూ టీమ్‌కు సమాచారం అందించారు. దీంతో సంగారెడ్డి నుంచి ప్రత్యేక రెస్క్యూ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని చాకచక్యంగా మొసలిని బంధించింది. అనంతరం మొసలిని సురక్షితంగా వన్యప్రాణి కేంద్రానికి తరలించారు. దీంతో గ్రామస్థులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మంజీరా నది పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ పనులు చేపట్టే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచించారు. మొసళ్లు లేదా ఇతర వన్యప్రాణులు కనిపించినప్పుడు వాటిని పట్టుకునేందుకు ప్రయత్నించకుండా, వాటికి దూరంగా ఉండి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

జిల్లా అభివృద్ధి టిఆర్ఎస్ తోనే సాధ్యం

ప్రజాపక్షం / జైనూర్: జిల్లా సమగ్ర అభివృద్ధి టిఆర్ఎస్ తోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ కిషన్ నాయక్ అన్నారు. జైనూర్ మండల కేంద్రంలోని కెఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు, రైతులు, విద్యార్థులకు ప్రస్తుత పాలనలో నిజమైన అభివృద్ధి ఫలాలు అందడం లేదని విమర్శించారు. టిఆర్ఎస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం, అభివృద్ధి దక్కుతాయని స్పష్టం చేశారు. అనంతరం మండలంలోని పలువురు నాయకులు పార్టీ కండువాలు కప్పుకుని టిఆర్ఎస్‌లో చేరారు. రానున్న రోజుల్లో ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా చేరికలు భారీగా ఉంటాయని తెలిపారు. ఈ నెల 30న ఇంద్రవెల్లిలో నిర్వహించనున్న పంచజన్య సంకల్ప సభకు తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హాజరుకానున్నారని వెల్లడించారు. మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు మనోహర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వినోద్ చారి, జిల్లా జాయింట్ సెక్రెటరీలు డాక్టర్ అశోక్ మహోల్కర్, సాయి చారి, పెందుర్తి ధర్మం, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు దుర్గే శ్యామ్ సుందర్, బిసి సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ధరావత్ పుష్పలత, ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు కొట్నక కిషన్, అరుణ్ మాహుల్కర్, ఇంద్రజిత్ ఉప్రే సోనీ పాల్గొన్నారు.

పిల్లల రక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యత

సీనియర్ సివిల్ జడ్జి పోరిక రవీందర్

ప్రజా పక్షం /ఖానాపూర్ : సమాజంలో బాలల హక్కుల పరిరక్షణ,భద్రత అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశమని నిర్మల్ జిల్లా సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పోరిక రవీందర్ తెలిపారు.బుధవారం ఖానాపూర్ మండల పరిధిలోని మస్కాపూర్ పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్‌పన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా న్యాయ, రక్షణ అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి పోరిక రవీందర్ మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడులు,వేధింపులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోక్సో చట్టం2012 యొక్క సమగ్ర వివరాలు,శిక్షల తీవ్రత గురించి వివరించారు.సమాజంలో బాలలు తమ హక్కుల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, అన్యాయం జరిగితే ధైర్యంగా ప్రశ్నించాలని సూచించారు.విద్యార్థులకు పలు కీలక అంశాలపై సూచనలు చేశారు.గుడ్ టచ్ బ్యాడ్ టచ్.. శరీర భాగాల భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, ఎవరైనా అసౌకర్యంగా ప్రవర్తిస్తే లేదా అనుచితంగా తాకితే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు. భయపడి మౌనంగా ఉండడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తుందని తెలిపారు.అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత.. పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలు,బహుమతులు, లిఫ్ట్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గేమింగ్ మోసాలు,సైబర్ బెదిరింపుల బారిన పడకుండా ఇంటర్నెట్‌ను కేవలం విద్యావసరాలకే ఉపయోగించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.ఆపదలో ఉన్న చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, పోలీస్ అత్యవసర నంబర్ 100 కు తెలియపర్చాలని తెలిపారు.సర్పంచ్ దోనికేని లక్ష్మీ, ఎస్ఐ రాహుల్ గౌక్వాడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి శ్రీనివాస్, ఖానాపూర్ బార్ అసోసియేషన్ ఎం.రాజశేఖర్, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ గడప దీప్తి, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు వెంకట్ మహేంద్ర, బాశెట్టి శివకుమార్,గాండ్ల నరేంద్రనాథ్,రాచమల్ల అశోక్,పారా లీగల్ వాలంటీర్లు రమేష్, రాములు, ఉపాధ్యాయులు బి.నరేందర్, వి. అంజయ్య,షేక్ ఇమ్రాన్, పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా చర్యలు

ఎమ్మెల్యే చింతాప్రభాకర్

ప్రజాపక్షం/కొండాపూర్ : రైతులు కష్టపడి పండించిన వరి దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి వారికి న్యాయంగా దక్కాల్సిన మద్దతు ధర అందించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మారేపల్లి తొగర్‌పల్లి పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని దాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ అందించాలి : సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించిన మేరకు రైతులకు ప్రయోజనం అందించాలని చింతప్రభాకర్ డిమాండ్ చేశారు. పిఎసిస్ చైర్మన్లు ఆకుల పవన్, మున్నూరు రాజు, వైస్ చైర్మన్లు డైరెక్టర్లు మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకం విఠల్, కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, సర్పంచులు రామాగౌడ్, మహేష్ ,అనిల్, కృష్ణ ,పాండురంగం , దేవేందర్, అమరేందర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి ప్రేమా రామచంద్రయ్య, ఉక్కుద్దీన్, రవి, బచ్చయ్య, నరేందర్‌రెడ్డి, జగదీశ్వర్ ,మోహన్ గౌడ్, శేఖర్, కృష్ణారెడ్డి ,అంజనేయులు గౌడ్, సంపోద్దీన్ ,ప్రభాకర్ గౌడ్, నరేందర్ పాల్గొన్నారు.



గిరిజనుల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

ప్రజాపక్షం/పెంబి : మండలంలోని పసుపుల గ్రామంలో షెడ్యూల్డ్ కులాల/గిరిజనుల అభ్యున్నతి మరియు జీవనోపాధిని మెరుగుపరచడమే లక్ష్యంగా డెవలప్మెంటల్ యాక్షన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (డిఎపిఎస్‌టి) ఆధ్వర్యంలో బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీఇన్పుట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రామ్‌ను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాలలోని రైతులకు మరియు లబ్ధిదారులకు నాటుకోళ్ల పెంపకంపై శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించి, సమగ్ర శిక్షణ అందజేశారు. అలాగే, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు వీలుగా అవసరమైన ఇన్పుట్లను పంపిణీ చేశారు.పలువురు అధికారులు,నిపుణులు , సర్పంచ్ మహదేవ్ ,ఉపసర్పంచ్ శ్రీనివాస్ మరియు స్థానిక లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
గురువారం
29-10-2026
www.prajapaksham.in

నిరాకరణ (మొదటి పేజీ తరువాయి)

ఎదురైనా ఢిల్లీ ర్యాలీలో పాల్గొని తీరుతామని స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమానికి తెలంగాణ నుంచి వెళ్లే నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలన్న విజ్ఞప్తికి సానుకూల స్పందన రాకపోవడంతో కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట బుధవారం మెరుపు ధర్నా నిర్వహించి, అనంతరం రైల్వే స్టేషన్ వద్ద నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఢిల్లీలో జరిగే పార్టీ నిరసనకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు రైల్వే శాఖను కోరారు. అయితే రైళ్ల కేటాయింపుపై సానుకూల స్పందన లేకపోవడంతో రైల్వే జిఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రత్యేక రైళ్ల కేటాయింపును అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.ధర్నాలో రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి,శ్రీ గణేశ్, ఎంపి రఘురామ్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు మోత రోహిత్, దీపక్ జాన్ తదితరులు పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వద్ద నిరసన కొనసాగడంతో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ...ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని ఎంపిలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి దక్షిణ మధ్య రైల్వే జీఎంకు దరఖాస్తు చేసినట్లు ఆయన తెలిపారు. రెండు, మూడు నెలలుగా ఇండియా కూటమి ధర్నాలు, నిరసనలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ప్రత్యేక రైళ్ల కోసం వెళ్లిన నాయకుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచనల మేరకే రైళ్లు కేటాయించడం లేదని, దక్షిణాది నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీ ర్యాలీకి జన సమీకరణ కోసం కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రత్యేక రైళ్ల కేటాయించకపోయినా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఢిల్లీకి చేరుకుని నిరసన గళం వినిపిస్తామని స్పష్టం చేశారు. మోదీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని వ్యాఖ్యానించారు.

తలెత్తకుండా చర్యలు (మొదటి పేజీ తరువాయి)

దృష్టిలో ఉంచుకుని క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టిపి) వంద శాతం సామర్థ్యంతో పనిచేసేవిధంగా చూడాలని సిఎం ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని సెక్రటేరియట్‌తో పాటు సిఎంఓ, అవుటర్ రింగ్, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు వినియోగించేలా చూడాలని సిఎం తెలిపారు. పబ్లిక్ పార్క్‌లు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మాణంలో శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సిఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్‌టిపిల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సిఎం ఆదేశించారు. ఎస్‌టిపిల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు.

నవంబర్ 1 నుంచి నిబంధనలు అమలు

ఎస్‌టిపిల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1వ తేదీ నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఎస్‌టిపిలలో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొదన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి నిరంతరం పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును ఎప్పటికిప్పుడు హైడ్రా పర్యవేక్షించాలన్నారు. ట్రీటెడ్ వాటర్ సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సిఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం 26 ఎస్‌టిపిలలో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు సిఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సిఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండి జితేష్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి.ముకుందరెడ్డి పాల్గొన్నారు.

ఇయు కూటమి నిరసన (మొదటి పేజీ తరువాయి)

ఆర్‌టిసి కార్మికుల హక్కులతో ఆటలాడితే సహించేదిలేదని హెచ్చరించారు. యూనియన్ల గుర్తింపు ఎన్నికల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలను సరిదిద్ది కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల ప్రజాస్వామ్య తీర్పును గౌరవించకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే కార్మికుల పక్షాన రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని ప్రకటించారు. పదేళ్ల తర్వాత జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో కార్మికులు ప్రలోభాలకు లొంగకుండా తమ సత్తా చాటారని అన్నారు. ఎన్నికల ఫలితాలను వక్రీకరించే ప్రయత్నాలు చేయడం సరైందికాదని, ఏ నిబంధనల ప్రకారం రీజియన్‌ల ఫలితాలు వెల్లడించారో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించి తప్పులను సరిదిద్దాలని, కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని ఆయన స్పష్టం చేశారు.

నాలుగు రీజియన్ల గుర్తింపుపై అభ్యంతరాలు: ఎన్.బాబు

నల్గొండ, వరంగల్, మెదక్, సికింద్రాబాద్ రీజియన్లలో క్లాస్–6 ఫలితాలపై అభ్యంతరాలున్నాయని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.బాబు తెలిపారు. 50 శాతానికి పైగా మెజారిటీ సాధించని చోట్ల కూడా గుర్తింపు కల్పించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి, 1958 కోడ్ ఆఫ్ డిసిప్లిన్, గత నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా క్లాస్–3 గుర్తింపు లభించినప్పటికీ, ప్రాంతీయ గుర్తిం పు విషయంలోనూ న్యాయం జరగాలని డి మాండ్ చేశారు.

న్యాయం చేయకుంటే ఉద్యమం: ఈదురు వెంకన్న

సంస్థ రీజియన్ స్థాయి ఎన్నికల ఫలితాలలో అక్రమాలు జరిగాయని ఆధారాలతో అదనపు కార్మిక కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. కార్మిక చట్టాల నిబంధనల ప్రకారం మొత్తం పోలైన ఓట్లలో 50 శాతంతో పాటు ఒక్క ఓటు మెజారిటీ ఎవరికి వస్తే ఆ యూనియన్‌కు గుర్తింపు ఇవ్వాలని, కానీ టి డబ్ల్యు యు కు నల్గొండలో 1,019 ఓట్లకు గాను 965, వరంగల్ లో 1,521కు గాను 1,451, మెదక్ లో 905 కు గాను 887 ఓట్లు మాత్రమే వచ్చాయని వివరించారు. అయినప్పటికీ వారికి అక్రమంగా స్థానిక గుర్తింపు కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశామన్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి మూడు, నాలుగు రోజుల గడువు కోరారని తెలిపారు. ఎన్నికల ఫలితాలలో తప్పులను సరిదిద్ది న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని వెంకన్న హెచ్చరించారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు: ఎండి యూనుఫ్

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్‌ను గెలిపించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలుపుతూ, రీజియన్ల ఫలితాలలో తప్పులను సరిదిద్దే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎఐటియుసి జాతీయ ఉ పాధ్యక్షులు ఎండి యూనుఫ్ స్పష్టం చేశారు.

ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి: ఎం.నరసింహా

టిజిఎస్ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలను ముందుగానే ప్రకటించాలని, ఎన్నికల అనంతరం కొత్త నిబంధనల పేరుతో కార్మికులకు అన్యాయం చేయడం సరికాదన్నారు.

కార్మిక సంక్షేమ భవన్ కాదు.. కమిషన్ భవన్: ఎం. థామస్ రెడ్డి, ఎం.నరేందర్

కార్మికులకు న్యాయం చేయాల్సిన వ్యవస్థలు వారి సమస్యలను పరిష్కరించడంలో విఫలమవడం సరికాదని టిఎంయు ప్రధాన కార్యదర్శి ఎం.థామస్ రెడ్డి, ఎన్ఎంయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నరేందర్ విమర్శించారు. ఎన్నికల గుర్తింపు వివాదాన్ని నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని, కార్మికుల హక్కులను విస్మరిస్తే ఐక్యంగా పోరాడతామని హెచ్చరించారు.

అతలాకుతలం (మొదటిపేజీ తరువాయి)

దక్షిణనైరుతిగా 60 కిలోమీటర్లు, మచిలీపట్నానికి తూర్పుఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు వెల్లడించింది.

మరో 12 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం..

తీరం దాటిన అనంతరం తుఫాన్ క్రమంగా బలహీనపడుతోందని ఐఎండీ తెలిపింది. తదుపరి ఆరు గంటల్లో తీవ్ర తుఫాన్ స్థాయి నుంచి తుఫాన్ స్థాయికి, ఆ తర్వాతి ఆరు గంటల్లో వాయుగుండం స్థాయికి బలహీనపడే అవకాశం ఉందని అంచనా వేసింది. రానున్న 48 గంటల్లో ఉత్తరవాయవ్య దిశగా కదులుతూ మరింత బలహీనపడే అవకాశం ఉందని పేర్కొంది. మచిలీపట్నం రాడార్‌తో పర్యవేక్షణ చేస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. తుఫాన్ కదలికలను మచిలీపట్నంలోని డాప్లర్ వాతావరణ రాడార్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది.తుఫాన్ బలహీనపడుతున్నప్పటికీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావం వెంటనే పూర్తిగా తగ్గిపోతుందని భావించ కూడదన్నారు. ప్రజలు అధికారులు జారీ చేసే తాజా హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎపిలో ఏడుగురు మృతి

ఈ తుపాను ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాలు, కోస్తాంధ్ర జిల్లాలో, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రహదారులతోపాటు ఇళ్లపై చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. వరిపంట నేలకొరిగింది. గత రెండు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలిన ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. విశాఖలో పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె. మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. భీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్(45) మతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాషప్పురంలో వద్ధరాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురు గాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు.

31వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్‌లో భారీ వర్షాలు...

బుధవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్ తీరంలో తీరాన్ని దాటిన 'అర్నాబ్' తుఫాను ప్రభావంతో పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలలో అక్టోబరు 31వరకు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. మంగళవారం పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని తీరప్రాంత, దక్షిణ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని ఐఎండి తెలియజేసింది. కాగా, రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ జిల్లాలలో శుక్రవారం వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి విడుదల చేసిన బులెటిన్ తెలిపింది.అర్నాబ్ తుఫాను కారణంగా పుర్బా మేదినీపూర్, దక్షిణ 24పరగణాలు, ఝర్‌గ్రామ్, పశ్చిమ్ మేదినీపూర్, బాంకురా,పురూలియాలో శుక్రవారం ఉదయం వరకూ భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండి పేర్కొంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా భద్రతా చర్యగా కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి (ఎన్ఎస్‌సిబిఐ) రాకపోకలు సాగించే అనేక విమానాలను రద్దు చేసినట్లు ఎన్ఎస్‌సిబిఐ విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటన తెలిపింది.

















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com